


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

జ్ఞానేశ్‌ను కాపాడేందుకే మోదీ ప్రభుత్వం ఎత్తుగడలు 07

రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలపై తమిళనాడులో మాజీ మంత్రి అరెస్ట్

సైనిక ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాల సేకరణకు రక్షణశాఖ ఆమోదం

సంపుటి 09, సంచిక: 326 | మంగళవారం | 27-10-2026 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### తుమ్మిడిహెట్టి ఎత్తు పెంపునకు

# మహారాష్ట్ర సానుకూలత

**ప్రతిపాదన అధ్యయనానికి రెండు రాష్ట్రాల ఇరిగేషన్ ముఖ్యకార్యదర్శులతో కమిటీ**

- తెలంగాణ అభ్యర్థనను పరిశీలించేందుకు స్వతంత్రంగా అధ్యయనం చేయాలని నిర్ణయించినట్లు మహారాష్ట్ర సిఎం వెల్లడి
- తుమ్మిడిహెట్టి నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఫడ్నవీస్‌తో భేటీ
- దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటన
- సమావేశంలో ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ప్రజాపక్షం/హైదరాబాద్

'తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలనే తెలంగాణ ప్రభుత్వ అభ్యర్థనను మరోసారి పరిశీలించేందుకు సిద్ధంగా ఉన్నాం. మహారాష్ట్రకు, తమ ప్రజలకు ఎలాంటి ప్రతికూల ప్రభావం లేకపోతే 148 మీటర్ల ఎత్తు ఒప్పందాన్ని పునర్ పరిశీలించేందుకు అభ్యంతరం లేదు. తెలంగాణ నీటి అవసరాలకు సహకరించేందుకు కూడా తమకు ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే, తుది నిర్ణయానికి వచ్చే ముందు పలు అంశాలపై అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. సాంకేతిక, పర్యావరణ, పరిపాలనాపరమైన అంశాలను పరిశీలించాలి. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముందుకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాం'' అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి చెప్పారు. తెలంగాణకు అత్యంత కీలకమైన తుమ్మిడిహెట్టి నీటిపారుదల ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో సమావేశమయ్యారు. ముంబైలోని సహ్యాద్రి ప్రభుత్వ అతిథి గృహంలో సోమవారం జరిగిన ఈ భేటీలో తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ, మహారాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణంపై ఈ సమావేశంలో కీలకమైన చర్చలు జరిగాయని, బ్యారేజీ ఎత్తు పెంపు, నీటి లభ్యత, ముంపు ప్రభావం, ఇతర సాంకేతిక అంశాలపై సమగ్రంగా చర్చించారు. చర్చల సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి బ్యారేజీ కేవలం సాగునీటి ప్రాజెక్టు మాత్రమే కాదని, రెండు రాష్ట్రాలను భౌతికంగా అనుసంధానించే వారధిగా కూడా తరువాయి 8లో



### రెండు రాష్ట్రాలకు వారధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధానంగా వెనుకబడిన అటవీ ప్రాంతమని, అక్కడి గిరిజనులు, ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర సిఎం దృష్టికి తీసుకెళ్లారు. కొమురం భీమ్ సాగించిన జల్, జంగిల్, జమీన్ పోరాటాన్ని గుర్తు చేశారు. ఆ పోరాట కాలం నుంచి ఆదిలాబాద్ ప్రాంత ప్రజలు సాగు, తాగునీటి సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దశాబ్దాలుగా వారి ఆకాంక్షలు నెరవేరలేదని, ఆదిలాబాద్ గిరిజనులు, ఆదివాసీల జీవితాల్లో వెలుగులు నింపాల్సిన తరువాయి 8లో






### మితవాద ప్రభంజనాన్ని తిప్పికొట్టిన బ్రెజిల్

# లులా చారిత్రక గెలుపు

- బ్రెజిల్ మీ పెరటిదొడ్డి కాదు : ట్రంప్‌కు లులా హెచ్చరిక
- భారత ప్రధాని మోదీ, వామపక్షనేతల అభినందనలు
- లులా విజయాన్ని అంగీకరించని ఫ్లావియా బోల్సెనారో

**నేడు లులా జన్మదినం**

**బర్త్‌డే గిఫ్ట్‌గా గెలుపు**

**సావోపోలో:** మితవాద ప్రభంజనాన్ని అడ్డుకుని బ్రెజిల్ అధ్యక్షుడు,వామపక్ష కార్మిక నాయకుడు లులా డసిల్వా ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. దీంతో దేశవ్యాప్తంగా సంబురాలు మిన్నంటాయి. ఆయన 44 లక్షల ఓట్లు అధికంగా సంపాదించుకున్నారు.ఆదివారం జరిగిన రన్నాఫ్ ఎన్నికల్లో లులా డసిల్వా 51.79 శాతం ఓట్లు సంపాదించుకోగా,ఆయనపై పోటీచేసిన ప్రధాన ప్రత్యర్థి ఫ్లావియా బోల్సెనారోకు 48.21 శాతం ఓట్లు లభించాయి. లులా డసిల్వా వయసు 81 సంవత్సరాలు.1945 అక్టోబరు 27న జన్మించారు. మంగళవారం ఆయన జన్మదినం. నాలుగో సారి దేశాధ్యక్షుడుగా ఆయన గెలుపు జన్మదిన కానుకగా మారింది. దీంతో దేశవ్యాప్తంగా లులా పార్టీ కార్యకర్తలు సంబురాలు చేసుకుంటున్నారు. కాగా డోనాల్డ్ ట్రంప్‌ను ప్రతిఘటనశక్తిగా ఉన్న లులా విజయానంతరం సావోపోలోలో ఒక ప్రకటన చేస్తూ,'బ్రెజిల్ ఇంకెంతమాత్రం మీ(అమెరికా) పెరటి దొడ్డి కాదు',ఎవరి అధీనంలోనూ లొంగి ఉండదు' అని హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మద్దతుతో అర్జెంటీనా, చిలీ, కొలంబియా,పెరూ వంటి దేశాలలో ఏర్పడిన మితవాద ప్రభుత్వాల ప్రభంజనాన్ని లులా డసిల్వా అడ్డుకున్నారు.లాటిన్ అమెరికాలో అమెరికా ప్రభావం విస్తారంగా పెరుగుతోందని భయపడుతున్న విమర్శకులకు లులా విజయంతో ఉపశమనం కలిగింది. గడచిన 37 సంవత్సరాలలో ప్రత్యక్ష ఎన్నికలు మొదలైన తర్వాత మొదటిరౌండులో ఓడిపోయిన ఏ అభ్యర్థీ తిరిగి రెండోరౌండు లేదా తుది విడత రన్నాఫ్ ఎన్నికలలో విజయం సాధించలేదు. కానీ లులా తరువాయి 8లో

### ట్రంప్ పన్నాగాలు తిరస్కరణ

**లులా విజయంపై సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అభినందన**

**న్యూఢిల్లీ:** బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో నాలుగో సారి విజయం సాధించిన వామపక్ష,కార్మిక నాయకుడు,ప్రస్తుత అధ్యక్షుడు లులా డసిల్వాకు భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా అభినందనలు తెలియజేశారు.''అభినందనలు లులా! అభినందనలు బ్రెజిల్! అని ఆయనను బ్రెజిల్ దేశ ప్రజలను కొనియాడారు.ప్రజాస్వామ్యం, సార్వభౌమాధికారం,మరింత మెరుగైన గొప్ప ప్రపంచం కోసం పోరాటం తరువాయి 8లో

### తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు తెస్తే

# పదవికి రాజీనామా

**లేదంటే ఉత్తమ్ రాజీనామా చేయాలి : బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉపనేత హరీశ్ రావు**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న వైఫల్యాలు, డైవర్షన్ రాజకీయాల వల్లనే తెలంగాణలో కరువు పరిస్థితులు దాపురించాయని బిఆర్‌ఎస్ ఎల్‌పి ఉపనేత తన్నీరు హరీశ్ రావు విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.25 వేల కోట్లు ఖర్చు చేసి తుమ్మిడిహెట్టి నుంచి నీళ్లు తెచ్చి సుందిళ్లలో పోస్తామనడం, గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు తెస్తామని చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని ఎద్దేవా చేశారు. గ్రావిటీ ద్వారా నీళ్లు తెస్తే తాను రాజీనామా చేయడానికి సిద్ధమని, ఒకవేళ అది సాధ్యం కాకపోతే తరువాయి 12లో





సిపిఐ రాష్ట్ర సమితి సమావేశంలో రాజకీయ పరిస్థితులు, కార్యాకలాపాల నివేదిక సమర్పించిన సిపిఐ రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సమావేశంలో మాట్లాడిన సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి

# తక్షణం కరువు మండలాలు ప్రకటన

**నష్టపోయిన రైతులకు పరిహారం, కరువు సహాయక చర్యలు చేపట్టాలి : సిపిఐ రాష్ట్ర సమితి డిమాండ్**

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తక్షణమే కరువు మండలాలను ప్రకటించి, పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడంతో పాటు కరువు సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సిపిఐ రాష్ట్ర సమితి రెండు రోజుల సమావేశాలు సోమవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ప్రారంభమయ్యాయి. పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్ రెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, పార్టీ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సమావేశాల నుంచి ఇప్పటి వరకు పార్టీ నిర్వహించిన కార్యకలపాలతోపాటు రాష్ట్రంలో రాజకీయ తరువాయి 8లో

### బిఆర్‌ఎస్ తప్పిదాలతోనే తెలంగాణకు నీటి కష్టాలు

ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**03**

### కరువు పరిస్థితులపై తప్పుడు ప్రచారం

- అఖిలపక్ష సమావేశానికి రావాలి: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

### 'అర్నబ్' తుఫాన్ ప్రభావం

# నేడు, రేపు భారీ వర్షాలు

- మరో ఐదురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరిక




ప్రజాపక్షం/హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుఫాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలో వాతావరణ పరిస్థితులు మారనున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం రాష్ట్రంలో పొడి వాతావరణం కొనసాగుతున్నప్పటికీ మంగళవారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశముందన్నారు. మంగళ, బుధవారాల్లో పలు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి, ములుగు, తరువాయి 12లో

### జ్ఞానేశ్‌ను తొలగించాలని మోదీకి చెబితే

### 30 సెకన్లలో నిరసనలు

# ఆగుతాయ్



- ఢిల్లీ వ్యాపారులకు ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ భరోసా
- ప్రభుత్వమే మెట్రోను మూసివేసింది, రోడ్లు దిగ్బందించిందని వెల్లడి
- దొంగిలించబడిన ఓటుతో దుకాణాలు, సేవింగ్స్, పిల్లల భవిష్యత్తు ఏవీ సురక్షితం కావని ఆందోళన

**న్యూఢిల్లీ :**దీపావళి పండుగ నేపథ్యంలో తమ వ్యాపారాలు దెబ్బతింటాయని ఆందోళన చేస్తూ ఓటు చోరీకి వ్యతిరేకంగా ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నవంబరు 1వ తేదీన ఇండియా కూటమి ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసనను వాయిదా వేసుకోవాలని స్థానిక వ్యాపారులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై ఇప్పటికే ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీకి వ్యాపారులు లేఖ రాశారు. అయితే వారి విజ్ఞప్తులపై రాహుల్‌గాంధీ స్పందించారు. నాల్గోవ నెంబర్ నిందితుడైన కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పండని సూచించారు. ఈ విధంగా చేస్తే 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయని రాహుల్ భరోసానిచ్చారు. 'ఢిల్లీలోని ప్రతి వ్యాపారినీ ప్రేమిస్తాం. మీ మాట వింటున్నాం. ప్రభుత్వమే మెట్రోను మూసివేసింది, రోడ్లనూ సీల్ చేసింది దేశ రాజధానిని దిగ్బంధించింది' అని సోమవారం రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. దొంగిలించబడిన ఓటుతో మీ దుకాణాలు, సేవింగ్స్, మీ పిల్లల భవిష్యత్తు ఏదీ సురక్షితం కాదు అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించమని మోదీకి చెప్పండి, 30 సెకన్లలో నిరసనలు ఆగిపోతాయని ఆయన స్పష్టం చేశారు. దీపావళి షాపింగ్ ఉధృతంగా సాగే సమయంలో రూ.10,000 కోట్ల విలువైన వ్యాపారానికి అంతరాయం కలగవచ్చని పేర్కొంటూ ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో నవంబర్ 1న జరగాల్సిన తరువాయి 12లో

### రిటైర్డ్ ఐపిఎస్ అధికారి భార్య హత్య

# నేపాల్ ముఠా అరెస్ట్

- ఐదు నెలల వేటకు తెర.. కేసు ఛేదించిన పోలీసులు
- నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో పట్టివేత.. బెంగళూరు, ఢిల్లీలోనూ దోపిడీలకు కుట్ర భగ్నం

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రిటైర్డ్ ఐపిఎస్ అధికారి భార్య హత్య, దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ప్రశాసన్ నగర్‌లోని నివాసంలో తనుజ రంజన్‌ను హత్య చేసి, బంగారు ఆభరణాలు దోచుకెళ్లిన కేసులో నేపాల్‌కు చెందిన అంతర్రాష్ట్ర ముఠాలోని నలుగురు నిందితులను హైదరాబాద్ నగర పోలీసుల ప్రత్యేక దర్యాప్తు బృందం, జూబ్లీహిల్స్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఐదు నెలలకు పైగా సాగిన గాలింపు, సాంకేతిక నిఘా అనంతరం అక్టోబరు 26న నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.51,130 నగదుతో పాటు కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి.సజ్జనార్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల తరువాయి 12లో





# నీరు, విద్యుత్ పొదుపుగా వాడాలి

- తక్కువ నీటితో పండే పంటలను సాగు చేయాలి
- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు
- ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ప్రజాపక్షం/ రఘునాథపాలెం

సూపర్ ఎల్ నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని నీటిని, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. యాసంగిలో తక్కువ నీటితో పండే పంటలు సాగు చేయాలని ఆయన సూచించారు. సోమవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి పర్యటించారు. మండలంలోని మల్లేపల్లి తరువాయి 12లో

# లులాకే బ్రెజిలియన్‌ల పట్టం

లాటిన్ అమెరికాలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ, కమ్యూనిస్టు–వామపక్ష భావాల ప్రాబల్యం ఉన్న బ్రెజిల్ అధ్యక్ష ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మద్దతుగల మితవాదులు మట్టికరిచారు. ప్రస్తుత అధ్యక్షుడు, కార్మికవర్గ నాయకుడు లూయిజ్ ఇనాసియో లులా డా సిల్వా దేశాధ్యక్షునిగా నాల్గవ పర్యాయం, వరుసగా రెండవ పర్యాయం ఎన్నికైనారు. ఆదివారం జరిగిన రెండవ రౌండ్ పోలింగ్‌లో వామ పక్ష కూటమికి ప్రాతినిధ్యం వహిస్తున్న లులాకు 51.79 శాతం ఓట్లు లభించగా, పచ్చి మితవాద ప్రత్యర్థి, మాజీ అధ్యక్షుని కుమారుడు ఫ్లావియో బోల్స నారోకు 48.21 శాతం ఓటర్ల మద్దతు లభించింది. అక్టోబర్ 4న జరిగిన ఎన్నికల్లో లులాకన్నా 2శాతం ఎక్కువ ఓట్లు పొందిన ఎఫ్.బోల్సనారో రెండవ రౌండ్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే లులా వర్కర్స్ పార్టీ, బ్రెజిలియన్ కమ్యూనిస్టు పార్టీతో కూడిన కూటమి నాయకులు, కార్యకర్తలు తొలి దఫా లులాకు ఓటు వేయని కార్మికులు, ఎవరికీ ఓటువేయని తటస్థులకు నచ్చజెప్పి పెద్ద సంఖ్యలో ఓటింగ్‌కి తీసుకురావటం వల్ల ఈ విజయం సాధ్యమైంది. బ్రెజిల్ సహా లాటిన్ అమెరికా దేశాల రాజ్యాంగాల నిర్దేశం ప్రకారం ఎన్నికల తొలి దఫా పోలింగ్‌లో ఏ అభ్యర్థికైనా 50శాతం పైగా ఓట్లు లభించకపోతే, ఆ ఎన్నికల్లో మొదటి, రెండవ స్థానాల్లో నిలిచిన అభ్యర్థుల మధ్య రెండవ దఫా పోలింగ్ జరపాలి. మన దేశంలోలాగా అత్యధికంగా ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థిని విజేతగా ప్రకటించే అవకాశం లేదు. అందు వల్ల మైనారిటీ ఓటుతో అందలమెక్కి మెజారిటీ ప్రజలను పరిపాలించే వీలు లేదు. రెండవ రౌండ్ లో 80సంవత్సరాల వయసున్న లులాకు 45ఏళ్ల ఫ్లావియో బోల్సనారో కన్నా 3.58 శాతం ఓట్లు అదనంగా లభించాయి. అంటే లులాకు తొలి దఫాకన్నా 5.58శాతం ఓట్లు అదనంగా లభించాయి. పరిపూర్ణ సంఖ్యలు లులా విజయం లోతును తెలియజేస్తాయి. లులా తొలిరౌండ్‌లో ప్రత్యర్థికన్నా 22 లక్షల ఓట్లు వెనుకబడ్డారు. కాగా రెండవ రౌండ్‌లో తొలి రౌండ్‌తో పోల్చితే 65 లక్షల ఓట్లు అదనంగా లభించాయి. ఇది వామ పక్ష కూటమి మూడు వారాల్లో సాధించిన అద్భుతమైన విజయం. ఒపీనియన్ పోల్స్ చివరి దశవరకు మితవాదులకు పైచేయిగా చిత్రించాయి.

ఇదెలా సాధ్యమైంది? వర్కర్స్ పార్టీ, కమ్యూనిస్టు పార్టీలకు ట్రేడ్ యూని యన్‌లలో పెద్ద పునాది ఉంది. తొలి రౌండ్ ఓటమి తర్వాత ప్రతి టియు సభ్యుడూ ఒక కొత్త ఓటరును కలిసి మితవాద ప్రమాదం గూర్చి నచ్చజెప్పి లులాకు అనుకూలంగా ఓటు వేసేటట్టు ప్రయత్నించాలని కోరటం జరిగింది. బ్రెజిల్ అమెరికన్ల వలసపాలన ప్రాంతం కాకుండా నివారించేందుకు లులాకు ఓటు వేయాలంటూ ఎన్నికల ప్రచారంలోకి జాతీయవాదం చొప్పిం చారు. లులా కూడా సవాలుగా తీసుకుని అధ్యక్షుడు ట్రంప్ తొత్తు అయిన పచ్చి మితవాది బోల్సనారో పాలనసుంచి దేశాన్ని కాపాడుకోవలసిందిగా బ్రెజిలియన్లకు విజ్ఞప్తి చేశారు. ఆయన విజ్ఞప్తి వామపక్షయేతర పౌరులను కూడా కదిలించిందని ఎన్నికల ఫలితం నుంచి అర్థం చేసుకోవచ్చు. ట్రంప్ పని గట్టుకుని లాటిన్ అమెరికా దేశాల్లో పచ్చి మితవాద ప్రభుత్వాల స్థాపనకు సహాయపడుతున్న నేపథ్యంలో, వామపక్షపాలన కింద ఉన్న అతిపెద్ద దేశ మైన బ్రెజిల్ అధ్యక్ష ఎన్నిక ఫలితం కోసం లాటిన్ అమెరికా దేశాల్లోని వామ పక్షాలన్నీ ఆసక్తితో ఎదురుచూశాయి. అందువల్ల లులా ఎన్నిక ఒక్క బ్రెజిల్‌కే గాక అమెరికా ఖండంలోని వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలకు, నాయకులకు, కార్యకర్తలందరికీ, ప్రగతిశీల ప్రజలందరికీ సంతోషకరం, ఉత్తేజదాయకం.

శనివారం జరిగిన తుది ఎన్నికల సభకు హాజరైన 10లక్షల మంది, అప్పటికే విజయం ఖాయమైనదన్నట్లుగా వేడుక జరుపుకున్నారు. ఫలితం ప్రకటన అనంతరం శావోపాలోలో సభలో లులా ప్రసంగిస్తూ, "దేశంలో పరిపాలన తీరును మార్చుతాం. ఈ ఎన్నిక నిరాకరణ వాదానికి ఓటమి. భగవంతునికీ, బ్రెజిలియన్ ప్రజలకు నా ధన్యవా దాలు. ప్రజాస్వామ్యం వల్ల ఇది సాధ్యమైంది" అన్నారు. "అధ్యక్షా, మీరు రెండవసారి బ్రెజిలియన్ డెమొక్రసీని కాపాడారు" అని ఉపాధ్యక్షుడు గెరల్డో అల్‌క్‌మిన్ కొనియాడారు. జెయిర్ బోల్సనారో సాగించిన ప్రజావ్యతిరేక పాలన, లులాను తప్పుడు కేసులతో జైల్లో నిర్బంధించటం, కోర్టు ఆదేశంపై నిర్దోషిగా విడుదలైన లులా నాలుగేళ్ల క్రితం అధ్యక్ష ఎన్నికల్లో మూడవసారి గెలిచి తొలిసారి ప్రజాస్వామ్యాన్ని రక్షించారు. మాజీ అధ్యక్షుడు జెయిర్ బోల్సనారో 2022 ఎన్నికల్లో లులా గెలిచిన తదుపరి దాన్ని అంగీకరించ కుండా తిరుగుబాటుకు ప్రయత్నించిన నేరారోపణపై సుప్రీంకోర్టు విధించిన 27 మాసాల శిక్ష అనుభవిస్తున్నారు. ఆయన కుమారుడైన ఫ్లావియో బోల్స నారో తన ఓటమిని అంగీకరించకుండా, ఈ ఎన్నిక రద్దు కోసం తన లీగల్ టీం పోరాడుతుందని చెప్పటం విచారకరం. గత రెండు సంవత్సరాల్లో అర్జెంటీనా, చిలీ, కొలంబియా, ఈక్వెడార్, బొలీవియాల్లో ట్రంప్ ప్రత్యక్ష, పరోక్ష జోక్యా లతో పచ్చి మితవాదులు అధికారంలోకి వచ్చారు. ఆ క్రమాన్ని బ్రెజిలియన్లు అడ్డుకున్నారు. అయితే 50 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో మలుపులు చూసిన డా సిల్వాకు వయోభారంతోపాటు కొత్త అసెంబ్లీలో మైనారిటీలో ఉండటం ఇబ్బందికర పరిస్థితి. ఆయన అధ్యక్షునిగా ఎన్నికైనప్పటికీ, డిప్యూ టీల ఛాంబర్(పార్లమెంటు), రాష్ట్ర ప్రభుత్వాల్లో ఆయన కూటమి మైనారిటీలో ఉంది. అందువల్ల తన విధానాల అమలుకోసం అధ్యక్షుడు లులాకు గడసాము తప్పదు.



## చిరు వ్యాపారులకు మినహాయింపు ఇవ్వాలి

యుపిఐ ఎండిఆర్ ఛార్జీల నుంచి చిరు వ్యాపారులకు మినహాయింపు ఇవ్వాలి. యుపిఐ వ్యవస్థ నుంచి ఆదాయం కంటే స్థానిక వ్యాపారుల జీవనోపాధిని కాపాడుకోవడమే ముఖ్యం. యుపిఐ అంటే ప్రతి రోజూ బంగారు గుడ్లు పెట్టే బాతులాంటిది. ఒక్కసారిగా వంద గుడ్లు కావాలన్న ఆశతో దాన్ని చంపేస్తే చివరకు ఏమీ మిగలదు. యుపిఐ వ్యవస్థ ఇప్పుడు రోజువారీ జీవితంలో ఓ భాగమైంది. ఈ దశలో ఛార్జీలు విధిస్తే మొత్తం వ్యవస్థ బలహీనపడే అవకాశం ఉంది.

– తమిళనాడు నేత కె.అన్నామలై



# మారథాన్ సామాజిక సందేశం

మారథాన్, పరుగును మించిన సామాజిక సందేశం. ఆరోగ్యానికి అడు గులు, ఆత్మీయతకు వారధులు, సమాజానికి స్ఫూర్తి.పరుగెత్తడం కంటే నడవడం ముఖ్యం, గమ్యాన్ని చేరడం కంటే ఆరోగ్యంగా జీవించడం ముఖ్యం. వ్యక్తిగత విజయాల కంటే సమాజంతో కలిసి సాగడం మరింత ముఖ్యం. నేటి ఉరుకుల పరుగుల జీవితంలో మనిషి ఎన్నో విజయాలు సాధిస్తున్నాడు. ఆధు నిక సౌకర్యాలను అందిపుచ్చుకుంటున్నాడు. కానీ అదే సమయంలో ఆరోగ్యా నికి అవసరమైన శారీరక శ్రమను, మనుషుల మధ్య ఆత్మీయ పలకరింపులను క్రమంగా కోల్పోతున్నాడు. గంటల తరబడి మొబైల్ ఫోన్ల ముందు గడుపు తున్నాం. చిన్న దూరాలకు సైతం వాహనాలను ఆశ్రయిస్తున్నాం. పక్కనే నివసి స్తున్న వారితో మాట్లాడటానికి కూడా సమయం కేటాయించలేకపోతున్నాం. ఈ పరిస్థితుల్లో నడక, వ్యాయామం, సామూహిక క్రీడలు మన జీవితాల్లో భాగం కావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇటీవల BTR విల్లాస్‌లో నిర్వహించిన మారథాన్ ఈ విషయాన్ని మరో సారి గుర్తు చేసింది. 300 మందికి పైగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో రెండేళ్ల చిన్నారి నుంచి 80 ఏళ్ల వృద్ధుడి వరకు ఉత్సాహంగా అడుగులు వేయడం విశేషం. అది కేవలం ఒక క్రీడా కార్యక్రమం కాదు. వయసు, హోదా, వ్యక్తిగత భేదాలకు అతీతంగా మనుషులను కలిపే ఒక సామాజిక వేదిక. ఇటువంటి కార్యక్రమాలు ప్రతి కాలనీ, అపార్ట్‌మెంట్ సముదాయం, గ్రామం, పట్టణం లోనూ స్ఫూర్తిదాయకంగా నిలవాలి. ఆరోగ్యం కోసం పెద్ద ఖర్చులు చేయడం కంటే, రోజూ కొంత సమయం కేటాయించడం ముఖ్యం. నడక, సైక్లింగ్, యోగా, చిన్నచిన్న వ్యాయామాలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతకూ తోడ్పడతాయి. వయసు, శారీరక సామర్థ్యానికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ తమకు సరిపోయే వ్యాయామాన్ని ఎంచుకోవాలి. పోటీలో గెలవా లనే ఒత్తిడి కంటే, క్రమం తప్పకుండా పాల్గొనాలనే సంకల్పం ముఖ్యం.

ఇలాంటి కార్యక్రమాలకు మరో ప్రత్యేకత ఉంది. ఇవి తరాల మధ్య అంత రాలను తగ్గిస్తాయి. పిల్లలకు పెద్దల అనుభవాలు తెలుస్తాయి. యువతకు సామాజిక బాధ్యతపై అవగాహన పెరుగుతుంది. వృద్ధులకు ఆత్మీయ సాంగత్యం లభిస్తుంది. ఒంటరితనం తగ్గి, పరస్పర సహకారం పెరుగుతుంది. ఆరోగ్యకరమైన సమాజం అంటే వ్యాధులు తక్కువగా ఉండటమే కాదు, ఒకరి నొకరు పలకరించుకునే, కష్టసుఖాల్లో తోడుగా నిలిచే మనుషులు ఎక్కువగా ఉండటం కూడా. అయితే ఇటువంటి కార్యక్రమాల బాధ్యత నిర్వాహక సంఘా లకే పరిమితం కాకూడదు. నివాస సముదాయాల కమిటీలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి. పిల్లలకు సురక్షితమైన ఆటస్థలాలు, యువతకు క్రీడా వసతులు, పెద్దలకు నడక మార్గాలు, వృద్ధులకు విశ్రాంతి ప్రదేశాలు కల్పించాలి. పార్కులను కాపాడాలి. అందరికీ అందుబాటులో ఉండే సామూహిక కార్యక్రమాలను ప్రోత్సహించాలి. అదే సమయంలో ప్రతి పౌరుడికీ బాధ్యత ఉంది. ఆరోగ్యం కోసం రోజూ కొంత సమయం కేటాయించాలి. పొరుగువారితో పరిచయాలు పెంచుకోవాలి. పిల్ల లను ఆటలకు ప్రోత్సహించాలి. వృద్ధులను ఒంటరిగా వదిలేయకూడదు. సామాజిక కార్యక్రమాలను విమర్శించడానికే పరిమితం కాకుండా, సాధ్యమై నంత మేరకు పాల్గొని సహకరించాలి. పోటీ కంటే భాగస్వామ్యానికి, వ్యక్తిగత ప్రయోజనం కంటే సమష్టి శ్రేయస్సుకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఒకరోజు మారథాన్ నిర్వహించడం మంచి ఆరంభం. కానీ దాని స్ఫూర్తిని ప్రతిరోజూ కొనసాగిం చడం అసలైన విజయం. వారానికి ఒక సామూహిక నడక, నెలకు ఒక క్రీడా కార్యక్రమం, పిల్లలు–పెద్దలు కలిసి పాల్గొనే సామాజిక వేడుక. ఇలాంటి చిన్న ప్రయత్నాలే కాలక్రమంలో బలమైన సమాజాన్ని నిర్మిస్తాయి.

గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే, ఆరోగ్యం మన వ్యక్తిగత సంపద, ఆత్మీయత మన సామాజిక సంపద. మన అడుగులు ఆరోగ్యం వైపు సాగాలి. మన పలకరింపులు అనుబంధాలను పెంచాలి. మన ప్రయత్నాలు సమాజాన్ని బలోపేతం చేయాలి. ఎందుకంటే దూరాన్ని కొలిచేది అడుగులతో కావచ్చు, కానీ ఒక సమాజం గొప్పతనాన్ని కొలిచేది అందులోని మనుషుల మధ్య ఉన్న అనుబంధాలతోనే. ఆరోగ్యంగా జీవిద్దాం, ఆత్మీయంగా కలిసుందాం, ఆరోగ్యక రమైన, ఆనందమయమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములమవుదాం.

కొలను వెంకటేశ్వర రెడ్డి

# కాళీ ఆలయంలో మాంసం తిన్న బిజెపి సనాతనులు – సమర్థనలు



ఎం. కోటేశ్వరరావు

మేకపిల్లను తినదలుచుకున్న తోడేలు కథ తెలిసిందే, అయి నా తెలియనివారి కోసం క్లుప్తంగా చెప్పుకుందాం. ఒక కొండవాగు ఎగువన తోడేలు ఉంది. దిగువన ఉన్న మేకపిల్లను చూసి దాన్ని ఎలాగైనా తినాలని అనుకుంది. మేకపిల్లా మేకపిల్లా నేను తాగే మంచినీటిని ఎందుకు మురికి చేస్తున్నావని అడిగింది. అదేంటి నువ్వు ఎగువన నేను దిగువన కదా ఉన్నది, కొండమీద ఉన్న నీటిని నేను కలుషితం చేయటం ఏమిటి అని మేకపిల్ల ప్రశ్నించింది. నువ్వుగాకపోతే నీ తల్లి చెడగొట్టిందిలే అని మేకపిల్లను ఎగరేసుకుపో యింది. దాని మాదిరే దుర్గాపూజను శరద్ ఉత్సవాలంటున్నారని వాటిని మూసివేయాలని బిజెపి తోడేలు వాదించి దాడులు చేసింది. పశ్చిమబెంగాల్లో దసరా సందర్భంగా శరద్ ఉత్సవాల పేరుతో సిపిఐ (ఎం) ఇతర వామపక్షాలు పుస్తకదుకాణాలను ఏర్పాటు చేసి విక్రయిం చటం దశాబ్దాలుగా జరుగుతున్నది. కొత్తగా అధికారానికి వచ్చిన బిజెపి ప్రభుత్వ ముఖ్యమంత్రి సువేందు అధికారి ఆ దుకాణాలను అడ్డు కొనేందుకు కుట్రచేశారు. దుర్గాపూజ అని గాకుండా శరద్ ఉత్సవాలు అని పిలిస్తే అలాంటి వారి దుకా ణాలను అనుమతించరాదని ఏకంగా అసెంబ్లీలోనే పిలుపు ఇచ్చారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా కాషాయ దళాలు వామపక్షాల పుస్తక దుకాణాల ధ్వంసం, తగులబెట్టటం, నిర్వాహకులపై దాడులు కొనసాగిం చారు. న్యాయస్థానం భిన్నమైన తీర్పులు ఇచ్చింది. దసరా ముగిసినా హిందూత్వ మూకలు వామపక్ష భావజాలంపై ప్రారంభించిన దాడికి తెరపడలేదు. ఎలా కొనసాగించాలా అని వారు చూస్తుంటే ఏవి ధంగా ఎదుర్కోవాలా అని పురోగామి శక్తులు తయా రవుతున్నాయి. ఒక భావజాలాన్ని తర్కంతో ఎదు ర్కోవచ్చు తప్ప పుస్తకాలను తగులబెడితేనో, అమ్మ నివ్వకుండా చేస్తేనో అడ్డుకోలేరు. ఐరోపాలో పెట్టుబ డిదారీ విధానాన్ని వ్యతిరేకించిన కొందరు పరిశ్రమ ల్లో యంత్రాలను నాశనం చేస్తే పెట్టుబడిదారులు నాశనం అవుతారని అదే పని చేశారు. అది జరిగిందా? గతంలో బ్రిటీష్ పాలకులు కొన్ని పుస్తకాలు, సిని మాలు, కళారూపాల మీద నిషేధం విధించితే జనా లు వాటికోసం ఎగబడ్డారు. చరిత్ర నుంచి కాషాయ దళాలు ఎలాంటి పాఠాలు నేర్చుకోలేదు.

చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలకు భిన్నమైన భాష్యాలు చెబుతున్నారు. వాటిలో అభ్యుదయవాదులు చెప్పిన పురోగామి లక్షణాలు, నిరోధకులు ప్రవచించిన తిరోగామి అంశాలూ ఉన్నాయి. మానవ సమాజ చరిత్రను చూసినపుడు అవసరం లేనివాటిని వదిలించుకుంది తప్ప కొనసాగించటం లేదు. తాను పక్కా సనాతనవాదిని అను చెప్పు కున్న పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి (బిజెపి) కమ్యూనిస్టులు హిందూ ఆచారాలను పట్టించుకోరని, వక్ర భాష్యాలు చెబుతారంటూ రాజకీయపరమైన దాడి జరుపుతారు. కమ్యూనిస్టుల పాలనలో దుర్గా, గణేష్ పూజలేకాదు ఏ ఇతర మత పండుగలకైనా ఏ రోజైనా త్రిపుర, కేరళ, పశ్చిమబెంగాల్లో అధికారం లో ఉన్నపుడు ఎప్పుడైనా ఆటంకాలు కల్పించిన ఉదంతం ఒక్కటైనా ఉందా? బెంగాల్లో దుర్గా పూజా మండపాల పరిసరాల్లో అనేక మంది తమ వస్తువులు, బొమ్మలు అమ్మినట్లే కమ్యూనిస్టులు పుస్తకాల షాపులు పెట్టి విక్రయాలు చేస్తున్నారు, ఆ మాటకు వస్తే ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలు కూడా అదే మాదిరి దుకాణాలు తెరిచి తమ భావజాల పుస్తకాలను విక్రయిస్తు న్నారు. ఎవరికి ఇష్టమైన వాటిని వారు కొనుగోలు చేస్తారు. పూజలు, విశ్వాసాలు మండపాలకే తప్ప వెలుపల కాదు. గణేష్, దుర్గ ఇతర మండపాలను ఏర్పాటు చేస్తున్నవారు జనాలనుంచి చందాల రూపంలో దండుకున్న మొత్తాలతో తాగితందనాలాడటం గురించి తెలియనిదెవరికి?

సనాతన కబుర్లు చెప్పే బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి శతాబ్దాలనాటి కొల్‌కతా కాళి ఆలయంలో లొట్టలు వేసుకుంటూ భోగ్ పేరుతో చేప తల మాంసం, వేపుడు, పులావు తిన్నారు. దానిమీద హిందూత్వశక్తులు అభ్యంతరపెడితే అది బెంగాల్ సంప్రదాయం తప్పేమీ లేదని స్వయంగా సిఎం, బిజెపి సమర్థించుకుంది. ఇదే ఏ కమ్యూనిస్టులో, మరొకరో చెబితే ఈ పాటికి ఎంతమందికి మనోభావా లు దెబ్బతిని ఆసుపత్రులపాలై ఉండేవారో! బీఫ్ గురించి నిత్యం రాద్దాంతం చేసే కాషాయ దళాలు దాన్ని ఎక్కువగా తినే ఈశాన్య రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల్లో మంచి రుచికరమైన బీఫ్ సరఫరా చేస్తా మని ఎన్నికల వాగ్దానాలు కూడా చేసిన ఉదంతాలు ఉన్నాయి, అవకా శవాదానికి వారు మారుపేరు. కాళీమాతకు చేపలు, గొర్రె మాంసం సమర్పించటం ఆచారంగా ఉంది. అది బిజెపి, దాన్ని కన్న ఆర్‌ఎస్‌ఎస్, ఈ హిందూత్వశక్తులు పుట్టక ముందునుంచే అలా చేస్తున్నారు. కౌషికి అమావాస్య రోజున సిఎం చేపల మాంసం తిన్నారు. హిందువుల్లో శాక్త సాంప్రదాయాన్ని పాటించే వారికి అమావాస్య పవిత్రమైనది, మాంసం తినటం తప్పుకాదు. అలాంటి వారు ప్రతిచోటా ఉన్నారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లో గ్రామదేవతలకు జంతుబలులు, మాంసాలు వండు కొని తినటం అందరికీ తెలిసిందే. ఆ సందర్భాలకు బంధు,మిత్రులను కూడా ఆహ్వానిస్తారు. బెంగాల్లోని అనేక దేవాలయాల్లో జరిగేదే. హిందూమతాన్ని పునరుద్దరిస్తామంటూ కొత్తగా నామాలు పెట్టుకొని వీరంగం వేస్తున్న కొందరు దీనిమీద మండిపడుతున్నారు. తరతరాలు గా దేవాలయాల్లో, పరిసరాల్లో మాంసం తింటున్నవారు హిందువులు కాకపోయారా? మతానికి ఏమైనా చేటు తెచ్చారా? ఎందుకీ ఉన్మాదం! ఇష్టమైన వారు శాఖాహారం తినవచ్చు, అది వారిష్టం. ఇతరుల మీద రుద్దే హక్కు వారికి లేదు. దక్షిణాది దేవాలయాల్లో పూజారులు అంగవ స్త్రంతో క్రతువులు నిర్వహిస్తారు. హిమాలయ ప్రాంత దేవాలయాల్లో అలా చేయగలరా! తత్వం తలకెక్కింది కదా అని వారివి వీరు వీరివి



వారు వేసుకుంటే చలి, ఉక్కపోతతో ఇబ్బంది పడతారు. బెంగాల్, ఉత్త రాది రాష్ట్రాలలో బ్రాహ్మలు చేపలు, మాంసం తినటం సాధారణ విషయం. వారిని మత్స్య బ్రాహ్మలు అని కూడా పిలుస్తారు. నదులు, కాలువలు, చెరువుల్లో స్నానానికి వెళ్లినపుడు పనిలో పనిగా చేపలు కూడా పట్టుకువస్తారు. రామకృష్ణ పరమహంస శిష్యుడైన వివేకానందుడు చేపల గురించి ఎద్దేవా చేసిన వారితో దెబ్బలాటలకు దిగినట్లు కూడా రాశారు కదా! ఆయన చేపలు, మాంసం తిన్నాడు. అఫ్‌కోర్స్ ఇప్పుడు అన్ని చోట్లా కొందరు బహిరంగంగా మరికొందరు దొంగచాటుగా తింటున్నారనుకోండి.

బాగేశ్వర బాబా అనే ధీరేంద్ర శాస్త్రి బాగేశ్వర ధామ్‌కు ప్రధాన పూజారి. దుర్గాపూజ సమయంలో బెంగాలీ హిందువులు మాంసాహారం తినవద్దని అనటమే కాదు, ఎవరైతే తింటారో వారు మోసకారులని కూడా వ్యాఖ్యానించారు. ఆ సమయంలో మాంసం, మద్యం దుకాణా లను మూసివేయాలని, ప్రభుత్వం పట్టించుకోవాలని సెలవిచ్చారు. తినటమే కాదు, మాంసాన్ని కాళీ మాతకు నైవేద్యంగా సమర్పించే బెంగాలీలకు ఈ బోధ ఆగ్రహం తెప్పించింది. అనేక చోట్ల అతగాడి ఫొటోలను దగ్ధం చేసి నిరసన తెలిపారు. వివాదం మరింతగా ముదర కుండా చూసేందుకు సిఎం, బిజెపి కూడా రంగంలోకి దిగింది. ఒక వైపు బెంగాలీలను సంతుష్టీకరిస్తూనే మరోవైపు ఛాందసులను మంచి చేసుకొనేందుకు చూశారు. ధీరేంద్ర శాస్త్రికి అట్టహాసంగా ఎర్రతివాచీ స్వాగతం పలకటమే కాదు, ఆశ్రమాన్ని బెంగాల్లో కూడా ఏర్పాటు చేయాలని కోరారు. ఎవరైనా శాస్త్రి దిష్టిబొమ్మలను తగలేస్తే కేసులు బనాయిస్తామని బెదిరించారు. జనాల ఆహార అలవాట్లను బాబాలు నిర్ణయించలేరంటూ మరో ముక్తాయింపు ఇచ్చారు. తృణమూల్ కాంగ్రెస్ హయాంలో ఈ బాబా ప్రవచనాలను అప్పటి ప్రభుత్వం అను మతించలేదు. బెంగాలీల మాంసాహారం గురించి హౌరాలో ఒక ప్రవచ నంలో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. బెంగాల్ బిజెపి అధ్య క్షుడు శామిక్ భట్టాచార్య మరో అడుగు ముందుకు వేశారు. " బాగే శ్వర్ బాబా "మరో లోకం" (ఉత్తరాది) నుంచి వచ్చారు. బెంగాల్ పౌరులు ఏం తినాలో నిర్ణయించే హక్కు ఆయనకు లేదు. బెంగాలీలు చేపలు, మాంసం తింటారు.వివేకానందుడు వాటిని తినటానికి అను కూలంగా మాట్లాడారు." అన్నారు. శాస్త్రి వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ "వ్యక్తిగతమైన అభిప్రాయాలు చెప్పటానికి ఆయనకు హక్కుంది. జనాలు అంగీకరించవచ్చు లేదా తిరస్కరించవచ్చు. నేను సనాతన హిందువును మహాష్టమి రోజు దుర్గామాతను పూజించాను. నేను సాత్విక ఆహారం తిన్నాను. కార్తీక మాసంలో కూడా అదే తిన్నాను, ఇదే సమయంలో ఈ రోజు కాళీమాతకు అర్పించిన ఆహారం అంటే మేక మాంసాన్ని కూడా తిన్నాను. దేవాలయంలో ప్రసాదంగా చేప తల, వేపుడు, బాస్మతి పులావును సమర్పించాను, దాన్ని తిన్నాను" అన్నారు. బెంగాలీలు ఏం తినాలో, కూడదో ఇతరులు ఎలా నిర్ణయిస్తా రంటూ తృణమూల్, బిజెపి బాబాల ఆదేశాలను వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ నేతలు స్పందించారు. సైన్సు చెప్పే మానవ పరిణామ క్రమం లో ఆవిర్భవించిన శరీర ధర్మం అటు ఆకులు అలములు ఇటు జంతు వుల మాంసాన్ని తినేందుకు వీలుగా అభివృద్ధి చెందింది. లేదూ భగవం తుడే సృష్టికర్త అనుకుంటే ఏదో ఒకటే తినే వారిని గాక రెండింటినీ తినే వారిగా ఎందుకు సృష్టించినట్లో సమాధానం చెప్పాలి. పుట్టుకతోనే ఎవరూ శాఖాహారం లేదా మాంసాహారం తినటం లేదు, తరువాత అలవాట్ల ప్రకారం తింటున్నారు. ఏ ఒక్కటి తిన్నా ఎలాంటి ఇబ్బంది లేదు, రెండూ తిన్నా పోయేదేమీ లేదు. అందువలన మాంసాహా రం తినకూడదని చెప్ప టానికి, కేవలం శాఖాహారమే తినాలని నిర్దేశిం చటానికి ఎవరికీ హక్కులేదు. బలవంతంగా రుద్దాలంటే కుదరదు.

సనాతనం లేదా మను లేదా మరొక మతం చెప్పేవైనా కాలక్రమంలో సమాజాన్ని అదుపులో ఉంచుకోవాలని చూసిన వారు చెప్పిన తత్వాలు తప్ప మరొకటి కాదు. సనాతన ధర్మం అని చెప్పేదాని ప్రకారం ఒకసారి వివాహం అయిన తరువాత బంధం ఎట్టి పరిస్థితిలోనూ తెగిపోకూ డదు. ఇలా చెప్పారంటే దాని అర్థం ఏమిటి? అంతకు ముందు వివాహబంధంలో ఉన్నవారు ఇష్టంలేకపోతే విడిపోవటం ఒక మామూలు వ్యవహారంగా సాగించిన కారణంగా కలిపి ఉంచేందుకు బోధల పేరుతో ఒక చట్రాన్ని తయారు చేశారన్నది స్పష్టం. మానవ సమాజ పరిణామ క్రమంలో జంతువుల నుంచి మనుష లు వేరుపడిన వెంటనే వివాహ బంధాలను ఏర్పాటు చేసుకోలేదు. కొన్ని లక్షల సంవత్సరాల తరువాత ఉనికిలోకి వచ్చాయి. ఉదాహరణ కు వితంతు, బాల్య, ద్వితీయ, తృతీయ వివాహాలు, సతీసహగమనం, వర్ణాశ్రమ ధర్మాల వంటి అనేక అంశాలపై సమాజంలో వచ్చిన మార్పు తెలిసిందే. ఇలాంటి విషయాల్లో పాతపద్ధతులకు వెళదామని ఏ "మను లేదా సనాతనవాది" అయినా అంటే ఆ కుటుంబాలవారు లేదా బాధితులు చెంపచెల్లుమనిపిస్తారు. అయినా భార్యలను వదలివేసిన వారు, పెళ్లయినా కానట్లు దాచిపెట్టిన వారు, ఒకటికి మూడు వివాహా లు చేసుకున్నవారు అధికార పీఠాలనెక్కి పక్కా సనాతనవాదులమని ఫోజు పెట్టటం తెలిసిందే. ఒకసారి వివాహం చేసుకున్న తరువాత దంప తులు విడిపోకూడదని సనాతనం చెబుతున్నదని చాగంటి కోటేశ్వర రావు వంటివారు చెబుతుంటే దానికి కట్టుబడి ఉన్నామని చెప్పేవారు విడా కుల కోసం ఆధునిక ధర్మం(రాజ్యాంగం) మీద ఆధారపడతారు, పక్కా సనాతన కబుర్లు వినిపిస్తారు, నటిస్తారు. ఇప్పుడు దేవాలయాల్లో మాంసం తినటం తప్పేమీ కాదని బిజెపి ముఖ్యమంత్రి సువేందు అధి కారి చెప్పబట్టి సరిపోయిందిగానీ అదే కమ్యూనిస్టులో మరొకరో చెబితే అమ్మో హిందూమతానికి ముప్పు వచ్చిందంటూ మనోభావాలు దెబ్బతి నట్లు ఊరూవాడా ఏకం చేసేవారు, కాదంటారా? ప్రకృతిలో ప్రతిదీ మారుతుంటుందని ఆధునిక శాస్త్రం(సైన్సు) చెబుతుంది. కానీ మార్పు లేనిది సనాతనం అని చెప్పే వారు కూడా మారుతూనే నంగనాచి కబుర్లు చెబుతున్నారు, విశ్వసనీయతను పోగొట్టుకుంటున్నారు. దేన్నయినా మూసిపెడితే పాచిపోతుంది. కొల్‌కతా కాళీ ఆలయంలో మాంసం తిన టాన్ని సమర్థించిన బిజెపి దేశంలోని ఇతర ప్రాంతాల కాళీ లేదా దుర్గ ఆలయాల్లో తమనేతలతో తినిపిస్తుందా? ఏ రోటి దగ్గర ఆ పాట పాడే నయవంచనకు నిదర్శనంగా మిగులుతుందా!

# స్కావెంజర్ల వేతనాల మంజూరుకు మోక్షమెన్నడో?

ఒక్కరోజు వారు రాకపోతే బడి పరిశుభ్రత అస్తవ్యస్త మౌతుంది. పాఠశాలలను, మరుగుదొడ్లను శుభ్రం చేసి చెట్ల కు నీరుపోస్తూ ఉదయం నుంచి సాయంత్రం వరకు తీరిక లేకుండా ఉపాధ్యాయులు చెప్పే పనులన్నీ చక్కదిద్దే పారిశుద్ధ్య కార్మకుల (స్కావెంజర్ల)కు ఐదు నెలల నుంచి జీతా లు రావటంలేదు. అసలే అరకొర వేత నంతో పనులు చేసే వారికి నెలల తరబడి జీతం రాకపోవ టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాఠశా లలు, మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రం చేయటంతో పాటు చెట్లకు నీరు పోయటం, పాఠశాలల గ్రౌండ్‌ను ఎప్ప టికప్పు డు శుభ్రపరచడంతోపాటు ఉపాధ్యాయులు చెప్పే పనులు సైతం చేసేందుకు ప్రత్యేకంగా నిధులను ఇస్తోంది. వాటితో స్కావెంజర్లను నియమించి వారికి ప్రతీ నెల వేతనాలు ఇవ్వాల్సి ఉంది. కాగా 0–30 మంది విద్యార్థులున్న పాఠశాలలకు నెలకు రూ.3వేలు, 31–100 మంది విద్యార్థులున్న బడులకు రూ.6వేలు, 101–250 ఉన్న వాటికి రూ.8వేలు, 251–500 ఉన్న బడులకు రూ.12 వేలు, 501–750 గల వాటికి రూ.15వేలు, 750 మందికి పైగా విద్యార్థులుంటే నెలకు రూ.20వేల చొప్పున ఇస్తోంది. దీంతో ఆయా పాఠశాలల్లో ఎంతమంది స్కావెంజర్లను ఏర్పాటు చేసుకోవాలనే అంశాన్ని ప్రభుత్వం పూర్తిగా ఉపాధ్యాయులకే వదిలే సింది. దీంతో పాఠశాల ఉన్నంత సేపు బడిలోనే ఉండే విధంగా స్కావెంజర్లతో మాట్లాడి నియమించుకున్నారు. కాగా స్కావెంజర్ వేతనాలు అమ్మ ఆదర్శ పాఠశాలలోని అకౌంట్లలో నిధులు జమవుతాయి. వాటిని డ్రా చేసి స్కావెంజర్లకు అందించాలి.

ఈ ఏడాది బడులు పునఃప్రారంభం నుంచి పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు రావడంలేదు. దీంతో అర్ధాకలితో అలమటించాల్సిన దుస్థితి నెలకొందని వారు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు.

స్కావెంజర్ల వేతనాలకోసం ప్రతీ నెల వారికి జిల్లా మినరల్ ఫండ్ (ఎండిఎఫ్) నుంచి చెల్లిస్తున్నారు. కాగా, ఈ నిధులు వివిధ ఖనిజాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం. వీటిని తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, విద్య, ఆరోగ్య సదుపాయాలు, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిర క్షణ, తదితర అత్యవసరాలకు వినియోగి స్తారు. కానీ ఎండిఎఫ్ ఫండ్ ప్రభుత్వం నుంచి ప్రతీనెల క్రమం తప్ప కుండా వచ్చే అవకాశం లేదని అందుకే స్కావెంజర్లకు ఇప్పటివరకు వేతనాలు చెల్లించలేక పోయామని అధికా రులు చెబుతున్నారు. తమ వేతనాలను ఎండిఎఫ్ ఫండ్‌తో ముడిపెట్టకుండా తమకు నెలనెలా జీతాలిచ్చి ఆదుకోవా లని పారిశుద్ధ్య కార్మికులు కోరుతున్నారు.

ఐదు నెలల నుంచి జీతాలివ్వకపోవడంతో వారు నానా కష్టాలు పడుతున్నారు. చిన్న ఉద్యోగం..తక్కువ జీతం అలాగే ఉదయం నుండి సాయంత్రం వరకు బడి లోనే ఉండడంతో వేరే పని కూడా చేసుకునే అవకాశం లేదని వారు వాపోతున్నారు. ఇప్పటికే ఐదు నెలలుగా అప్పులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొందరు ప్రధా నోపాధ్యాయు లు తమ వేతనం నుండి స్కావెంజర్ల వేతనాలు చెల్లిస్తున్నారు. గౌరవ ముఖ్యమంత్రి గారు ఈ విషయమై చొరవ చూపి వారి వేతనాలను అడ్వాన్సుగా ఖాతాలలో జమ చేయాలి.

సుధాకర్ ఏవి
రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు
స్టేట్ టీచర్స్ యూనియన్, తెలంగాణ స్టేట్(STUTS)
9000674747

## ఆన్‌లైన్ లైఫ్ సర్టిఫికెట్

దేశంలోని పెన్షన్ దారులందరికీ డిజిటల్ ద్వారా ఆన్లైన్ లైఫ్ సర్టి ఫికెట్ సమర్పించుటకు జీవన్ ప్రమాణ్ యాప్ 2014 లో ప్రవే శపెట్టడం జరిగినది. కోల్ ఇండియాలో 2021లో, సింగరేణిలో 2022లో బొగ్గు పెన్షనర్ల కోసం ఈ విధానం ప్రవేశపెట్టారు. కావున సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులు నవంబర్ నెలలో తాము జీవించి ఉన్నట్టు జీవన్ ప్రమాణ్ మొబైల్ ఫోన్ యాప్ ఫోటోలలో సూచించిన విధంగా తమకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకుని డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్–2027 సంవత్సరానికి పొందగ లరు. తద్వారా పెన్షన్ పొందుటకు ఎలాంటి ఆటంకాలు ఉండవు. ఈ విధంగా పొందిన డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ఏ కార్యాలయంలో కూడా సమర్పించడం అవసరం ఉండదు. ఇదే విధంగా CPRMS మెడికల్ కార్డుల విషయంలో సూచించిన విధంగా సింగరేణి సంస్థకు సమర్పించవలెను.

డి. రాంచందర్ రావు, 9849592958

# ఉచితం సరే... సరిపడ బస్సులేవి?

- తగ్గిన ఆధార్ బస్సులు- పెరిగిన లగ్జరీలు
- రిటైర్‌మెంట్ తప్ప రిక్రూట్‌మెంట్ లేదు
- సిబ్బందిపై పని భారం - పెరిగిన ప్రయాణికుల రద్దీ

ప్రజాపక్షం/ఖమ్మం : మహిళలకు ఆర్‌టిసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం అభినందనీయమే. మహిళా ప్రయాణికులకు చార్జీలు ఆదా కావడంతో పాటు ఉపాధికి దోహదపడుతుంది. కానీ ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన ప్రభుత్వం ఆ స్థాయిలో బస్సుల సంఖ్యను పెంచలేదు. దీనితో మహిళలకు ఆధార్‌తో ఉచిత ప్రయాణం గల బస్సుల్లో రద్దీ పెరుగుతుంది. బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉండడంతో ప్రయాణికుల మధ్య ఘర్షణలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య పెరిగిందని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం ఆ స్థాయిలో బస్సుల సంఖ్య పెంచలేదు. సిబ్బంది నియామకాలు జరపడంలేదు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణం చేయడానికి జంకుతున్నారు. సీట్లో కూర్చుని ప్రయాణం చేయడం మాట అటుంచి కనీసం నిల్చునేందుకు కూడా చోటు దొరకక ఇబ్బందులు పడుతున్నారు. ఆధార్ కార్డు ఉన్న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినప్పటికీ బస్సుల సంఖ్యను తగ్గించి వాటి స్థానంలో డీలక్స్ బస్సులను ప్రవేశపెడుతున్నారు. ఎక్స్‌ప్రెస్ చార్జీలతో డీలక్స్ బస్సుల్లో ప్రయాణమంటూ ప్రచారం



చేస్తున్నారు. టికెట్ ధర చెల్లించి ప్రయాణించే వారు ఇప్పుడు డీలక్స్ బస్సుల్లో ఎక్స్‌ప్రెస్ టికెట్‌తో ప్రయాణిస్తున్నారు.

**సిబ్బంది నియామకాలేవి...?**

ఆర్‌టిసి సంస్థలో సిబ్బంది నియామకాలు లేవు. అప్పుడప్పుడు కొంతమంది కండక్టర్లను, డ్రైవర్లను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించడం తప్ప రెగ్యులర్ నియామకాలు జరగడంలేదు. దీనితో సిబ్బంది అదనపు గంటలు పనిచేయాల్సి వస్తుంది. స్థాయికి మించి బస్సుల్లో ప్రయాణికులు ఉండడంతో సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వస్తుంది. పని భారం పెరిగి అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో ఆర్‌టిసిలో ఉన్నంత శ్రమదోపిడీ ఏ సంస్థలోనూ లేదంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన బస్సులను కొనుగోలు చేయడంతోపాటు సిబ్బంది నియామకాలు చేపట్టాలి. ఇటీవల కాలంలో ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికుల మధ్య ఘర్షణలు జరగడంతోపాటు సిబ్బంది, ప్రయాణికుల మధ్య కూడా ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఆదివారం ప్రయాణికురాలు కండక్టర్‌తో ఘర్షణ పడి కండక్టర్‌ను నెట్టివేయడంతో మహిళా కండక్టర్ తీవ్రంగా గాయపడింది. ఇటువంటి ఘర్షణలను నివారించడంతో పాటు ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు నూతన బస్సులను కొనుగోలు చేసి ప్రధానమైన రూట్లలో సర్వీసుల సంఖ్యను గణనీయంగా పెంచాలి. లేదంటే ఉచిత బస్సు ప్రయాణం ఘర్షణలకు, ఇబ్బందికర ప్రయాణానికి కేరాఫ్‌గా మారుతుంది.



## మహిళా క్రీడాకారిణుల విజయాలు దేశానికి గర్వకారణం

- కోనేరు హంపి, పివి సింధుకు మంత్రి కోమటిరెడ్డి అభినందనలు

ప్రజాపక్షం/హైదరాబాద్: అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత మహిళా క్రీడాకారిణులు సాధిస్తున్న విజయాలు దేశానికి గర్వకారణమని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మహిళల యూరోపియన్ చెస్ క్లబ్ కప్‌లో వ్యక్తిగత విభాగంలో స్వర్ణ పతకం సాధించిన కోనేరు హంపి, ఫ్రెంచ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన పివి సింధుకు ఆయన అభినందనలు తెలిపారు. ఏళ్ల తరబడి కఠోర శ్రమ, త్యాగం, పట్టుదలతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని మంత్రి పేర్కొన్నారు. తమ అద్భుత ప్రదర్శనలతో హంపి, సింధు దేశ గౌరవాన్ని మరింత పెంచారని కొనియాడారు. వారి విజయాలు దేశంలోని యువతులకు స్ఫూర్తినిస్తాయని, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు ప్రేరణనిస్తాయని అన్నారు. భవిష్యత్తులోనూ వీరిద్దరూ మరిన్ని విజయాలు సాధించి దేశానికి గర్వకారణంగా నిలవాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా అభినందనలు తెలిపారు.

## సినిమా ఈవెంట్లకు అడ్డాగా మల్లారెడ్డి యూనివర్సిటీ

- యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలి : ఎఐఎస్ఎఫ్ నేతలు మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : విద్యార్థుల చదువులకు ఆటంకం కలిగిస్తూ సినిమా ఈవెంట్లు నిర్వహిస్తున్న మల్లారెడ్డి యూనివర్సిటీ గుర్తింపును రద్దు చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఈ యూనివర్సిటీని విద్యా కేంద్రంగా కాకుండా సినిమా ఈవెంట్ల హబ్‌గా మార్చారని విమర్శించారు. అక్టోబర్ 23న నిర్వహించిన సినిమా ట్రైలర్ లాంచ్ అనంతరం, అక్టోబర్ 30న విడుదల కానున్న సినిమాను విద్యార్థులంతా చూడాలంటూ యాజమాన్యం సెలవు ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఫీజులు చెల్లించేది చదువుల కోసమా, సినిమా ఈవెంట్లలో పాల్గొనడానికా అని ప్రశ్నించారు. అర్ధరాత్రి వరకు సినిమా కార్యక్రమాలు నిర్వహిస్తూ, విద్యా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని, ఉన్నత విద్యాశాఖ, యూజిసి అధికారులు తక్షణమే విచారణ జరిపి యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వారు సోమవారం ఒక ప్రకటనలో కోరారు.



## కండక్టర్ ప్రవళికకు ఆర్‌టిసి భరోసా

- బాధితురాలిని పరామర్శించిన ఇడి వెంకన్న

ప్రజాపక్షం/హైదరాబాద్: విధి నిర్వహణలో ఉండగా దాడికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణుగూరు డిపోకు చెందిన మహిళా కండక్టర్ ప్రవళికకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) అండగా నిలిచింది. హైదరాబాద్‌లోని సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రవళికను ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఇడి) సిహెచ్. వెంకన్న సోమవారం పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని, చికిత్సలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అనంతరం ప్రవళిక కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆర్‌టిసి యాజమాన్యం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగులపై దాడులను సహించేది లేదని వెంకన్న స్పష్టం చేశారు. కండక్టర్‌పై దాడికి పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకునేలా చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు. ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న ఆర్‌టిసి ఉద్యోగుల భద్రతకు యాజమాన్యం అత్యంత ప్రాధాన్యమిస్తుందని వెంకన్న పేర్కొన్నారు.

## ఆర్‌టిసి ఎన్నికల్లో కార్మిక శాఖ పక్షపాతం

- 28న లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడి: నరసింహ

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ ఆర్‌టిసి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మిక శాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ విమర్శించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎఐటియుసి అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్‌ను బలహీనపరిచేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి యూనియన్ వెరిఫికేషన్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఎంప్లాయీస్ యూనియన్‌కు రావాల్సిన ప్రాంతీయ గుర్తింపును ఇతర యూనియన్లకు కేటాయించడం అన్యాయమని పేర్కొన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన అధికారులు పక్షపాత ధోరణి ప్రదర్శించడం సిగ్గుచేటన్నారు. కేంద్రంలో ఎన్నికల అధికారులను అడ్డం పెట్టుకొని ఓట్ల చోరీకి బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి ఆర్‌టిసి ఎన్నికల వ్యవహారంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్మిక శాఖ అధికారుల నిరంకుశ వైఖరికి నిరసనగా ఈ నెల 28న లేబర్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు ప్రకటించారు. ఈ ఆందోళనలో ఆర్‌టిసి కార్మికులతోపాటు ఎఐటియుసి అనుబంధ సంఘాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎఐటియుసి ఆధ్వర్యంలో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఎం.నరసింహ హెచ్చరించారు.



**ఇయు ధర్నాకు ఎన్ఎంయు మద్దతు**

ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల నిర్వహణ, ఫలితాల ప్రకటనలో కార్మిక సంఘాల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని నిరసిస్తూ ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు) ఈ నెల 28న చేపట్టనున్న ధర్నాకు నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. జాయింట్ లేబర్ కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలను నిరసిస్తూ నిర్వహించే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఎన్ఎంయు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ నుంచి ఫలితాల ప్రకటన వరకు లేబర్ కమిషనర్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని ఎన్ఎంయు నాయకులు విమర్శించారు. కార్మిక సంఘాల కోడ్ ఆఫ్ డిసిప్లిన్ నిబంధనలకు విరుద్ధంగా అర్హత లేని సంఘానికి గుర్తింపు ఇచ్చారని ఆరోపించారు. ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఎన్ఎంయు అధ్యక్షుడు పి.కమాల్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడు నరేందర్ మర్రి, ప్రధాన కార్యదర్శి ఎం.డి.మౌలానా ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నాయకులు, కార్యకర్తలు ఈ నెల 28న జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## బిఆర్ఎస్ తప్పిదాలతోనే తెలంగాణకు నీటి కష్టాలు

- ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన తప్పిదాల వల్లే తెలంగాణకు నీటి కష్టాలు ఎదురవుతున్నాయని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గోదావరి జలాల వినియోగంపై బిఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. బొగ్గు, నీరు, విద్యుత్ అంశాలపై ఆ పార్టీకి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. గాంధీభవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాళేశ్వరం వద్ద నీటిని ఎత్తిపోసేందుకు 93.5 మీటర్ల నీటిమట్టం అవసరమని, ప్రస్తుతం 89 మీటర్ల ప్రవాహం మాత్రమే ఉందని తెలిపారు. సుమారు 4.5 మీటర్ల నీటిమట్టం తక్కువగా ఉందన్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి నీటిని ఎత్తిపోసే విషయంలోనూ ఇదే పరిస్థితి ఉందని వివరించారు. కృష్ణా నదీ జలాల్లో 299 టిఎంసిలకు అంగీకరించింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని గుర్తుచేశారు. గోదావరి జలాలను రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటున్నప్పటికీ, బిఆర్ఎస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని చామల మండిపడ్డారు. దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల గురించి ఆ పార్టీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీళ్లు తరలిపోతున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. కెటిఆర్, హరీశ్‌రావు ప్రజలు అధికారం ఇవ్వలేదన్న కక్షతోనే ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. రోజంతా రాజకీయాలు చేయడమే వారిద్దరి అజెండాగా మారిందని విమర్శించారు. సుమారు 150 ఏళ్ల తర్వాత ఎల్‌నినో విపత్తు ఎదురైందని చామల తెలిపారు. దీని ప్రభావంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తున్నారని చెప్పారు.

## భేటీ కేవలం 'ఫేస్ సేవింగ్' చర్యే

- మాజీ ఎంపి వినోద్ కుమార్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య జరిగిన తమ్మిడిహట్టి ప్రాజెక్టు భేటీ వల్ల కొత్తగా సాధించిందేమీ లేదని, ఇది కేవలం 'ఫేస్ సేవింగ్' చర్యగా మాత్రమే మిగిలిపోయిందని బిఆర్ఎస్ నాయకుడు, మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ విమర్శించారు. దశాబ్ద కాలంగా కొనసాగుతున్న చర్చలనే మళ్లీ మొదటికి తెచ్చారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి కెసిఆర్ హయాం వరకు తుమ్మిడిహెట్టిని 152 మీటర్ల ఎత్తులో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిరాకరిస్తూనే వచ్చిందన్నారు. గిరిజన ప్రాంతాలు, భూములు ముంపునకు గురవుతాయనే కారణంతోనే అప్పటి మహారాష్ట్ర సిఎం పృథ్వీరాజ్ చౌహాన్ నుంచి నేటి దేవేంద్ర ఫడ్నవీస్ వరకు 152 మీటర్ల ఎత్తుకు అంగీకరించలేదని, కేవలం 148 మీటర్ల వరకే పనులకు స్పష్టత ఇచ్చారని తెలిపారు. రేవంత్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన మూడేళ్ల తర్వాత ఈ సమావేశం జరగడం బాధాకరమని, ఇప్పుడు మళ్లీ అధికారులతో కమిటీ వేస్తామని చెప్పడం వల్ల సమస్యకు కాలయాపన తప్ప ఎలాంటి పరిష్కారమూ లభించదన్నారు. కేవలం తుమ్మిడిహెట్టి అంశంతోనే తెలంగాణ జల సమస్యలు తీరిపోవని, మహారాష్ట్ర ప్రభుత్వం వెనుగంగ నుంచి జల్గావ్ వరకు, కాళేశ్వరం కంటే రెండు మూడు రెట్లు పెద్ద ఎత్తున నీటిని తరలించే భారీ ఎత్తిపోతల పథకాలకు ప్రణాళిక చేస్తోందని హెచ్చరించారు. అంతర్రాష్ట్ర జల హక్కులను పరిరక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

## కరువు పరిస్థితులపై తప్పుడు ప్రచారం

- ఎల్ నినోపై వాస్తవాలు ప్రజలకు వివరించాలి
- అఖిలపక్ష సమావేశానికి రావాలి: ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో ఏర్పడే కరువు పరిస్థితులపై ప్రజలకు వాస్తవాలు వివరించాల్సిన సమయంలో బిఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బాల్మూరి వెంకట్ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలోనూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం వాస్తవాలను ప్రజలకు చెప్పలేదని ఆరోపించారు. సోమవారం సిఎల్‌పి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంపై ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఇప్పటికే వివరించారని, పరిస్థితిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వెంకట్ తెలిపారు. కాళేశ్వరం కింద దేవాదుల, సీతారామ ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులపై రాజకీయ విమర్శలు చేయడం సరి కాదని, ఎల్లుండి నిర్వహించనున్న ఎల్ నినోపై అఖిలపక్ష సమావేశానికి బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ ఆ పార్టీ నేతలు హాజరై తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు. ఇదే సందర్భంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై బాల్మూరి వెంకట్ తీవ్ర ఆరోపణలు చేశారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కెటిఆర్ మహిళలతో వ్యవహరించిన తీరుపై తన వద్ద ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.

## అర్హులైన ప్రతీ గ్రాడ్యుయేట్‌ను.. ఇసియే ఓటరుగా నమోదు చేయాలి

- బిఆర్ఎస్ఎల్‌పి ఉపనేత తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : అర్హులైన ప్రతి గ్రాడ్యుయేట్‌ను ఎన్నికల కమిషన్ అధికారులే చొరవ తీసుకుని ఓటరుగా నమోదు చేయించాలని బిఆర్ఎస్ఎల్‌పి ఉపనాయకుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యంపై సోమవారం బిఆర్‌కె భవన్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సిఈఓ) సుదర్శన్ రెడ్డిని బిఆర్ఎస్ ప్రతినిధుల బృందం కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, సురభి వాణి దేవి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్‌లతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమం ముమ్మాటికీ ఎన్నికల కమిషన్ ప్రత్యక్ష పర్యవేక్షణలోనే జరగాలన్నారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుకు నవంబర్ 6తో గడువు ముగియనున్నప్పటికీ, ఇప్పటివరకు క్షేత్రస్థాయిలో బిఎల్‌ఓలను నియమించకపోవడం ఈసి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమన్వయంతో ఓటరు నమోదు చేపట్టాల్సి ఉండగా, ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఓటరుగా ఎలా నమోదు చేసుకోవాలనే అంశంపై ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదన్నారు. గతంలో జరిగిన గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా మళ్లీ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందనే ప్రశ్నకు అధికారుల వద్ద సరైన సమాధానం లేదన్నారు. గత ఎన్నికల్లో హైదరాబాద్ నగర పరిధిలోనే లక్షా 10 వేల మంది ఓటర్లు నమోదు కాగా, ప్రస్తుతం ఇప్పటి వరకు కేవలం 23 వేల దరఖాస్తులు మాత్రమే వచ్చాయని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్ నగర్ జిల్లాల పరిధిలో 5.27 లక్షల దరఖాస్తులు వచ్చాయని ప్రకటించిన అధికారులు, వాటి పరిశీలనను మాత్రం ఇంకా ప్రారంభించలేదన్నారు. గ్రాడ్యుయేట్లు ఈ దేశ పౌరులు కాదన్నట్లుగా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందన్నారు. ఈసి తన బాధ్యతలను విస్మరించడంతోనే బిఆర్ఎస్ పార్టీ తరపున కష్టపడి గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు సేకరించామని తెలిపారు. అయితే ఆ దరఖాస్తులను సమర్పించేందుకు అధికారుల వద్దకు వెళ్తే, బల్క్ దరఖాస్తులు తీసుకోమని, దరఖాస్తుదారులే స్వయంగా రావాలని అభ్యంతరాలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ఓటరు నమోదు నెమ్మదిగా సాగుతోందని ప్రకటించడం ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు కోలేటి దామోదర్ గుప్తా, మన్నె క్రిశాంక్, గజ్జెల నగేష్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ఆనంద్ గౌడ్, మాగంటి సునీత, ఆజామ్, ఓటరు నమోదు కార్యక్రమం ఇన్‌చార్జ్‌లుగా గోసుల శ్రీనివాస్ యాదవ్, వెంకట్ రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



## శాసనమండలి పట్టభద్రుల ఓటర్ల నమోదు వేగవంతం

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ శాసనమండలిలోని రెండు పట్టభద్రుల నియోజకవర్గాల స్థానాలకు ఎన్నికల కమిషన్ సన్నాహాలు వేగవంతం చేసింది. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సురభి వాణిదేవి, వరంగల్–ఖమ్మం–నల్లగొండ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తీన్మార్ మల్లన్నల పదవీ కాలం 2027 మార్చి 29తో ముగియనుంది. ఈ నేపథ్యంలో నూతన ఓటర్ల జాబితా రూపకల్పనకు భారత ఎన్నికల సంఘం సమగ్ర షెడ్యూల్‌ను ప్రకటించి, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఈ నియోజకవర్గాల పరిధిలో నివసిస్తూ, 2023 నవంబర్ 1 నాటికి లేదా అంతకంటే ముందు ఏదైనా గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా తత్సమాన డిప్లొమా పూర్తయిన పట్టభద్రులు మాత్రమే ఓటు హక్కు నమోదుకు అర్హులు. గతంలో పట్టభద్రుల ఓటర్ జాబితాలో పేరు ఉండి ఓటు వేసినప్పటికీ, ప్రజాప్రాతినిధ్య చట్టం 1950లోని రూల్ 31 ప్రకారం ప్రతి ఎన్నికలకూ నూతనంగా ఓటర్ల జాబితాను తయారు చేయాల్సి ఉన్నందున పాత వివరాలను పరిగణనలోకి తీసుకోరు. కాబట్టి అర్హులైన వారు తప్పనిసరిగా మళ్లీ నూతనంగా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే అభ్యర్థులు సవరించిన 'ఫారం 18' ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. తెల్ల కాగితంపై ఇచ్చే దరఖాస్తులను ఆమోదించరు. దరఖాస్తులను రాష్ట్ర సిఈఓ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కానీ, లేదా ఆఫ్‌లైన్‌లో సంబంధిత ఈఆర్ఓ, ఎఇఆర్ఓ (ఆర్‌డిఓలు, తహసీల్దార్లు) కార్యాలయాల్లో నేరుగా లేదా పోస్టు ద్వారా సమర్పించవచ్చు. దరఖాస్తుతో పాటు డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్ లేదా మార్కుల మేమోను సమర్పించి అధికారులతో సరిచూసుకోవాలి. ఒరిజినల్ అందుబాటులో లేని పక్షంలో జిల్లా గెజిటెడ్ అధికారి ధ్రువీకరించిన జిరాక్స్ కాపీని సమర్పించవచ్చు. అలాగే, ఆధార్ వివరాల సమర్పణ ఐచ్ఛికమేనని, ఆధార్ సమాచారాన్ని గోప్యంగా ఉంచుతూ ఓటరు జాబితాలో మొదటి 8 అంకెలను మాస్క్ చేస్తారని ఎన్నికల అధికారులు వెల్లడించారు. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ వచ్చేనెల 6. అనంతరం నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. ఈ జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను నవంబర్ 25 నుండి డిసెంబర్ 10 వరకు స్వీకరించి, డిసెంబర్ 25 నాటికి పరిష్కరిస్తారు. అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం 2026 డిసెంబర్ 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితాను తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో అధికారికంగా విడుదల చేస్తామని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్ రెడ్డి తెలిపారు.


**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**

ఫోన్ నెం. 0878-2243438, ఫ్యాక్స్ నెం. 0878-2240624, ఇమెయిల్: knrcmnr@rediffmail.com

**సీల్డ్ కొటేషన్ నోటీసు**

నెం. E1/DB/MCK/ /Quotations/2026-27 తేదీ: 26-10-2026

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని డివిజన్‌లలో వీధి దీపాల నిర్వహణ పనుల నిమిత్తం, LED PCBలు, డిఫ్యూజర్స్, క్లాంప్స్ మరియు పైపుల సరఫరా మరియు డెలివరీ, మరియు ఆటోమేటిక్ స్ట్రీట్ లైట్ కంట్రోల్ సిస్టమ్ యొక్క సరఫరా, డెలివరీ మరియు అమర్చే పనుల కొరకు, నాన్-SOR వస్తువుల కోసం జారీచేసిన సీల్డ్ కొటేషన్ నోటీసు. కొటేషన్లు స్వీకరించడానికి చివరి తేదీ: 31-10-2026 సాయంత్రం 04.00 గంటలు. మరిన్ని వివరాల కోసం దయచేసి సందర్శించండి: karimnagarcorporation.telangana.gov.in

సం/- కమిషనర్, కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్

DIPR R.O. No. : 12493-PP/CL/ADVT/2026-27, Date: 26-10-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి

మెయిల్: sew.ghmc@gmail.com సెల్ నెం. 9154172331

NIT No. 62/SE/SLPZ/CMC/2026-27 తేదీ: 26.10.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ / ఇసివి | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT No. 62/ SE/SLPZ/ CMC/ 2026-27, తేది: 26.10.2026 | అమీన్‌పూర్ సర్కిల్-47, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసిలో బిటి రోడ్డు వేయడం, యుజిడి లైన్ వేయడం. (02 అంశాలు) | రూ. 157.00 లక్షలు | 27.10.2026 మ.1.00గం.ల నుండి, 03.11.2026 మ.1.30గం.ల వరకు | ఎస్ఇ, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9154172331 7331186858 |

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి

DIPR R.O. No. : 12459-PP/CL/ADVT/2026-27, Date: 26-10-2026

**హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం**

ఈస్ట్ వింగ్, 7వ అంతస్తు, స్వర్ణజయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500038.

**'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ ప్రకటన**

NIT No. HMDA/DEV/CE/2026-27 Dt: 26.10.2026

కింది పనుల కోసం చెల్లుబాటులో ఉన్న రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు ఆహ్వానించడమైనవి:

| క్ర. సం. | పని పేరు | టెండర్ ఆహ్వానించు అథారిటీ | ఆన్‌లైన్ బిడ్స్ సమర్పణకు ఆఖరి తేది |
|---|---|---|---|
| 1 | తెలంగాణలోని ఆరు (6) ప్రదేశాలలో ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్స్ (ADTT) ఆధునీకరణ మరియు నిర్మాణం. | చీఫ్ ఇంజనీర్, హెచ్ఎండిఎ | 09.11.2026 మ.03.00 గం.ల వరకు (ఎస్‌టిఐఎన్) |
| 2 | మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల శాసనసభ నియోజకవర్గం పరిధిలోని రాజాపూర్ మండలంలో సిసి రోడ్ల నిర్మాణం. | | 13.11.2026 మ.03.00 గం.ల వరకు |
| 3 | మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల శాసనసభ నియోజకవర్గం పరిధిలోని నవాబ్‌పేట్ మండలంలో సిసి రోడ్ల నిర్మాణం. | | |
| 4 | గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని జిన్నారం మండలం, గడ్డపోతారంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదుట ఉన్న రోడ్డుకు మరమ్మతులు, విస్తరణ మరియు కొత్త సిసి రోడ్డు నిర్మాణం. | | |

మరిన్ని వివరాలకు https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- చీఫ్ ఇంజనీర్ (ఎఫ్ఎసి), హెచ్ఎండిఎ

DIPR R.O. No. : 12510-PP/CL/ADVT/2026-27, Date: 26-10-2026

## వానరాల బీభత్సం.. ప్రజలు బెంబేలు!



ప్రజాపక్షం/మల్యాల : జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో వానరాల బెడద రోజు రోజుకూ పెరుగుతోంది. అడవుల్లో ఉండాల్సిన కోతులు జనావాసాల్లోకి చొరబడుతూ ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తూ దుకాణాలు,ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోకి ప్రవేశించి ఆహార పదార్థాలను చిందరవందర చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నాయి. వానరాలు గుంపులుగా వీధుల్లో సంచరిస్తుండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే భయపడుతున్నారు.ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కోతుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఆహారం కోసం ఇళ్లలోకి చొరబడటమే కాకుండా, అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే దాడులకు దిగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారులు స్పందించాలి. మండలంలోని గ్రామాల్లో వానరాల బెడదను నివారించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కోతులను సురక్షితంగా తరలించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి,ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## వాల్మీకి మహర్షికి సిపి నివాళి



ప్రజాపక్షం / కొత్తపల్లి : మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ మానవాళికి సత్యం, ధర్మం, నైతిక విలువలను బోధించిన వాల్మీకి మహర్షి చూపిన మార్గం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనరేట్ అధికారులు,సిబ్బందిపాల్గొనివాల్మీకిచిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.

## ఎఐటియుసికి స్వచ్ఛందంగా సభ్యత్వం చేస్తున్న కార్మికులు



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిడికె 2వ ఇంక్లైన్‌లో కార్మికులు యూనియన్ మెంబర్ షిప్ కోసం స్వచ్ఛందంగా సంతకాల సేకరణ చేయడం జరుగుతుందని వారికి ఎఐటియుసి యూనియన్ అభినందనలు తెలుపుతుందని ఆ యూనియన్ ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను పేర్కొన్నారు. సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎఐటియుసి కోశాధికారి ఎస్ వెంకట్ రెడ్డి,సీనియర్ నాయకులు పర్లపెల్లి రామస్వామి,ఫిట్ సెక్రటరీ పొన్నాల వెంకటయ్య, నాయకులు పెద్దెల్లి శంకర్, వాసంశెట్టి శ్రీనివాస్, మార్క సదానందం,తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధి నిరుపేదల పాలిట వరం: ఎమ్మెల్యే



ప్రజాపక్షం/జగిత్యాల టౌన్: సిఎం సహాయ నిధి చెక్కులు నిరుపేదల పాలిట వరమని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల పట్టణం 14వ వార్డుకు చెందిన గజ్జెల అపర్ణకు రూ.1.89లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి,కౌన్సిలర్ బొల్లారపు స్వప్న గిరిధర్,ఆకుల తిరుపతి,తదితరులు,నాయకులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ విక్రయాలపై పోలీసు నిఘా..

ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలో నార్కోటిగ్ జాగిలాలతో కిరాణా,పాన్‌షాపులు,ప్రధాన కేంద్రాల వద్ద నిషేధిత అక్రమ విక్రయాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట ఎస్సై రమేష్‌గౌడ్ హెచ్చరించారు.సోమవారం జిల్లా పోలీసు బాస్ ఎస్పిఆదేశాల మేరకు అనుమానం వచ్చిన దుకాణాల వద్ద సోదాలు చేశారు. యువత డ్రగ్స్‌కు బానిస కావొద్దని ఎవరైన మత్తుకు సంబంధిత వస్తువులు అమ్మితే పోలీసులకు తెలుపాలని వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇండ్లు అందించటమే సర్కార్ లక్ష్యం: ఎంపి చామల



ప్రజాపక్షం/సిద్దిపేట : అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు అందించటమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి జిల్లా కలెక్టర్ హైమావతిలు ముఖ్య అతిథులుగా హాజరై ధూళ్‌మిట్ట మండలం, జలపల్లి గ్రామానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాల సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎంపి చామల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. రాష్ట్రంలో గుడిసేలు లేకుండ అర్హులైన వారందరికి పక్కా ఇండ్లు నిర్మించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిస్పక్షపాతంగా కృషిచేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారందరికి పారదర్శంగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొండల్ రెడ్డి, సర్పంచ్‌లు కరుణాకర్, కొమ్ము రవి, నర్సింగరావు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# యువతకు నైపుణ్య శిక్షణతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు

ప్రభుత్వ విప్ శాసనసభ్యుడు
చింతకుంట విజయరమణా రావు



ప్రజాపక్షం/పెద్దపల్లి : జిల్లాలోని యువతకు మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ అందించి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రభుత్వ విప్ శాసనసభ్యుడు చింతకుంట విజయరమణా రావు అన్నారు. సోమవారం పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.27 లక్షలతో చేపట్టిన అదనపు తరగతి గదుల రెనోవేషన్ పనులను, రూ.25 లక్షలతో ఏర్పాటు చేసిన టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని యువతకు అవసరమైన నైపుణ్యాలను అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు పెద్దపల్లిలో టాస్క్ ప్రాంతీయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.ఈ కేంద్రం ద్వారా శిక్షణ పొందిన అనేక మంది యువత ఉద్యోగాలు సాధించారని పేర్కొన్నారు. టాస్క్ కేంద్రం ద్వారా ఇప్పటివరకు కల్పించిన ఉద్యోగ అవకాశాలు, సాధించిన పురోగతికి సంబంధించిన వివరాలతో వారం రోజుల్లో శ్వేతపత్రం విడుదల చేస్తామని వెల్లడించారు.

**విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.70 కోట్లు :** పెద్దపల్లి నియోజకవర్గంలో విద్యారంగ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు. పాఠశాలల పునరుద్ధరణ, అదనపు తరగతి గదుల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నామని, పెద్దపల్లి మండలంలోనే సుమారు రూ.14 కోట్లు ఖర్చు చేశామని వివరించారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక శ్రద్ధతో చేపట్టిన చర్యల ఫలితంగా ప్రస్తుతం 8వ స్థానానికి చేరుకుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా సుమారు రూ.800 కోట్ల వ్యయంతో అల్పాహార పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. హరే రామ ట్రస్ట్ సహకారంతో అమలవుతున్న ఈ పథకం పేద విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు దోహదపడుతోంద ని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు.

**విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి :** ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జూనియర్ కళాశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల జీవితంలో ఇంటర్మీడియట్ దశ అత్యంత కీలకమని, ఈ సమయంలో అనేక ఆలోచనలు, ఆకర్షణల వల్ల చదువుపై దృష్టి మరలే అవకాశం ఉంటుందని అన్నారు. కళాశాలల్లో విద్యార్థుల హాజరును కఠినంగా పర్యవేక్షించాలని, హాజరు నిబంధనలు పాటించని విద్యార్థులను పరీక్షలకు అనుమతించకూడదని సూచించారు. ఈ విషయంలో రాజకీయ నాయకుల నుంచి ఎలాంటి ఒత్తిళ్లు ఉండవని స్పష్టం చేశారు.

**ప్రభుత్వ ఆసుపత్రుల సేవల్లో గణనీయమైన మార్పు:** గత మూడేళ్లలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గణనీయమైన మార్పులు వచ్చాయని ప్రభుత్వ విప్ తెలిపారు. ఇటీవల పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి నాలుగు అవార్డులు లభించాయని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్ అద్దె ద్వారా వచ్చే ఆదాయం నేరుగా కళాశాలకు చేరేలా జిల్లా కలెక్టర్ ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. పేద ప్రజలు విద్య, వైద్య సేవల కోసం ఇబ్బందులు పడకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, విద్యారంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పరీక్షా ఫలితాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో టాస్క్ కేంద్రం ద్వారా గత ఏడాదిన్నర కాలంలో సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని వివరించారు. ఉద్యోగాలు కల్పించడంతోనే తమ బాధ్యత ముగిసిపోదని, ఉద్యోగాల్లో చేరిన యువతకు మూడు నెలల పాటు నిరంతరం ఫాలోఅప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు మహిళలు ఇంటి నుంచే పని చేసుకుంటూ ఆదాయం సంపాదించేలా అవసరమైన నైపుణ్యాలను అందించేందుకు కూడా జిల్లాలో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.కల్పన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్ రెడ్డి, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు,అధ్యాపకులు,తదితరులు పాల్గొన్నారు.

## కొడుకు పుట్టడం లేదని భార్యను హతమార్చిన భర్త

కేసు నమోదు నిందితుడు కోసం
పోలీస్‌ల గాలింపు



ప్రజాపక్షం / కొత్తపల్లి : కొడుకు పుట్టడం లేదని భార్యను భర్త హత్య చేసిన సంఘటన కరీంనగర్ రూరల్ మండలంలో చోటు చేసుకుంది. కరీంనగర్ రూరల్ సిఐ ఎ.నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఇలిగేడు మండలం లాలపల్లి గ్రామానికి చెందిన నాతరి చంద్రయ్య తన కుమార్తె స్వరూపను సుమారు 18 సంవత్సరాల క్రితం కరీంనగర్‌కు చెందిన దావు చంద్రకుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వివాహమైన తర్వాత సుమారు 12 సంవత్సరాల వరకు వారికి సంతానం కలగకపోవడంతో చంద్రకుమార్ తన భార్యను తరచూ వేధించేవాడని పిల్లలు పుట్టడం లేదంటూ దూషిస్తూ మరో వివాహం చేసుకుంటానని బెదిరిస్తూ శారీరకంగా హింసించేవాడని స్వరూప తండ్రి తన ఫిర్యాదులో పేర్కొన్నా రు. స్వరూపకు ఒక కుమార్తె జన్మించినప్పటికీ తనకు మగ సంతానం కావాలంటూ చంద్రకుమార్ వేధింపులకు గురి చేసేవాడు. మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను కొట్టడం ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధించడం పలుమార్లు రాత్రి వేళల్లో ఆమెను పుట్టింటి వద్ద వదిలివెళ్లేవాడు. ఆదివారం రాత్రి 9 గంటల సమయంలో చంద్రకుమార్ తన భార్య స్వరూపను వేధిస్తూ ఆమె తల్లిదండ్రులకు ఫోన్ చేసి తీసుకెళ్లాలని లేకపోతే చంపేస్తానని బెదిరించినట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. మరుసటి రోజు ఉదయం స్వరూప మంచంపై అపస్మారక స్థితి లో పడి ఉందని సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు చేరుకున్నారు. ఆమె మెడ కింద భాగంలో గీరిన గాయాలు, కమిలిన గాయాలు కనిపించడంలో వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సంఘటన జరిగిన రాత్రి సుమారు 12 గంటల సమయంలో చంద్రకుమార్ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు తెలిపారు. తన కుమార్తెను భర్తే గొంతు నులిమి హత్య చేసి ఉంటాడని అనుమానిస్తూ తండ్రి చంద్ర య్య పోలీస్‌లకు ఫిర్యాదు చేశారు. పోలీస్‌లు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ఆన్‌సైట్ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రా రంభించారు. మృతదేహాన్ని పరిశీలించగా మెడ కింది భాగం లో గీరిన గాయాలు, కమిలిన గాయాలు గుర్తించారు. అనంత రం శవ పంచనామా నిర్వహించి వైద్యులచే పోస్టుమార్టం చే యించిన తరువాత మృతదేహాన్ని అంత్యక్రియల నిమిత్తం మృ తురాలి తండ్రికి అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చే సి దర్యాప్తు కొనసాగిస్తున్నామని ప్రస్తుతం నిందితుడు పరారీ లో ఉన్నాడని అతడిని త్వరలో పట్టుకొని చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఇన్స్‌పెక్టర్ ఎ.నిరంజన్ రెడ్డి తెలిపారు.

## అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,
సిపి గౌష్ ఆలం



ప్రజాపక్షం/గంగాధర :పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గంగాధర పోలీస్ స్టేషన్ ఆవరణలో కొలువుదీరిన అమరవీరుడు కానిస్టేబుల్ గుజ్జెటి మహేష్ విగ్రహానికి చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం, కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం లు సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 2008లో మావోయిస్టులు, గ్రేహౌండ్స్ బలగాల మధ్య జరిగిన బలిమెల దుర్ఘటనలో విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన మహేష్ సేవలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. అనంతరం అమరుడి కుటుంబ సభ్యులను శాలువాతో ఘనంగా సత్కరించి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో విద్యార్థుల కోసం ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయుధాలు, పోలీస్ సేవలు, శాంతి భద్రతల పరిరక్షణ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం అంటేనే అత్యున్నత క్రమశిక్షణ, త్యాగ నిరతితో కూడుకున్నదని సమాజ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టే పోలీస్‌ల సేవలు చిరస్మరణీయమని అన్నారు. సిపి గౌష్ ఆలం మాట్లాడు తూ దేశ అంతర్గత భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని అమరవీరుల కుటుంబాల కు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. వారి త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఎసిపి విజయ్ కుమార్, చొప్పదండి ఇన్స్‌పెక్టర్ ప్రదీప్, ఎస్ఐలు వంశీకృష్ణ, రాజ్‌కుమార్, రాజులతో పాటు పోలీస్ సిబ్బంది, అమరుడి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరుల త్యాగాలను స్మరించుకోవాలి

సైకిల్ ర్యాలీలో సిపి రశ్మీపేరుమాళ్



ప్రజాపక్షం/ సిద్దిపేట : పోలీసు అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని జిల్లా పోలీస్ కమిషనర్ రశ్మీ పేరుమాళ్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీ కార్యక్రమంలో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మి పెరుమాళ్ ముఖ్య అతిథిగా పాల్గొని, జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సైకిల్ ర్యాలీ సిపి రశ్మీ పేరుమాల్ స్వయంగా సైకిల్ తొక్కి ర్యాలీని పూర్తి చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఈరోజు సైకిల్ ర్యాలీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరులు చేసిన త్యాగాలను జిల్లా ప్రజలకు తెలియజేయడమే ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. 100కి పైగా సైకిళ్లతో సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ పాఠశాల మైదానం వద్ద ప్రారంభమైన ఈ సైకిల్ ర్యాలీ ముస్తాబాద్ చౌరస్తా, విక్టర్ చౌరస్తా మీదుగా సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తా వరకు వైభవంగా కొనసాగింది. సైకిల్ ర్యాలీని అనుసరిస్తూ పోలీసు అధికారులతో పాటు పోలీస్ సిబ్బంది కూడా బైకులతో ర్యాలీలో పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి (అడ్మిన్) కుశాల్కర్ గారు, అదనపు డిసిపి సుభాష్ చంద్రబోస్ గారు, సిద్దిపేట్ పట్టణ ఇన్స్‌పెక్టర్లు, ఎస్ఐలు, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు ,పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్




ప్రజాపక్షం/సుల్తానాబాద్ : పోక్సో చట్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేశ్ అన్నారు. సోమవారం పాన్ ఇండియా సురక్షిత్ బచపన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్‌పి హైస్కూల్ (బాలికల) లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుండి 31 వరకు పోక్సో చట్టం పై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. 18 సం.ల లోపు బాల బాలికలకు పోక్సో చట్టం వర్తిస్తుందని,చట్టంలో పొందుపరిచిన అంశాల ఆధారంగా బాల బాలికలకు రక్షణ ఉంటుందని తెలిపారు.సోషల్ మీడియా పట్ల అమ్మాయిలు అప్రమత్తంగా ఉండాలని,అపరిచితుల వలలో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాలికలకు ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే మండల న్యాయ సేవాధికార సంస్థ సంప్రదించినట్లయితే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఆవుల శివకృష్ణ, న్యాయవాదులు ఆకారపు సరోత్తం రెడ్డి, బొయిని భూమయ్య, సామల రాజేంద్ర ప్రసాద్, వేముల స్నేహ, స్కూల్ ప్రిన్సిపాల్ దివాకర్,ఉపాధ్యాయులు,విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజావాణి 162 దరఖాస్తులు

అర్జీలు స్వీకరించిన కలెక్టర్



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ ఐడిఓసి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 162 దరఖాస్తులు వచ్చాయి. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌కు అత్యధికంగా 42 దరఖాస్తులు అందాయి. కరీంనగర్ రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయానికి 23, గృహనిర్మాణ సంస్థకు 21 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తులను పెండింగ్ లో ఉంచకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ చిత్రా మిశ్రా.. సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమానికి అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు.

**మండల స్థాయి ప్రజావాణికి 79 దరఖాస్తులు**

జిల్లాలోని అన్ని మండలాల్లో మండల స్థాయిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తంగా 79 దరఖాస్తులు అందాయి. అత్యధికంగా హుజురాబాద్ మండలానికి 14 దరఖాస్తులురాగారామడుగుమండలంలోఒకఅర్జీ కూడా అందలేదు.

**వేగంగా కోర్టు కేసుల పరిష్కారం**

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పెండింగ్ లో ఉన్న కోర్టు కేసులను ప్రాధాన్యత ప్రాతిపదికన వేగంగా పరిష్కరిస్తున్నారు. మొత్తం 306 పెండింగ్ కేసుల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. మున్సిపల్ కార్పొరేషన్ లో 11, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో 4 కోర్టు కేసులు అత్యధికంగా పెండింగ్‌లో ఉన్నాయి. నిర్ణీత కాల పరిమితిలోగా పెండింగ్ కేసుల పూర్తి పరిష్కారానికి జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది.

## రీజనల్ ఒలింపియాడ్‌కు 'ఆల్ఫోర్స్' విద్యార్థుల ఎంపిక



ప్రజాపక్షం/కొత్తపల్లి : జాతీయస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రీజనల్ మ్యాథమెటిక్స్ ఒలంపియాడ్‌కు ఆల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే గణితంపై ఆసక్తిని పెంపొందించడం, సృజనాత్మక ఆలోచనలను ప్రో త్సహించడం, క్లిష్టమైన సమస్యలను విశ్లేషించి పరిష్కరించే సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం ఆల్ఫోర్స్ విద్యా విధానంలో ముఖ్య భాగమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను చాటాలని ఆకాంక్షించారు. రీజనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్‌కు ఎంపికైన విద్యార్థులకు వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయులకు, వారి తల్లిదండ్రులకు ఆయన అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ , సిబ్బంది పాల్గొన్నారు.

## చదువు కోసం నిత్యం మూడు కిలోమీటర్ల నడక..

ఆర్‌టిసి, విద్యాశాఖ అధికారులు
తక్షణమే స్పందించాలి

ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన విద్యావ్యవస్థలో పాఠశాలకు చేరుకోవడమే వారికి నిత్య పోరాటంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలనే ఆశతో ప్రతిరోజూ సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్లి బస్ ఎక్కి పాఠశాలలకు,కళాశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నప్పటికీ జగిత్యాల ఆర్టీసీ అధికారుల్లో చలనం కనిపించడం లేదు. సమయానికి బస్ రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల రవాణా ఇబ్బందులపై గతంలోనే పత్రికలో కథనం ప్రచురితమైనా, సమస్య పరిష్కారానికి ఆర్టీసీ, విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడంపై స్థానికంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. కనీసం క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, విద్యార్థుల ఇబ్బందులపై వివరాలు సేకరించేందుకు కూడా అధికారులు చొరవ చూపకపోవడం విచారకరమని హబ్సీపూర్ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలి,సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యార్థుల సంఖ్య,పాఠశాల సమయాలు, బస్సుల రాకపోకల పరిస్థితిని పరిశీలించి, అవసరమైన బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. విద్యాశాఖ అధికారులు కూడా ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి రూ.30 లక్షల వైద్య పరికరాలు

కెటిఆర్ చొరవతో సిఎస్ఆర్ నిధులతో
రోగులకు అందుబాటులోకి



ప్రజాపక్షం /రాజన్న సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ సిఎస్ఆర్ నిధులతో సిరిసిల్ల ప్రధాన ఆసుపత్రికి సుమారు 30 లక్షల విలువైన వైద్య పరికరాలు సమకూర్చారు. సోమవారం కెటిఆర్ ఈ పరికరాలను ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ చొరవ తీసుకున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించలేని పేదలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ఈ పరికరాలను సమకూర్చేందుకు కృషి చేశానని అన్నారు. కెటిఆర్ వెంట నాస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, చల్మెడ లక్ష్మీ నరసింహారావు, మున్సిపల్ చైర్పర్సన్ జిందం కళ చక్రపాణి, హాస్పిటల్ సూపరింటెండెంట్, డాక్టర్లు, బిఆర్ఎస్ నాయకులు బొల్లి రామ్మోహన్, కుంభాల మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

## ప్రజావాణికి అధికారులు గైర్హాజరు



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం మండలంలో ఆశించిన లక్ష్యాన్ని సాధిస్తోందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారం చూపాల్సిన ఈ కార్యక్రమానికి పలువురు అధికారులు గైర్హాజరవుతుండటం విమర్శలకు తావిస్తోంది.మొత్తం 25 మంది మండల స్థాయి అధికారులు ఉండగా, అందరూ హాజరుకావాల్సిన కార్యక్రమానికి కొందరు మాత్రమే వస్తుండటంతో ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజావాణి నిర్వహణకు సంబంధించిన హాజరు రికార్డులను పరిశీలిస్తే అధికారుల హాజరు తగ్గిన సందర్భాలు కనిపిస్తున్నాయి. ప్రజావాణికి పలువురు అధికారులు గైర్హాజరవుతున్న విషయంపై ఎంపిడిఒను వివరణ కోరగా, ఈ అంశాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. అయితే, గైర్హాజరుకు కారణాలేమిటి? బాధ్యతలు నిర్వర్తించని అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు? అన్న ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది.ప్రజల సమస్యల పరిష్కారానికి ఉద్దేశించిన కార్యక్రమంలో అధికారుల హాజరును నిర్ధారించడంతోపాటు, ప్రజావాణిపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



ప్రజాపక్షం/నిజామాబాద్ : ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 121 ఫిర్యాదులు అందాయి. అదనపు కలెక్టర్లు రాజాగౌడ్, భుజంగరావు, డిఆర్ఓ గీత, జడ్‌పి సిఇఓ సాయాగౌడ్, డిఆర్‌డిఓ సాయన్న, మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌తో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. ఎల్ నినో ప్రభావంతో నెలకొన్న పరిస్థితులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. మండల ప్రత్యేకాధికారులు అవగాహన సదస్సులలో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు

ప్రజాపక్షం/నేరడిగొండ: ఐసిడిఎస్ బోథ్ ప్రాజెక్టు పరిధిలోని నేరడిగొండ మండలంలో 5 అంగన్‌వాడీ టీచర్, 3 హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపర్ వైజర్ ఉమారాణి తెలిపారు. టీచర్ పోస్టులు తర్నం(ఒసి), బోరిగాం, మాదాపూర్(ఎస్‌టి), నారాయణపూర్(బిసి–డి), ధనోరా (ఎస్‌సి), హెల్పర్ పోస్టులు ఇస్పూర్, రోల్‌మామడ, వెంకటాపూర్(ఎస్‌టి) గ్రామాలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు 28లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ‘మానవతా సదన్’ చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలి: కలెక్టర్



ప్రజాపక్షం/నిజామాబాద్ : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని మానవతా సదన్ చిన్నారులు ఉన్నత స్థానాలకు ఎదగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకాంక్షించారు. డిచ్‌పల్లిలో కొనసాగుతున్న మానవతా సదన్‌ను కలెక్టర్ సోమవారం సాయంత్రం సందర్శించారు. సుమారు రూ.8.25 కోట్లను వెచ్చిస్తూ మానవతా సదన్‌లో నూతనంగా నిర్మించదల్చిన భవన సదుపాయాల కోసం స్థల పరిశీలన జరిపారు. ఇప్పటికే అందుబాటులోని నిర్మాణాలు, కిచెన్, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, డార్మెటరీ, ప్లే గ్రౌండ్, లైబ్రరీ తదితర వాటిని కలెక్టర్ సందర్శించి సౌకర్యాలను పరిశీలించారు. కొత్తగా నిర్మించిన వాటిని వినియోగిస్తూ పాత భవనాల గదులను కూల్చివేసి వాటి స్థానంలో అన్ని సదుపాయాలతో కూడిన డార్మెటరీలు, కిచెన్, డైనింగ్ హాళ్లను బాలబాలికలకు వేర్వేరుగా నిర్మించాలని అధికారులకు సూచించారు. అనాథ పిల్లల కోసం ఉద్దేశించిన ఈ పనులను పక్కాగా, ప్రణాళికాబద్ధంగా నిర్దేశిత నమూనా మేరకు జరిపించాలని, ఎక్కడ కూడా చిన్నపాటి అవకతవకలకు తావు ఉండకూడదన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, తానే స్వయంగా నిర్మాణ పనుల నాణ్యతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తానని తెలిపారు. వెంటనే పనులను చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తాము అనాథలం, తమకు తల్లిదండ్రులు లేరనే భావన పిల్లల దరి చేరకుండా వారికి అవసరమైన అన్ని రకాల సదుపాయాలు సమకూర్చేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం చొరవ చూపుతోందన్నారు. ఈ సందర్భంగా సదన్ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమంను కలెక్టర్ ప్రశంసిస్తూ చిన్నారులకు తన వెంట తెచ్చిన బహుమతులను అందజేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇన్‌చార్జి డిఇఒ సాయగౌడ్, తహసీల్దార్ సతీష్, ఎంఇఒ నరేష్, మానవతా సదన్ లైజనింగ్ ఇన్‌చార్జి సుధాకర్, రమేష్ తదితరులున్నారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా వాల్మీకి జయంతి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ, ఒక బోయవాడు గొప్ప కవిగా ఎలా మారాడో వాల్మీకి జీవితమే ఉదాహరణ అని చెప్పారు.ఈ వేడుకల్లో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, బిసి అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఎస్‌సి సంక్షేమ అధికారి దయానంద్, ఎస్‌సి కార్పొరేషన్ ఇడి శంకర్, డిఇఒ భోజన్న, డిఆర్‌డిఒ విజయలక్ష్మి , ఎల్‌డిఎం రామ్ గోపాల్, సహాయ బిసి అభివృద్ధి అధికారి సత్యనారాయణ రెడ్డి, జిల్లా వాల్మీకి సంఘ ప్రతినిధులు ఆకుల సుదర్శన్, వేల్పుల మల్లేష్, ఎండపల్లి అశోక్,ఆకుల రాజేశ్వర్, ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పుష్కరాలకు రూ.70 కోట్ల నిధులు

**మంత్రి వివేక్ వెంకటస్వామి**





ప్రజాపక్షం / జైపూర్: వచ్చే ఏడాది నిర్వహించే గోదావరి పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ. 70 కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు రాష్ట్ర ఉపాధి, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం జైపూర్ మండలంలోని వేలాల గ్రామంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి గోదావరి నది, పుష్కర ఘాట్లను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించడానికి గోదావరి పరివాహక ప్రాంతంలోని పలు దేవాలయాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన రవాణా సౌకర్యాల కోసం రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయని, రాబోయే రెండేళ్లలో నియోజకవర్గానికి 15 వేల ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు తారుమారయ్యాయని, ఈ కష్టకాలంలో రైతులు, ప్రజలు ఓపికతో ఉండాలని కోరారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకుందని విమర్శించారు. శివారం గ్రామంలోని ఎలుమడుగు అభివృద్ధికి రూ. 15 కోట్ల నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ మండల, గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**జర్నలిస్టులకు అండగాఉంటాం**

ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర కీలకమని, పాత్రికేయుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. మండల పర్యటనలో భాగంగా వేలాల గ్రామానికి వచ్చిన మంత్రిని జైపూర్ మండలంలోని వివిధ సంఘాలకు చెందిన జర్నలిస్టుల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయులంతా ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి ముందుకు సాగాలన్నారు. మండల అభివృద్ధి, గోదావరి పుష్కరాల నిర్వహణకు సంబంధించి జర్నలిస్టులు తగిన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితుల్లో వస్తున్న మార్పులపై ప్రజలకు, రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాల కేటాయింపుతో పాటు ప్రెస్ క్లబ్ భవన నిర్మాణం చేపట్టాలని పాత్రికేయులు కోరగా, ప్రభుత్వం తప్పకుండా న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు దుస్సా భూమన్న, శ్రావణ్ కుమార్, దుర్గాప్రసాద్, రాజశేఖర్, రమేష్ గౌడ్, బాలరాజు, సతీష్, మల్లేష్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికారుల తప్పిదాలతో రైతులకు నష్టం

**ఒక్కరు భూమి అమ్మితే వందల ఎకరాలు నిషేధిత జాబితాలో చేర్చారు**

**ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**



ప్రజాపక్షం/భైంసా : రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, గత పాలకుల పట్టింపులేని వైఖరితో నియోజకవర్గంలోని వేలాది మంది రైతులు కోట్లాది రూపాయలు నష్టపోయారని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ముధోల్ మండలం రాంటెక్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడారు. రైతులకు మాయమాటలు చెప్పి వారి భూములను పంజాబ్ కంపెనీకి అప్పగించారని ఆరోపించారు.రాంటెక్‌లో 37 ఎకరాల 20 గుంటల భూమి విక్రయానికి సంబంధించి 295 ఎకరాలను, వెంకటాపూర్‌లో 35 ఎకరాల భూమి విక్రయానికి సంబంధించి 152 ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చడంతో వందలాది మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో రైతుబంధు అందక సుమారు రూ.3.60 కోట్ల నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. తానూరు, ముధోల్ మండలాల్లోనూ వేలాది ఎకరాల భూములు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నాయని అన్నారు.రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో చర్చించడంతో బాధిత గ్రామాల్లో రెవెన్యూ సభలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.గ్రామసభలో సర్పంచ్ గంగాధర్, సీనియర్ నాయకుడు నర్సా గౌడ్,రెవెన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ దవాఖానాకు తాళం!

**పురిటి నొప్పులతో గర్భిణి అవస్థలు**





ప్రజాపక్షం / కౌటాల: ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు జరుగుతుందని నమ్ముకొని వచ్చిన ఓ నిండు గర్భిణికి తాళం వేసిన దవాఖానా దర్శనమిచ్చింది. కౌటాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం ఉ దయం తాళం వేసి ఉండటంతో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణి తీవ్ర అవస్థలు పడింది. తాటిపల్లి గ్రామానికి చెందిన బోయేర్ పల్లవి ప్రసవ వేదనతో బాధపడుతుండగా భర్త మంగేష్, స్థానిక ఆయాగా ఉండే సునీతతో కలిసి సోమవారం తెల్లవారుజామున 6 గంటలకు కౌటాల ప్రభుత్వ దవాఖానాకు తీసుకువచ్చారు. తీరా అక్కడికి చేరుకునేసరికి ఆసుపత్రికి తాళం వేసి ఉంది. అత్యవసర సహాయం కోసం 102 వాహనానికి ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందన లేదని బాధితురాలి కుటుంబ సభ్యులు ఆరోపించారు. స్థానికంగా వైద్య సేవలు అందకపోవడంతో ప్రాణభయంతో పురిటి నొప్పులతోనే ఆమెను సిర్పూర్ ఆసుపత్రికి తరలించాల్సి వచ్చింది. ఈ సందర్భంగా బాధితురాలి భర్త మంగేష్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో వైద్యం అందించాల్సిన ప్రభుత్వ దవాఖానా మూసివేసి ఉండటం దారుణమన్నారు. 102 వాహనం సిబ్బంది కూడా స్పం దించకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ దవాఖానలో 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు చర్య లు చేపట్టాలని, బాధ్యులపై విచారణ జరిపి చర్య లు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.

## కండక్టర్ ప్రవళికపై దాడి హేయం

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**



ప్రజాపక్షం / ఆసిఫాబాద్: విధులు నిర్వహిస్తున్న టిజిఎస్‌ఆర్‌టిసి మహిళా కండక్టర్ ప్రవళికపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధితురాలికి తక్షణమే న్యాయం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కండక్టర్‌పై దాడికి నిరసనగా సోమవారం ఎఐటియుసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ డిపో ప్రధాన గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సులో విధుల్లో ఉన్న మహిళా కండక్టర్ ప్రవళికను ప్రయాణికురాలు కిందకు తోసివేయడంతో తీవ్ర గాయాలయ్యాయని, విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగులకు కనీస రక్షణ కల్పించకపోతే ఎలా విధులు నిర్వహించాలని ప్రభుత్వాన్ని, ఆర్‌టిసి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. దాడికి పాల్పడిన ప్రయాణికురాలిపై సెక్షన్ 121, 122, 133 కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితురాలికి మెరుగైన వైద్య సదుపాయం, వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విధుల్లో ఉన్న ఉద్యోగులందరికీ తగిన రక్షణ కల్పించేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ డిపో ప్రెసిడెంట్ మల్లికార్జున్, కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సహాయ కార్యదర్శి ప్రమీల, కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నీరు, విద్యుత్తు ఆదా చేయాలి: కలెక్టర్

ప్రజాపక్షం / మెదక్ : కలెక్టరేట్ కార్యాలయంలోని నీటిని, విద్యుత్‌ను ఉద్యోగులందరూ ఆదా చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం వల్ల రానున్న రోజుల్లో తాగునీటికి, విద్యుత్‌కు సమస్య వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లో ఫ్యాన్లు, లైట్లు నిరంతరం వెలగకుండా చూసుకోవాలని, అవసరం మేరకే నీటిని వినియోగించాలని సూచించారు. కార్యాలయ ఉద్యోగుల కోసం తెచ్చిన మీ ప్రమాణం నూతన యాప్ లో తప్పనిసరిగా కార్యాలయ ఉద్యోగులు హాజరు నమోదు చేసుకోవాలని, హాజరు నమోదును కార్యాలయ అధికారులు పర్యవేక్షించాలన్నారు. వచ్చే శనివారం లోపు నీప్రమాణం యాప్ లో తప్పనిసరిగా నమోదు కావాలని అధికారుల ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబాదాస్, రాజేశ్వర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాపక్షం/నర్సాపూర్ : నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గ్రామ శివారులోని చికెన్ షాప్ (జల హనుమాన్) సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చిలిప్‌చెడ్ మండలం సమ్లా తండా గ్రామానికి చెందిన మాలోత్ వినోద్ (23), తన స్నేహితుడు బానోత్ సర్దార్ (30)తో కలిసి ఫొటో ఆల్బమ్ ఇచ్చేందుకు ద్విచక్ర వాహనంపై నర్సాపూర్‌కు బయలుదేరారు. పెద్దచింతకుంట శివారుకు చేరుకోగానే మెదక్ నుంచి హైదరాబాద్ వైపు ఇనుప రాడ్ల లోడుతో వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వినోద్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సర్దార్‌కు కూడా గాయాలయ్యాయి. ఇద్దరినీ 108 అంబులెన్స్‌లో నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా వినోద్ మార్గమధ్యంలో మృతి చెందాడు. సర్దార్‌కు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వేరే ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి వాసురాం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, లారీలోని ఇనుప రాడ్లు వెనుకవైపు పొడుచుకు రావడం, డ్రైవర్ ఎటువంటి సూచికలు లేకుండా అకస్మాత్తుగా వేగం తగ్గించడం వల్లే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. లారీ డ్రైవర్ పిండి అంజనేయులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ జాగ్రత్తగా నడపాలని పోలీసులు సూచిస్తున్నారు.

## కొమురం భీమ్ వర్ధంతి అధికారికంగా నిర్వహించాలి

**ఆదివాసీ సంఘాల నేతల డిమాండ్**



ప్రజాపక్షం /నిర్మల్ టౌన్ : నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆదివాసీ నాయక పోడు సంఘం జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్ ఆధ్వర్యంలో కొమురం భీమ్ 86వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకగారి భూమయ్య మాట్లాడుతూ గ్రామగ్రామాన కొమురం భీమ్ చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించడంతో పాటు జెండాలను ఎగురవేసి ఆయన త్యాగాలను స్మరించుకున్నట్లు తెలిపారు. ఆదివాసీ నాయకులు మాట్లాడుతూ కొమురం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆదివాసీల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని చెప్పడం మాత్రమే సరిపోదని, ప్రభుత్వాలు కూడా వాటిని గౌరవించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొమురం భీమ్ వర్ధంతిని అన్ని జిల్లాల్లో అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆయన చరిత్రను భావితరాలకు తెలియజేసే కార్యక్రమాలను చేపట్టాలని కోరారు. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం విషయంలో ప్రభుత్వం వివక్షకు తావులేకుండా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఒక జిల్లాకే గౌరవం.. మిగతా జిల్లాలకు నిర్లక్ష్యమా? అనే ప్రశ్న ఇప్పుడు ఆదివాసీ సంఘాల నుంచి వినిపిస్తోంది. కొమురం భీమ్ త్యాగాలకు నిజమైన నివాళి అర్పించాలంటే ఆయన వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని నేతలు డిమాండ్ చేశారు. ఆదివాసీ సమాజం గౌరవాన్ని కాపాడేలా ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మునలి చిన్నయ్య.జిల్లా అధ్యక్షుడు సాకి లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులు సుంచ సవీన్,రామేష్,సంయుక్త కార్యదర్శి జంగిలి రాకేష్. జిల్లా గౌరవ సలహాదారులు మంద మల్లేష్, బోసని రాజేశ్వర్, తుడుం దెబ్బ జిల్లా కార్యదర్శి తోడసం గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

## బాసర ‘ఐఐఐటి’లో నీటి ఇబ్బందులు కలగకుండా చర్యలు

**రెండు, మూడు రోజుల్లో విద్యార్థులకు భౌతిక తరగతులు**

**కలెక్టర్ భవేశ్ మిశ్రా**




ప్రజాపక్షం/నిర్మల్ : బాసర ఐఐఐటి (ఆర్జీయుకెటి)లో విద్యార్థులకు నీటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. సోమవారం కలెక్టర్ భవేశ్ మిశ్రా బాసర ఐఐఐటిని సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఐఐఐటిలో విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది కలిపి పదివేల మంది వరకు ఉంటారని, వారికి తాగునీరు, రోజువారి అవసరాల నిమిత్తం ప్రతి రోజూ దాదాపు15 లక్షల లీటర్ల వరకు నీరు కావాలని అన్నారు.గోదావరి నది వద్ద ప్రత్యేకంగా ఐఐఐటి కోసం 60 హెచ్ పి సామర్థ్యం గల మూడు మోటార్లు అందుబాటులో ఉండగా, వాటిలో ప్రస్తుతం ఒకటి పూర్తిస్థాయిలో పని చేయగా, రెండు పనిచేయడం లేదని అన్నారు. ఈ విషయం తమ దృష్టికి రాగానే రెండు మోటార్ల మరమ్మతుల కోసం రూ.8 లక్షలు కేటాయించినట్లు వివరించారు. ఇప్పటికే సంబంధిత సాంకేతిక నిపుణుల బృందం ఇంటెక్ వెల్ ను సందర్శించిందని తెలిపారు. పది రోజుల్లోనే రెండు మోటార్లను బాగు చేసి నీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. పెరుగుతున్న నీటి అవసరాలు, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మరొక నూతన మోటార్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.ప్రస్తుతం నీటి అవసరాలకు ఎటువంటి ఇబ్బందులు లేవని, విద్యార్థులకు రెండు, మూడు రోజుల్లోనే భౌతిక తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే భౌతిక తరగతులు ప్రారంభించేలా సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమాల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, గ్రిడ్ డిఈఈ,ఈఈ లు రాజేశ్వర్ రావు రాఘవేంద్ర రెడ్డి,తహసీల్దార్ పవన్ చంద్ర, ఎంపిడిఒ దేవేందర్ రెడ్డి, ఐఐఐటి డీన్‌లు మహేష్, విఠల్, విద్యార్థి సంక్షేమ అధికారి నాగరాజు,సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాల్మీకి ఆదర్శాలు స్ఫూర్తిదాయకం

**కలెక్టర్ ప్రతీక్ జైన్**



ప్రజాపక్షం/సంగారెడ్డి: మహర్షి వాల్మీకి జీవితం, ఆదర్శాలు, ఆయన రచించిన రామాయణం సమాజానికి ఎల్లప్పుడు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బిసి సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి మహర్షివాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మావవాళికి ధర్మం, సత్యం, న్యాయం, కర్తవ్యనిష్ఠ వంటి విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు. వాల్మీకి బోధనలను ఆచరిస్తూ నైతిక విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారి జగదీష్, వివిధ శాఖల అధికారులు , వాల్మీకి జయంతి ఉత్సవ కమిటీ వైస్ చైర్మన్ వెంకటేశం, వాల్మీకి బోయ సంఘం ప్రతినిధులు, టిఎన్‌జిఒ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ‘పొక్సో’ చట్టంపై అవగాహన

ప్రజాపక్షం/బోథ్ : బోథ్ మండలంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు పొక్సో చట్టం, బాలికలపై లైంగిక వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. పిల్లలు తమపై జరిగే అనుచితప్రవర్తనను గుర్తించి భయపడకుండా నమ్మకమైన పెద్దలకు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎజిపి పంద్రం శంకర్, న్యాయవాది కుమ్మరి విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఆత్రం శంకర్, మాడవి లాల్ దేవ్, పరుశురాం, విద్యార్థులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి పూర్తి చేయాలని సైకిల్ యాత్ర



ప్రజాపక్షం / ఆసిఫాబాద్: దశాబ్దాలుగా అసంపూర్తిగా ఉన్న గుండి వంతెన నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజల గోడు వినాలంటూ ఆసిఫాబాద్ మండల యువత వినూత్నంగా సైకిల్ యాత్రకు శ్రీకారం చుట్టింది. గుండి వాగుపై వంతెన లేకపోవడంతో స్థానికులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యకు శాశ్వత పరిష్కారం సాధించడమే లక్ష్యంగా సోమవారం ఈ యాత్రను చేపట్టారు. ఈ సందర్భంగా యాత్ర నిర్వాహకులు మాట్లాడుతూ గుండి వాగుపై వంతెన నిర్మాణం కోసం 2007లో నాబార్డు నిధులు మంజూరై పనులు ప్రారంభమైనప్పటికీ, 2010 నాటికి పూర్తి కావాల్సిన పనులు నేటికీ పూర్తికాకపోవడం దురదృష్టకరమన్నారు. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర వైద్యం అందక రోగులు, బడులకు వెళ్లలేక విద్యార్థులు, పనులకు వెళ్లలేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు విడుదల చేయాలని, పనులు ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టమైన గడువు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## బాలోత్సవ్ 2026 పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం నగరంలో నవంబర్ 11, 12 తేదీలలో జరిగే బాలోత్సవ్ 2026 పోస్టర్‌ను రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం ఆవిష్కరించారు. ఖమ్మం డ్యాన్సర్స్ అసోసియేషన్, వారధి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాలోత్సవ్‌ను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బాలోత్సవ్ నిర్వహణ ద్వారా పిల్లల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఉమ్మడి జిల్లా రాష్ట్రంలోని నలుమూలల నుంచి ఈ బాలోత్సవ్‌లో పాల్గొనాలని ఈ బాలోత్సవ్ విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వారధి ఫౌండేషన్ ఛైర్మన్ చింతనిప్పు కృష్ణచైతన్య, ఖమ్మం డ్యాన్సర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రాయల నాగరాజు, బాధ్యులు సిహెచ్ వెంకటేష్, పగిళ్లపల్లి రాజు, ప్రసాద్, రాజేష్, భవాని పాల్గొన్నారు.

## కార్పొరేషన్‌లో స్పెషల్ డ్రైవ్

### కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణను మెరుగు పరిచేందుకు సమగ్ర కార్యాచరణతో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ ప్రారంభించినట్లు కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ తెలిపారు. కొత్తగూడెం,పాల్వంచ, సుజాతనగర్ పరిధిలోని అన్ని డివిజన్లలో సోమవారం క్షేత్రస్థాయిలో చేపట్టిన స్పెషల్ డ్రైవ్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలు డివిజన్లలో పర్యటించి పనుల పురోగతిని పరిశీలించారు. ఆనంతరం మేయర్ మాట్లాడుతూ నగర ప్రజారోగ్యాన్ని కాపాడటంలో శానిటేషన్ విభాగం పనితీరు అత్యంత కలీకమని బస్తీలు వీధుల్లో నిల్వ ఉన్న చెత్తా చెదారాన్ని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రధాన రహదార్లతో పాటు అంతర్గత వీధుల్లో పేరుకుపోయిన ముళ్లపొదలను సమూలంగా తొలగించి రోడ్లను శుభ్రపరచాలన్నారు. ముగురు నీరు నిల్వలు ఉండకుండా నిరంతరం కాల్వల్లో పూజికతీత పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కాల్వలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టరాదని, ఈవిషయంలో రాజీపడేదిలేదన్నారు. వ్యాధులు ప్రభలకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా పారిశుధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఈ డ్రైవ్‌లో శాశ్వత సిబ్బందితో పాటు ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతీ డివిజన్ పరిధిలో ప్రజల నుండి వచ్చే పారిశుధ్య సమస్యల ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. వార్డుల వారీగా శానిటేషన్ ఇన్స్పెక్టర్లు నిత్యం పర్యవేక్షణ చేపడుతూ లక్ష్యాలను చేరుకోవాలని ఆయన సూచించారు.



## చదువుల్లో మహారాణుల్లా వెలగాలి

### సబ్ కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాచలం :** చదువుల్లో ఆడపిల్లలు మహారాణుల్లా వెలగాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ అన్నారు. భద్రాచలం మహాత్మజ్యోతిబా పూలే తెలంగాణ బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూ.కాలేజీలో ఇంటర్ మొదటి సం.చదువుతున్న బాలికలు ప్రవల్లిక, రేవతి,నందినిలు చదుల్లో ఉత్తమ ప్రతిభ కనపర్చడంతో ఆయన ప్రంశంసా పత్రాలను తమ కార్యాలయంలో సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల్లో చక్కరా రాణించి జీవితాల్లో మంచిగా స్థిరపడాలన్నారు. తోటి విద్యార్థులకు ఈ ప్రంశంస స్ఫూర్తిదాయకం కావాలని అన్నారు. విద్యార్థుల చదువుల విషయంలో రాజీ పడకుండా అన్ని విధాలా సహాయపడాలని ప్రిన్సిపల్‌కు ఆయన సూచించారు. ఐటిసి భాగస్వామ్యంతో కళాశాల్లో నీటి జేఇఇ మెయిన్స్ కోసం ఒక కంప్యూటర్ ల్యాబ్, ఒక మినీ లైబ్రేరీని గతంలో ఏర్పాటు చేశామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వర్ణలత ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా మహాకవి వాల్మీకి జయంతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహాకవి వాల్మీకి జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకల్లో వైరా ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంఎల్‌ఏ రాందాస్ నాయక్, సుడా ఛైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, జిల్లా బిసి అభివృద్ధి అధికారిణి జ్యోతి తదితరులు వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మాట్లాడుతూ మహాకవి వాల్మీకి రామాయణాన్ని రచించి ఆ గ్రంథం ద్వారా సమాజానికి అనేక విలువలను అందించారన్నారు. రామాయణం ద్వారా ఆదర్శ మానవునికి ఉండాల్సిన లక్షణాలు, మానవ సంబంధాలు, నైతిక విలువ గురించి వాల్మీకి బోధించారన్నారు. ఆయన రచించిన రామాయణంలోని ఆదర్శాలు నేటి సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. వివిధ సంఘాల నాయకులు మల్లికార్జున్, రాంచందర్‌రావు, దగ్గు శ్రీనివాస్, ఉపేందర్, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, మల్లేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఆగని ఇసుక అక్రమ రవాణా

### పరోక్షంగా సహకరిస్తున్న రెవెన్యూ అధికారులు !

### పొంతన లేని తహసీల్దార్ సమాధానం

**ప్రజాపక్షం/బోనకల్ :** బోనకల్ మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. రెవెన్యూ అధికారుల సహకారంతో మూడు పువ్వులు ఆరు కాయలు అన్నట్లుగా సాగుతుంది. గతంలో మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి రేవు నుంచి ఇసుక రవాణా జరిగేది. ప్రభుత్వ నిర్మాణాలతో పాటు ఇతర అవసరాలకు ఈ రేవు నుంచి రెవెన్యూ అధికారులు కూపన్లు కేటాయించే వారు. రెండేళ్ల క్రితం ఈ ఇసుక రేవును ఇసుక కొరత కారణంగా నిలిపివేశారు. ప్రస్తుతం బోనకల్ మండలంలో మోటమర్రి ఇసుక రేవు నుంచి ఎగుమతులు జరుగుతు న్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం బ్రాహ్మణపల్లి రేవు నుంచి ఐదు ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తుండగా బోనకల్ ఎస్ఐ మాచినేని రవి తనకున్న సమాచారంతో ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ వివరాలను రెవెన్యూ శాఖకు అందజేశారు.

**పొంతన లేని తహసీల్దార్ సమాధానం :**
ఇసుక తరలింపుకు సంబంధించి పోలీసులు తీసుకు



వచ్చిన ట్రాక్టర్లను వెంటనే విడుదల చేయాలని వారి వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయంటూ బోనకల్ తహసీల్దార్ సుధాకర్ పోలీస్ అధికారులకు తెలియజేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారని దాని ప్రకారమే ఇసుక తరలిస్తున్నారని ఆయన చెప్పుకొచ్చారు. కానీ ఇసుక కావాల్సిన వినియోగదారుడు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న తర్వాత ఆ వివరాలు మండల రెవెన్యూ కార్యాలయానికి వస్తాయి. దానిని పరిశీలించి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఇసుక తరలింపుకు సంబంధించి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇది పద్ధతి. కానీ తహసీల్దార్ చెబుతున్నది తద్ విరుద్ధంగా ఉంది. వారే బుక్ చేసుకుని వారే ఇసుకను తరలించుకుంటున్నారని అందుకు సంబంధించిన ఆధారాన్ని నాకు చూపించారంటూ ఆయన సమాధానం ఇస్తున్నారు. మూతపడిన ఇసుక రేవు నుంచి ఆన్‌లైన్‌లో ఎలా బుక్ చేశారని తహసీల్దార్‌ను ప్రశ్నించగా తనకు ఆ విషయం తెలియదంటూ చెప్పుకొచ్చారు. వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నిస్తానన్నారు. మరి వివరాలు ఏమి తెలియకుండానే ట్రాక్టర్లను రిలీజ్ చేయమని ఎలా ఆదేశాలు జారీ చేశారని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేదు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నప్పుడు ఎన్ని క్యూబిక్ మీటర్ల కొరకు దరఖాస్తు చేసుకున్నారనే వివరాలు ఉంటాయి. దాని ప్రకారమే తరలించాల్సి ఉంటుంది. అలా కాకుండా ఇష్టానుసారంగా ఇసుకను తరలించుకుపోతుంటే తహసీల్దార్ ఆన్‌లైన్ బుకింగ్ అంటూ ఇసుక అక్రమ రవాణాదారులకు వత్తాసు పలకడం పలు అనుమానాలకు తావిస్తుంది. అసలు అధికారులు లేకుండా ఇసుకను తరలించడం జరుగుతుంటే చర్యలు తీసుకోవాల్సిన తహసీల్దార్ వదిలేయడం ఇప్పుడు మండలంలో చర్చనీయాంశమైంది. ఐదు ట్రాక్టర్లను వదిలివేయాలని ఆయన హుకుం జారీ చేశారు. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునేటప్పుడు ఎన్ని క్యూబిక్ మీటర్ల ఇసుక అన్నది బుక్ చేయాల్సి ఉంటుంది. మరి అలా చేశారా అన్న దానిపై వివరణ అడిగేందుకు ప్రయత్నిస్తే ఆయన సమాధానం చెప్పడం లేదు. పైగా వారు ఏదో గంద్ర ఇసుక తొలుకుంటున్నారులే అని వ్యాఖ్యానించడం కొసమెరుపు.

## బంగారం రుణాలపై బ్యాంకుల్లో నో రెన్యూవల్

### ఇబ్బందులు పడుతున్న ఖాతాదారులు

### అప్పుచేసి విడిపిస్తూ మళ్లీ తాకట్టుపెట్టి అప్పు కడుతూ

### పాత విధానాన్నే కొనసాగించాలంటూ డిమాండ్

### ఖాతాదారులు సహకరించాలి : బ్యాంకు మేనేజర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బ్యాంకుల్లో బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న ఖాతాదారులకు రెన్యూవల్ విధానాన్ని నిలిపేయడంతో ఇబ్బందికరంగా మారింది. దీనిపై పులువురు ఆవేదన వ్యక్తం చేస్తూ పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఏడాది గడువు ముగిసిన రుణాలకు వడ్డీ చెల్లించి రెన్యూవల్ చేసుకునే అవకాశం ఉండేది. రిజర్వ్‌బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిబంధనల ప్రకారం ప్రస్తుతం వెసులుబాటు లేకపోవడంతో అప్పుతీర్చేందుకు మళ్లీ అప్పు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. డబ్బులు లేకనే మెడకు ఉండే పుస్తెల తాడు,నల్లపూసల గొలుసులు గాజులు హారాలు ఉంగరాలు కడి



యాలు తదితర బంగారు ఆభరణాలను బ్యాంకుల్లో తాకట్టు పెడుతుంటారు. చిరువ్యాపారులు, వ్యవసాయదారులకు అత్యవసర సమయాల్లో బంగారు రుణాలు ఆర్థిక అండగా నిలుస్తుంటాయి. అయితే ఏడాదిలోగా విడిపించుకోకపోతే బ్యాంకర్లు డబ్బులు చెల్లించి బంగారాన్ని విడిపించుకోవాలంటూ లేదంటే నిబంధనలు ఒప్పుకోవని అంటున్నారు. దీంతో చేసేది లేక వేరే దగ్గర అధిక వడ్డీకి డబ్బులు తెచ్చి బ్యాంకుల్లో చెల్లించి విడిపించిన బంగారాన్ని మళ్లీ తాకట్టుపెట్టి వచ్చిన మొత్తంతో తెచ్చిన అప్పును తీర్చాల్సి వస్తోందని ఖాతాదారులు వాపోతున్నారు. తద్వారా ఆర్థిక భారం పడుతుందని, వడ్డీ, ఇతర ఛార్జీలు పడటంతో ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. రుణాల చెల్లింపులో ఆర్థిక క్రమశిక్షణ అవసరమే అయినప్పటికీ సకాలంలో వడ్డీ చెల్లించే ఖాతాదారులకు నిబంధనల ప్రకారం రెన్యూవల్ అవకాశం కల్పించాలని కోరుతున్నారు. పాత విధానాన్ని కొనసాగించడం ద్వారా ఆర్థిక ఇబ్బందులు కొంత వరకు తగ్గుతాయనే అభిప్రాయాన్నివ్యక్తం చేస్తున్నారు. రుణాలపై కొత్త నిబంధనలు అమలు చేస్తున్న బ్యాంకులు ఆర్థిక సంస్థలు ఖాతాదారుల పరిస్థితులను కూడా పరిగణలోనికి తీసుకుని తగిన వెసులుబాటు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆర్‌బిఐ గైడ్‌లైన్స్ ప్రకారమే కెనరాబ్యాంకు మేనేజర్ : ఏడాది కాలపరిమితి పూర్తయిన బంగారు రుణాలపై ఆర్‌బిఐ కొత్త విధానాలు ఏడాదిగా అమలవుతున్నాయి. రెన్యూవల్ విధానాన్ని రద్దు చేశారు. గడువు పూర్తయిన బంగారు రుణాల వ్యవహారంలో పూర్తిగా చెల్లింపులు చేసి లోన్ ముగింపు చేయాలి. ఆ తర్వాతే మళ్లీ కొత్తరుణం మంజూరు అవుతుంది. సకాలంలో రుణాలు చెల్లించి ఖాతాదారులు అంతా సహకరించాలి. దీనిపై భద్రాచలం కెనరా బ్యాంకు మేనేజర్ ప్రజాపక్షం కు మారిన నిబంధనలపై వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా మేనేజర్ తన పేరును చెప్పేందుకు ఇష్టపడలేదు.



## సత్వరమే వినతులు పరిష్కరించాలి

### సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ

**ప్రజాపక్షం/భద్రాచలం :** ప్రజావాణిలో వచ్చిన వినతులను వేగంగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మ్రినాళ్ శ్రేష్ఠ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి హాజరైన ఆయన పలు వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వారివారి సమస్యలపై నేరుగా వినతులు అందిస్తే పరిష్కారమవుతాయని, మరోప్రక్క ప్రభుత్వ పథకాలను కూడా అందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. అందిన ప్రతీ విన్నపాన్ని ఆన్‌లైన్ చేయాలని సంబంధిత శాఖాధికారులు వ్యక్తిగత పర్యవేక్షణ చేయాలన్నారు.

**అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు :** అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ పథకాలు ప్రాధాన్యతా క్రమంలో అందుతాయని ఐటిడిఏ ఏపిఓ జనరల్ డేవిడ్ రాజు అన్నారు.సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పలు ప్రాంతాల నుండి వచ్చిన గిరిజనుల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండివచ్చిన గిరిజనుల అందించిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించాలన్నారు. పరిష్కారానికి వీలుగానివైటిపై నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శబరి స్మృతి యాత్ర

### ఆలయంలో ప్రత్యేక పూజలు -గిరి ప్రదిక్షణ

**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్ర స్వామివారి ఆలయంలో సోమవారం శబరి స్మృతియాత్ర వైభవంగా జరిగింది. ఈ వేడుకకు పరిసర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున గిరిజనులతో పాటు పలువురు ప్రజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి పూల పండ్ల అటవీ ఫల సముదాయాలతో నైవేద్యం సమర్పించి నీరాజనాలు సమర్పించారు. ఈ వేడుకలో పెద్ద ఎత్తున గిరిజనులు కొమ్ము నృత్యాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాల్లో ఆధ్యాత్మిక శోభ ఉట్టి పడింది. ఇందులో భాగంగా పట్టణంలో గిరి ప్రదిక్షణ వైభవంగా జరిగింది. పట్టణంలో ఉన్న శబరి విగ్రహానికి అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ శ్రీరామునికి ఎంగిలి పండ్లు తినిపించిన అత్యంత గొప్ప భక్తురాలు శబరి అన్నారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని శబరిని స్మరించుకుంటూ స్మృతియాత్ర నిర్వహించడం ఆధ్యాత్మిక చింతనకు ఆనవాలుగా నిలుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం కృష్ణ, ముర్ల రమేష్, ఆలయ ఇఓ దామోదర్రావుతో పాటు పలువురు గిరిజన గిరిజనేతర భక్తులు పాల్గొన్నారు.

## కండక్టర్‌పై దాడికి ఆర్‌టిసి కార్మికుల నిరసన

**ప్రజాపక్షం/ఖమ్మం :** మణుగూరు డిపో ఆర్టీసి మహిళా కండక్టర్‌పై ప్రయాణికురాలి దాడికి నిరసనగా అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆర్టీసి యూనియన్లు నిరసన తెలియజేశాయి. బస్సులో నుంచి మహిళా ప్రయాణికురాలు కండక్టర్‌ను నెట్టివేసిన ఘటనకు అధికారులు తక్షణమే స్పందించాలని, సిబ్బందికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నల్ల రిబ్బన్లతో విధులకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి ఎంప్లాయిస్ యూనియన్ రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, అధ్యక్షులు భూదాటి శ్రీనివాసరెడ్డి, నాయకులు గుర్రం రామారావు, అనిత, బేతంపూడి బుచ్చిబాబు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజియన్ కార్యదర్శి పిట్టల సుధాకర్, డిపో కార్యదర్శి రోశయ్య, నాయకులు వినోదరావు, టిడబ్ల్యు కార్యదర్శి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

## ముమ్మరంగా పట్టభద్రుల ఓట్ల నమోదు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని బిఆర్‌ఎస్ నాయకులు ముమ్మరంగా చేపట్టారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్‌లో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టభద్రుల ఓట్ల నమోదును సుడా మాజీ ఛైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ సూచనలతో దేవభక్తిని కిషోర్‌బాబు ఆధ్వర్యంలో ముమ్మరంగా చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులను కలిసి 101 ఓట్లను నమోదు చేయించారు. ఎల్‌బి నగర్ ప్రాంతంలో వాంకుడోత్ సురేష్ ఆధ్వర్యంలో 54 ఓట్లు, వైఎస్‌ఆర్ కాలనీ, బాలపేట ప్రాంతాల్లో కందాల వీరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో 47 ఓట్లను నమోదు చేశారు. ఓట్లకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఎంఎల్‌సి అభ్యర్థి రాకేష్‌రెడ్డి, ఖానాపురం హవేలీ ఇంచార్జి కార్తీక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా దేవభక్తిని కిషోర్‌బాబు మాట్లాడుతూ గత పట్టభద్రుల ఎన్నికల్లో ఓటరుగా నమోదైన వారి వివరాలను తెలుసుకుని మరల వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 2023 నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులు తమ ఓటు నమోదు చేసుకునేలా ఇంటింటికి తిరిగి అవగాహన కల్పిస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నవంబర్ ఆరు లోపు తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రహీం, విజయ్, యూసఫ్ పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ముందస్తు అరెస్టు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని ఉద్యమకారుల ఫోరం హెచ్చరించిన నేపథ్యంలో ఉద్యమకారులను పోలీసులు సోమవారం ముందస్తుగా గృహ నిర్బంధం చేశారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో తెలంగాణ ఉద్యమకారుడు నాగులమీరాను పోలీసులు ముందస్తుగా గృహ నిర్బంధం చేపట్టారు. ఈ సందర్భంగా నాగులమీరా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇలా నిర్బంధించడం సరైంది కాదన్నారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలన్నారు.



## ప్రజావాణి వినతులు సత్వరమే పరిష్కరించాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును సత్వరమే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ అంకిత్ అదేశించారు. సోమవారం



ఐడిఓసిలో నిర్వహించి ప్రజావాణికి హాజరైన ఆయన పలు ప్రాంతాల నుండి తరలవచ్చిన ప్రజల నుండి వినతి పత్రాలను స్వీకరించి వాటిని సంబంధిత అధికారులకు బట్వాడా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. పరిష్కారానికి వీలుగాని వాటిపై సమగ్ర నివేదికలు అందిచాలని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగావ్యవహరించే వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

# రవాణా శాఖలో 'ఏక్‌నిరంజన్'

### వసూళ్లు, పంపకాలు అన్నీ ఆయనేనట

### వార్తలు రాస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయట - సారు హెచ్చరిక

**ప్రజాపక్షం/ఖమ్మం(బైపాస్ రోడ్డు) :** ఖమ్మం రవాణా శాఖలో ఏక్ నిరంజన్ హవా నడుస్తుంది. ప్రభుత్వ నియమ నిబంధనలు గాలికి వదిలి తన సొంత ఎజెండాను అమలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా వసూళ్లు చేయడం తన అవినీతికి మద్దతునిచ్చిన వారికి పంపిణీ చేయడం మొత్తం ఇప్పుడు సారే చూస్తున్నారట. రవాణా శాఖాధికారి కార్యాలయంలో ప్రస్తుతం అన్ని పనులు ఆయనే చక్కబెడుతున్నారట. కార్యాలయాల్లో వివిధ పనుల నిమిత్తం వచ్చే వారు సైతం ఆయననే కలవాలని హుకుం జారీ చేస్తున్నారట. తెలిసి జరుగుతుందో తెలియక జరుగుతుందో కానీ జిల్లా రవాణా శాఖాధికారిని ఎవరైనా కలిస్తే వెంటనే ఆ ఎంవిఐని కలవండి అని సూచిస్తున్నారట. జిల్లా వ్యాప్తంగా వసూళ్లు చేయడం ఈ అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు కొందరికీ నెలవారి చెల్లింపులు చేయడం ఈ సారు ద్వారానే జరుగుతుంది. స్వయంగా ఈ అధికారే నేను దసరా మాముళ్లు పంచే పనిలో ఉన్నాను. చాలా మందికి పంచాల్సి ఉంది. ఇప్పుడు ఖాళీ లేదంటూ దసరా పండుగకు ముందు కార్యాలయంలో హల్‌చల్ చేయడం అక్కడకు వచ్చిన ప్రజలు కూడా గమనించి విస్తుపోయారు. మొత్తానికి జిల్లా రవాణా శాఖా కార్యాలయంలో అన్ని తానై చక్కబెడుతున్న ఈ అధికారి



ఇప్పుడు ఏకంగా బెదిరింపులకు సైతం దిగుతుండటం ఆశ్చర్యపరుస్తుంది. రహదారులపై వాహన తనిఖీల సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా నగదు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. నెలవారి మామూళ్లు ఇస్తున్న వారు ఈ అధికారిని భరించలేక లోలోన కుమిలిపోతున్నారు. 'ప్రజాపక్షం' దినపత్రికలో ప్రచురించిన 'పైకే పారదర్శకత లోపల వసూళ్ల పర్వం' అన్న కథనం ప్రచురించడంతో పలువురు స్వయంగా ఫోన్ చేసి ఈ దోపిడీ భరించలేకపోతున్నామంటూ తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

నెలవారి మామూళ్లలో ఒక్క నెల చెల్లించలేకపోయినా వేటాడి వెంటాడి జరిమానాలు విధిస్తూ వేధిస్తున్నారని, ఒక పక్క వ్యాపారాలు లేక నష్టాల్లో ఉంటే ఇప్పుడు ఈ అధికారి తీరుతో మరింత ఇబ్బందులు పడుతున్నామన్నారు. మొత్తం వసూళ్లకు కేంద్రంగా వ్యవహరించే అధికారి తాను కాకపోతే మిగిలిన అధికారులకు మాముళ్లు చెల్లించని వారి వివరాలు చెప్పి వాహనాలను పట్టుకుని యాజమానులను సీజ్ పేరుతో ఇబ్బందులు పెట్టి, చివరకు నగదు చెల్లింపు తర్వాత రాజీపడుతున్నారని పలువురు వాహనదారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఆర్టీవో కార్యాలయంలో సందర్శకుల వివరాలను హోంగార్డు ద్వారా నమోదు చేయిస్తున్న విధానం కూడా పలు అనుమానాలకు తావిస్తుంది. పేర్లు, ఫోన్ నెంబర్లు, వాహన వివరాలు సేకరించడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక కూడా ఏదో మర్మం దాగి ఉందన్న ప్రచారం జరుగుతుంది.

ఆర్టీవో కార్యాలయంలో జరుగుతున్న మొత్తం వ్యవహారంపై పూర్తి స్థాయిలో విచారణ జరపాల్సి ఉంది. ప్రభుత్వం ఆర్టీవో కార్యాలయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల వ్యవహారం లేకపోయినా భారీ స్థాయిలో వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

**'ప్రజాపక్షం'కు బెదిరింపులు :**
సోమవారం ఆర్టీవో కార్యాలయంకు సంబంధించి ప్రజాపక్షంలో వార్త ప్రచురించగానే కొందరు ఏజెంట్లకు చెప్పి ప్రజాపక్షం విలేకరిని బెదిరించే ప్రయత్నం చేశారు. మాపై వార్తలు రాస్తే భవిష్యత్తు ఎలా ఉంటుందో తెలుసా ఆయనకు ఒకసారి చెప్పండి అంటూ హెచ్చరికలు జారీ చేస్తున్నారు. చాలా ఇబ్బందులు ఎదురవుతాయి అంటూ ఏజెంట్ల ద్వారా హెచ్చరికలు చేస్తూ ఇప్పటికైనా వార్తలు రాయడం మానుకోండి అంటూ సూచిస్తున్నారట.

# పరువు నష్టం కేసులో రాహుల్‌గాంధీ నిర్దోషి

## తీర్పు వెలువరించిన యుపి సుల్తాన్‌పూర్‌లోని ప్రజాప్రతినిధుల కోర్టు






**సుల్తాన్‌పూర్:** పరువునష్టం కేసులో కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. 2018 కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఒక ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ అప్పటి బిజెపి అధ్యక్షుడు అమిత్ షాపై అభ్యంతకర వ్యాఖ్యలు చేశారంటూ సుల్తాన్‌పూర్‌కు చెందిన స్థానిక బిజెపి నేత విజయ్ మిశ్రా.. రాహుల్‌పై పరువునష్టం కేసు వేశారు. ఆ కేసు విచారణ సోమవారం ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ ప్రజాప్రతినిధుల కోర్టులో జరిగింది. రాహుల్‌ను నిర్దోషిగా ప్రకటిస్తూ కోర్టు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శుభం వర్మ తీర్పు వెలువరించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, రాయ్‌బరేలీ ఎంపి అయిన రాహుల్‌గాంధీ తీర్పు కోసం కోర్టు ముందు హాజరయ్యారు. అయితే రాహుల్‌గాంధీని కోర్టు నిర్దోషిగా విడుదల చేసిందని వాది విజయ్ మిశ్రా తరపు న్యాయవాది సంతోష్ పాండే తెలిపారు. రాహుల్‌గాంధీ నిర్దోషిగా విడుదలైన తర్వాత కోర్టు ప్రాంగణం నుండి బయటకు వస్తుండగా, కాంగ్రెస్ కార్యకర్తలు కోర్టు ఆవరణ వెలుపల డప్పులు కొడుతూ, ఒకరికొకరు స్వీట్లు పంచుకుంటూ, 'సత్యమేవ జయతే' అని నినాదాలు చేస్తూ తీర్పును సంబరంగా జరుపుకున్నారు. ఈ కేసును ఎంపి–ఎమ్మెల్యే కేసుల ప్రత్యేక న్యాయమూర్తి శుభం వర్మ కోర్టులో విచారించారు. తీర్పు తర్వాత, మిశ్రా తరపు న్యాయవాది పాండే మాట్లాడుతూ తాను సాక్ష్యంగా సమర్పించిన సిడిని కోర్టు స్వీకరించిందని తెలిపారు. ఈ కేసును తాను సవాలు చేయాలనుకుంటున్నట్లు ఆయన తెలిపారు. మిశ్రా మాట్లాడుతూ, తగినంత సాక్ష్యాధారాలు లేకపోవడంతో రాహుల్‌గాంధీ నిర్దోషిగా విడుదలయ్యారని, తాము ఉత్తర్వు కాపీని తీసుకుని, దానిని అధ్యయనం చేసి, ఆ తర్వాత న్యాయవాది సలహా మేరకు కోర్టులో అప్పీల్‌కు వెళ్తామన్నారు. సుల్తాన్‌పూర్‌లో ఉన్న కాంగ్రెస్ న్యాయ బృందానికి చెందిన ఒక న్యాయవాది పిటిఐతో మాట్లాడుతూ ఈ కేసు యోగ్యత కంటే ఎక్కువగా బాహ్య కారణాల వల్ల దాఖలు చేయబడిందని తాము భావించామని, అందుకే ఈ కేసు తమకు అనుకూలంగానే వస్తుందని దృఢంగా విశ్వసించామన్నారు.

### నేరస్థులు నడుపుతున్న పార్టీ బిజెపి : కెసి వేణుగోపాల్

కాగా, బిజెపిపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది. ఆపార్టీని నేరస్థులు నడుపుతున్న పార్టీ అని ఆరోపించింది. గాంధేయ మార్గంలో పోరాడి, ప్రేమ, కరుణ, పట్టుదలతో బిజెపిని ఓడిస్తామని ప్రతిపక్ష పార్టీ ప్రతిజ్ఞ చేసింది. 'అమిత్ షా గురించి రాహుల్ జీ 2018లో చేసిన వ్యాఖ్యలలో పరువు నష్టం కలిగించే అంశం ఏమీ లేదని గౌరవనీయ న్యాయస్థానం స్పష్టంగా పేర్కొంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అన్నారు. వాస్తవాలు మన కళ్లెదుటే ఉన్నాయని, ఇది నేరస్థులు నడుపుతున్న పార్టీ, అత్యంత ఘోరమైన నేరాలకు పాల్పడే వారిని అధికారంలో అత్యున్నత శిఖరాలకు ప్రోత్సహిస్తోంది అని బిజెపిపై మండిపడ్డారు.

### రాహుల్ కాన్వాయ్‌కి ప్రమాదం

తనపై ఉన్న పరువు నష్టం కేసు విచారణకు హాజరయ్యేందుకు కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ యుపిలోని సుల్తాన్‌పూర్‌కు వెళ్తుండగా, సోమవారం పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వేపై ఆయన కాన్వాయ్‌లోని కొన్ని వాహనాలు ఢీకొన్నాయని ఒక పోలీసు అధికారి తెలిపారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ క్షేమంగా ఉన్నారని, ఈ ఘటన తీవ్రమైనది కాదని, ఎవరికీ పెద్ద గాయాలు కాలేదని ఆ అధికారి తెలిపారు. ఉదయం సుమారు 10.15 గంటలకు ఈ ఘటన జరిగింది. కాన్వాయ్ ముందు భాగంలో ఉన్న స్థానిక కాంగ్రెస్ నాయకులకు చెందిన ఒక ప్రైవేట్ వాహనం, తెలియని కారణంతో అకస్మాత్తుగా బ్రేకులు వేయడంతో, దాని వెనుక ఉన్న వాహనాలు ఒకదానికొకటి ఢీకొన్నాయని ఆ అధికారి పిటిఐకి తెలిపారు. ఈ ప్రమాదానికి గురైన వాహనాలు, పొరుగున ఉన్న అమేథీ జిల్లాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలతో సహా ప్రయాణికులతో మధ్యలోనే కాన్వాయ్‌లో చేరాయని పోలీసులు తెలిపారు.

### ఘటనపై సిట్ ఏర్పాటు

కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సుల్తాన్‌పూర్ పర్యటన సందర్భంగా, ఆయన కాన్వాయ్‌ను అనుసరిస్తున్న వాహనాలు ప్రమేయం ఉన్న ప్రమాదంపై దర్యాప్తు చేయడానికి ఉత్తర ప్రదేశ్ పోలీసులు సోమవారం ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేశారు. ఈ దర్యాప్తు ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, కారణాలను పరిశీలిస్తుందని, భద్రత, ఎస్కార్ట్ ఏర్పాట్లు లేదా ట్రాఫిక్ నిర్వహణలో ఏదైనా నిర్లక్ష్యం లేదా లోపం ఉందా అనే విషయాన్ని కూడా నిర్ధారిస్తుందని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, వీలైనంత త్వరగా పోలీస్ ప్రధాన కార్యాలయానికి సవివరమైన నివేదికను సమర్పించాలని సిట్‌ను ఆదేశించారు. ఈ దర్యాప్తు బృందానికి లక్నో రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కిరణ్ ఎస్ నేతృత్వం వహిస్తారు. సుల్తాన్‌పూర్ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బ్రిజ్ నారాయణ్ సింగ్, సుల్తాన్‌పూర్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) రామ్ కృష్ణ చతుర్వేది కూడా సిట్‌లో సభ్యులుగా ఉంటారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి చర్యలు సూచించే బాధ్యతను కూడా ఈ బృందానికి అప్పగించినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## జ్ఞానేశ్‌ను కాపాడేందుకే

# మోదీ ప్రభుత్వం ఎత్తుగడలు

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే



**న్యూఢిల్లీ :** లెక్కలేనన్ని ఓట్ల దొంగతనం వెలుగులోకి వచ్చినప్పటికీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటానికి మోదీ ప్రభుత్వం సాధ్యమైన అన్ని ఎత్తుగడలకూ పాల్పడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే సోమవారం ఆరోపించారు. 'సర్' ప్రక్రియలో ఉపయోగించిన సాఫ్ట్‌వేర్ గురించి ఆర్‌టిఐ ద్వారా సమాచారం కోరినప్పుడు, 'వ్యాపార రహస్యాలు' అని పేర్కొంటూ ఎన్నికల కమిషన్ స్పందించడానికి నిరాకరించిందని, జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న తమ డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ ఖర్గే ఎక్స్ పేర్కొన్నారు. ఇది కేవలం ఓట్ల కోసం చేసే పోరాటం కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే పోరాటమని చెబుతూ, ఓటు దొంగతనంకు వ్యతిరేకంగా నవంబర్ 1న రామ్‌లీలా మైదాన్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొని 'ఢిల్లీ చలో' మార్చ్‌లో చేరాలని ఖర్గే ప్రజలకు పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో 16.18 లక్షల ఫారం–6 దరఖాస్తుల వివరాలను బహిరంగపరచలేదని ఆయన ఆరోపించారు. ఆ రాష్ట్రంలోని పిలిభిత్‌లో 10,470 మంది ఓటర్ల రికార్డులలో అవకతవకలు గుర్తించబడ్డాయని, అందువల్ల ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా ఫారం 6, 7, 8లపై విచారణకు ఆదేశించక తప్పలేదని ఖర్గే తెలిపారు. 'బిజెపి, ఎన్నికల సంఘం మధ్య కుమ్మక్కుకు వ్యతిరేకంగా ఇండియా కూటమికి చెందిన మూడు కీలక డిమాండ్లు స్పష్టంగా ఉన్నాయి : సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి, ఆయనకు రక్షణ కల్పిస్తున్న 2023 చట్టాన్ని రద్దు చేయాలి. సర్‌ను తక్షణమే నిలిపివేయాలి. అక్రమంగా తొలగించిన ఓటర్ల పేర్లను పునరుద్ధరించాలి. అన్ని ఎన్నికలను పేపర్ బ్యాలెట్ల ద్వారానే నిర్వహించాలి' అని ఆయన అన్నారు. ఇది కేవలం ఓట్లను కాపాడే పోరాటం కాదని, ఇది రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి ప్రజలు చేస్తున్న పోరాటమని ఖర్గే స్పష్టం చేశారు. 'లెక్కలేనన్ని ఓట్ల దొంగతనం విషయాలు వెలుగులోకి వచ్చినా, జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడటానికి మోదీ ప్రభుత్వం సాధ్యమైన ప్రతీ ఎత్తుగడను వేస్తోంది!' అని పేర్కొంటూ ఆయన తన సుదీర్ఘ పోస్ట్‌ను ప్రారంభించారు. విపత్కరమైన సర్‌లో జరిగిన భారీ, కేంద్రీకృత అవకతవకల వాస్తవాలను బయటపెడుతుందనే కారణంతోనే, వివాదాస్పద ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్ గురించిన సమాచారాన్ని ఎన్నికల సంఘం దాచిపెడుతోందని కాంగ్రెస్ ఆదివారం ఆరోపించింది.

# ఓటర్ల జాబితా ఆధార్‌తో అనుసంధానం

### పోలింగ్ బూత్‌లలో బయోమెట్రిక్ ధృవీకరణ సౌకర్యాలను కల్పించాలని ఎస్‌పి చీఫ్ అఖిలేశ్ డిమాండ్



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితాలలో భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయని సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలని, పోలింగ్ బూత్‌లలో బయోమెట్రిక్ ధృవీకరణ సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు.సోమవారం లక్నోలో జరిగిన విలేకరుల సమావేశంలో అఖిలేశ్ మాట్లాడారు. ఓటర్ల నమోదులో నకిలీలను నివారించడానికి, ఓటర్ల జాబితాల సమగ్రతను నిర్ధారించడానికి ఎన్నికల సంఘం వేలిముద్రల స్కానింగ్‌తో సహా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలని అన్నారు. 'ఓటర్ల జాబితాలను ఆధార్‌తో అనుసంధానం చేయాలి, బూత్ స్థాయిలో బయోమెట్రిక్ రీడింగ్ పరికరాలను అందుబాటులో ఉంచాలి. ఇది ఐచ్ఛికంగా ఉండకూడదు. ప్రతి ఒక్కరినీ చేర్చాలి. ఈ పరికరాలు అంత ఖరీదైనవి కావు. అవకతవకలను సరిదిద్దడంలో సాంకేతిక పరిజ్ఞానం సహాయపడుతుంది' అని ఆయన అన్నారు. ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ద్వారా బిజెపి 'ఓట్ల తారుమారు'కు పాల్పడుతోందని ఆరోపిస్తూ, ఇటువంటి పద్ధతులు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని బలహీనపరుస్తాయని, సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తాయని మండిపడ్డారు. ఆధార్ అనుసంధానం చేయకపోతే, ఎన్నికల సంఘం, బిజెపి ఉద్దేశాలపై ప్రశ్నలు తలెత్తుతాయని, ఓటర్ల జాబితాలను, ఓటర్లను సరిగ్గా గుర్తించడాన్ని వారు కోరుకోవడం లేదని ఆరోపించారు. అఖిలేశ్ తన వాదనలకు మద్దతుగా ఓటర్ల జాబితాలలో అవకతవకలు జరిగినట్లు ఆరోపిస్తూ, పీలిభిత్, లక్నోలోని సరోజినీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కేసులతో సహా పలు ఉదంతాలను ఉదహరించారు. ఆయన పీలిభిత్‌లోని నందలాల్ నిషాద్ కేసును ప్రస్తావిస్తూ, సరోజినీ నగర్‌లో దశరథ్‌గా గుర్తించిన ఒక వ్యక్తి పేరు మీద 100కు పైగా ఫారాలు నింపబడ్డాయని ఆరోపించారు. అనేక పోలింగ్ బూత్‌లలో పేరు కనిపించిన వికాస్ అనే వ్యక్తి కేసును కూడా ఆయన ఉదహరించారు.

# 'జామియా మిలియా ఇస్లామియా'లో ఉద్రిక్తత

- విద్యార్థులు, పారామిలిటరీ సిబ్బందికి మధ్య ఘర్షణ
- విద్యార్థి సంఘ ఎన్నికలను పునరుద్ధరించాలని ఆందోళనలు






**న్యూఢిల్లీ :** జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థి సంఘ ఎన్నికలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గత రెండు వారాల నుంచి విద్యార్థులు ఆందోళన చేస్తున్నారు. అయితే సోమవారం ఉదయం ఎన్నికలకు సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆందోళలను విరమించాలని కోరగా, అందుకు విద్యార్థులు నిరాకరించారు. దీంతో నిరసన చేస్తున్న విద్యార్థులకు, పారామిలిటరీ సిబ్బందికి మధ్య ఘర్షణలు చెలరేగాయి. దాదాపు రెండు వారాలుగా కొనసాగుతున్న ఈ నిరసన దృష్ట్యా విశ్వవిద్యాలయం అన్ని కోర్సుల తరగతులను ఆన్‌లైన్ విధానానికి మార్చడంతో, పరిపాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న విద్యార్థులను క్యాంపస్‌లోకి అనుమతించకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కొందరు నిరసనకారులను అదుపులోకి తీసుకుని, భద్రతను కట్టుదిట్టం చేశారు. విద్యార్థి సంఘ రాజ్యాంగానికి ఆమోదం లభించిన 15 రోజుల్లోగా ఎన్నికలు నిర్వహించాలని విశ్వవిద్యాలయం సోమవారం ఉదయాన్నే ఆదేశించింది. కొనసాగుతున్న నిరసన సందర్భంగా విద్యార్థులకు జారీ చేసిన సస్పెన్షన్, షోకాజ్ నోటీసులను కూడా రద్దు చేసింది. ఆందోళన సమయంలో భద్రతా సిబ్బంది ప్రవర్తనపై విచారణ జరిపేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేసింది. అయితే, ఎన్నికలకు సంబంధించి పరిపాలన విభాగం కచ్చితమైన కాలపరిమితిని ప్రకటించనందున ఇది సరిపోదని ఆందోళన చేస్తున్న విద్యార్థులు పేర్కొన్నారు. 12 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న ఇద్దరు విద్యార్థులలో ఒకరైన రేహన్ ఖాన్, నిరసనకారుల డిమాండ్ల నుండి వారి దృష్టిని మళ్లించడానికి యాజమాన్యం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 'విద్యార్థి సంఘ ఎన్నికలను పునరుద్ధరించి, ఎన్నికల తేదీలను ప్రకటించాలన్నదే మా మొదటి డిమాండ్ అని రాజ్యాంగ ఆమోదానికి గడువు లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ ఆయన అన్నారు. నిరసనకారులు ఆ నోటీసును అంగీకరించి, తమ నిరాహార దీక్షను విరమించాలని యాజమాన్యం కోరుకుంటోందని, వారి దీక్షను విరమించేందుకు కూడా ఒత్తిడి తెచ్చారని ఆయన ఆరోపించారు. డిసెంబర్ 20 నాటికి ముసాయిదా రాజ్యాంగాన్ని సిద్ధం చేస్తామని, ఆ తర్వాత దానికి ఆమోదం తెలిపి, 15 రోజుల్లోగా ఎన్నికల తేదీలను ప్రకటిస్తామని యాజమాన్యం నిరసనకారులకు చెప్పిందని ఖాన్ అన్నారు. కాగా, నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థులు, వారి ప్రతినిధులు సమర్పించిన డిమాండ్ లేఖను పరిశీలించిన అనంతరం విశ్వవిద్యాలయం ఈ ఉత్తర్వు జారీ చేసింది. పరిపాలనపై చేసిన పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు, చర్యలు లేదా సోషల్ మీడియా పోస్టులకు గాను విలేకరుల సమావేశంలో బహిరంగ క్షమాపణ చెప్పడానికి, అటువంటి పోస్టులను సోషల్ మీడియా వేదికల నుండి తొలగించడానికి నిరసన చేస్తున్న విద్యార్థులు అంగీకరించినట్లు కూడా ఆ ఉత్తర్వులో పేర్కొంది. ఈ ఉత్తర్వు జారీ అయిన వెంటనే నిరసనను విరమించుకోవాలని కూడా అందులో తెలిపింది. 2006 నుంచి ఎన్నికలు జరగని జామియా మిలియా ఇస్లామియా స్టూడెంట్స్ యూనియన్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌పై ఈ ఆందోళన కేంద్రీకృతమై ఉంది.

## రూ.100 కోట్ల అవినీతి ఆరోపణలపై

# తమిళనాడులో మాజీ మంత్రి అరెస్ట్



**చెన్నై :** తమిళనాడు రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. డిఎంకె సీనియర్ నేత, మాజీ విద్యా శాఖ మంత్రి అన్బిల్ మహేశ్ పొయ్యమొళిని చెన్నై సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ (ఇసిసిబి) అధికారులు అరెస్టు చేశారు. ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, గుర్తింపు విషయంలో రూ. 100 కోట్ల అవినీతికి పాల్పడ్డాడని ఆయనను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. డిఎంకె ప్రభుత్వ హయాంలో ప్రైవేట్ విద్యా సంస్థలకు శాశ్వత గుర్తింపు, అప్‌గ్రేడేషన్, భవన నిర్మాణ అనుమతులు, నోఅబ్జెక్షన్ సర్టిఫికెట్లు (ఎన్‌ఒసి) ఇప్పిస్తామంటూ కొందరు వ్యక్తులు భారీగా వసూళ్లకు పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ దర్యాప్తు ప్రారంభమైంది. తమిళనాడు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.టి. అరసుమ కుమార్ తదితరులు ఈ వసూళ్లకు పాల్పడినట్లు ప్రైవేట్ పాఠశాలల సమాఖ్య కార్యదర్శి ఇళంగోవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ దర్యాప్తులో భాగంగా డిజిటల్ పరికరాల ద్వారా సేకరించిన ఆధారాలు, పలువురి వాంగ్మూలాల ఆధారంగా డిఎంకె ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రిగా పని చేసినా అన్బిల్ మహేశ్ ప్రమేయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం మహేశ్ దాఖలు చేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు ఇవాళ(సోమవారం) కొట్టేసింది. హైకోర్టు బెయిల్ నిరాకరించిన గంటల వ్యవధిలోనే సిసిబి ప్రత్యేక బృందాలు ఆయనను అరెస్టు చేశాయి. అయితే, తనపై వస్తున్న ఆరోపణలను మాజీ మంత్రి ఖండించగా.. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే టివికె పార్టీ అధికారిక యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తుందని డిఎంకె మండిపడింది. ఈ మొత్తం కుంభకోణంలో ప్రస్తావనకు వచ్చినా 177 పాఠశాలలపై పోలీసులు మరింత లోతుగా విచారణ జరుపుతున్నారు.

# జమ్ములో అగ్నిప్రమాదం

**జమ్ము:** జమ్ము రైల్వే స్టేషన్ సమీపంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటల ధాటికి సుమారు 40 దుకాణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి, భారీగా ఆస్తి నష్టం జరిగింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అధికారుల వివరాల ప్రకారం..ఆదివారం రాత్రి 10:45 గంటలకు శివ్ మార్కెట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. సుమారు ఐదు గంటల పాటు మంటలు కొనసాగగా, సమాచారం అందిన వెంటనే ఏడు ఫైరింజన్లతో ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. తీవ్రంగా శ్రమించిన అగ్నిమాపక సిబ్బంది సోమవారం తెల్లవారుజామున మంటలను అదుపులోకి తెచ్చారు. మంటల తీవ్రత ఎక్కువ ఉండటంతో పాటు, మార్కెట్‌లో దారి ఇరుకుగా ఉండటంతో మంటలను అదుపుచేసేందుకు కష్టతరమైందని అధికారులు తెలిపారు. మంటల్లో ఎక్కువగా ఆహారపదార్థాలు, డ్రై ఫ్రూట్స్ దుకాణాలు దగ్ధం అయ్యాయి. నష్టం విలువ అంచనా వేస్తున్నామని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు చేసి నివేదిక అందిన తర్వాత వివరాలు వెల్లడిస్తామని వారు తెలిపారు.

# పార్లమెంట్ వద్ద అగ్నిప్రమాదం



**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలోని పార్లమెంట్ సమీపంలో ఉన్న నార్త్ బ్లాక్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. సోమవారం ఉదయం భవనం వెనుక వైపు నుంచి దట్టమైన నల్లటి పొగలు రావడంతో అక్కడ కలకలం రేగింది. వెంటనే అప్రమత్తమైన అగ్నిమాపక శాఖ సిబ్బంది ఆరు వాహనాలతో అక్కడికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. నార్త్ బ్లాక్‌లో ప్రస్తుతం మరమ్మతులు, కొన్ని పనులు జరుగుతున్నాయి. భవనం పైకప్పుపై కార్మికులు వెల్డింగ్ పనులు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. అక్కడ ఏర్పాటు చేసిన ఎసి బాయిలర్ వద్ద మంటలు చెలరేగినట్లు అగ్నిమాపక శాఖ తెలిపింది. వెల్డింగ్ పనుల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వచ్చి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. అయితే, ప్రమాదానికి కచ్చితమైన కారణం ఏమిటనేది ఇంకా నిర్ధారణ కాలేదు. సోమవారం ఉదయం 11.10 గంటలకు నార్త్ బ్లాక్ నుంచి పొగలు వస్తున్నట్లు ఢిల్లీ అగ్నిమాపక శాఖకు సమాచారం అందింది. దీంతో వెంటనే ఆరు అగ్నిమాపక వాహనాలను ఘటనాస్థలికి పంపించారు. సిబ్బంది అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా చర్యలు చేపట్టారు. కొద్దిసేపటికే మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ భవనానికి ఎంతమేర నష్టం జరిగిందనే వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. వెల్డింగ్ పనుల సమయంలో మంటలు ఎలా చెలరేగాయి, ఎసి బాయిలర్ వద్ద ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు ఏమిటనే అంశాలపై పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

# ప్రపంచ ఉద్రిక్తతలు చట్టసభలు తగ్గించగలవు

### బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరం సమావేశంలో ఓం బిర్లా




**న్యూఢిల్లీ:**ప్రపంచ ఉద్రిక్తతలను చట్టసభలు తగ్గించగలవని,ప్రపంచ సవాళ్లకు శాంతియుత నిర్మాణాత్మక పరిష్కారాలు సాధించడంలో ఉపయోగపడగలవని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అన్నారు.భారత పాత పార్లమెంటు భవనం సంవిధాన్ సదన్‌లో రెండు రోజులపాటు జరిగే బ్రిక్స్ 12వ పార్లమెంటరీ ఫోరం సమావేశాలను సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. రష్యా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా బ్రిక్స్‌లో వివిధ సభ్యదేశాల ప్రతినిధుల సమక్షంలో ఓం బిర్లా మాట్లాడుతూ, శాంతి, సుస్థిరత,కేంద్రీకృత అభివృద్ధి విషయాలలో బ్రిక్స్‌దేశాలు సమష్టి సంకల్పంతో వ్యవహరించాలని పిలుపు ఇచ్చారు. ఉమ్మడి సవాళ్ళు ఎదుర్కోవడానికి, ప్రజల జీవితాలను మెరుగుపరచుకోవడానికి, పరస్పర అవగాహన పెంచుకోవడానికి బ్రిక్స్‌దేశాలలో ఉండే విజ్ఞానం, వివేకం అందరికీ ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు.చట్టసభలు(పార్లమెంటులు) ప్రజల బలమైన ప్రత్యక్ష ఆకాంక్షలకు వేదికలని అన్నారు. అవగాహన పెంపొందించుకోవడానికి వారధులుగా సేవలు అందిస్తాయన్నారు. ప్రాంతీయ సవాళ్ళు, యుద్ధాలు, ఆర్థిక అస్థిరత్వం,వాణిజ్య ఉద్రిక్తతలు, ఉగ్రవాదం, వాతావరణ మార్పులు వంటి అనేక ప్రధాన ప్రపంచ సమస్యలను ఆయన తన ప్రసంగంలో ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రపంచం ప్రస్తుతం అస్థిర పరిస్థితులమధ్య కాలం వెళ్ళదీస్తోందని అన్నారు.ప్రపంచంలో దాదాపు సగం ప్రపంచ జనాభా,ప్రపంచ భూభాగంలో మూడింట ఒకవంతు భూభాగం బ్రిక్స్ సభ్యదేశాల అధీనంలోనే ఉందని,ప్రపంచ వాణిజ్యంలో, ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాలకు గణనీయమైన వాటా ఉందని అన్నారు. చట్టసభలు ప్రజల విశ్వాసాన్ని పెంపొం దిస్తాయని, అవగాహన పెరుగుదలకు వారధిగా ఉపయోగపడతాయని,ప్రపంచ సవాళ్ళకు శాంతియుత,నిర్మాణాత్మక ప్రతిస్పందనలను ముందుకు తీసుకువెళతాయని అన్నారు.అనిశ్చిత పరిస్థితులు, ఉద్రిక్తతలు జాతీయ సరిహద్దులు దాటి వెళ్ళాయని, ఒక ఉమ్మడి బాధ్యతా స్ఫూర్తిని పాటించాలని పిలుపు ఇచ్చారు.బ్రిక్స్‌దేశాలలో విభిన్నమైన పరిస్థితులు ఉంటాయని,అభివృద్ధికి సంబంధించిన ప్రాధాన్యతలు వేరువేరుగా ఉంటాయని,కానీ మౌలిక ఆశయాల విషయంలో ఏకాభిప్రాయమే ఉంటుందని,శాంతి,భద్రత,పరస్పర గౌరవం,సమాన అవకాశాలు, జీవన విధానంలో ఉన్నతమైన ప్రమాణాలు వంటి విషయాల్లో ఏకాభిప్రాయాలుంటాయన్నారు.ఈ ఉమ్మడి ఆశయాలే విశ్వాసాన్ని నిర్మించడానికి బ్రిక్స్ పార్లమెంటరీ వేదికను ఒక చైతన్యవంతమైన వేదికగా తీర్చిదిద్దుతాయన్నారు. బ్రిక్స్ సభ్యదేశాలను ఈ సమావేశాలకు ఆహ్వానిస్తూ,వారి రాక పరస్పర గౌరవాన్ని,ఉమ్మడి నిబద్ధతను, ప్రజాస్వామ్య విలువలను ప్రతిబింబిస్తుందని అన్నారు.

### సభ్య దేశాల ప్రతినిధులతో ప్రధాని మోదీ భేటీ

బ్రిక్స్ దేశాల మధ్య పార్లమెంటరీ సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై భారత్ దృష్టి సారించింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల నుంచి వచ్చిన పార్లమెంటరీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఢిల్లీలోని సంవిధాన్ సదన్‌లో జరుగుతున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్ ప్రారంభ సమావేశం అనంతరం ఈ భేటీ జరిగింది. వివిధ దేశాలకు చెందిన పార్లమెంటు సభ్యులను ప్రధాని నరేంద్ర మోదీ సాదరంగా ఆహ్వానించారు. తర్వాత కొంతమంది సభ్యులతో ముచ్చటించిన మోదీ, పార్లమెంట్ భవన సముదాయంలో బ్రిక్స్ సభ్య దేశాలు, భాగస్వామ్య దేశాల ప్రతినిధులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు.



# సైనిక ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాల సేకరణకు రక్షణశాఖ ఆమోదం



**న్యూఢిల్లీ :** రక్షణ మంత్రిత్వ శాఖ సోమవారం రూ. 2.12 లక్షల కోట్ల వ్యయంతో తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు, సుదూర కామికాజీ డ్రోన్ వ్యవస్థలతో సహా సైనిక ప్లాట్‌ఫారమ్‌లు, ఆయుధాల సేకరణకు ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన రక్షణ సేకరణ మండలి (డిసిఎ) ఈ సేకరణ ప్రతిపాదనలను ఆమోదించింది. భారత సైన్యం కోసం హై మొబిలిటీ వాహనాలు, సెల్ఫ్‌ప్రొపెల్డ్ ట్రాక్డ్ గన్ సిస్టమ్, తేలికపాటి బహుళ ప్రయోజన హెలికాప్టర్లు (ఎల్‌ఎంఆర్‌హెచ్), అతి స్వల్ప శ్రేణి వాయు రక్షణ వ్యవస్థ, కౌంటర్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్ (సియుఎఎస్) సేకరణకు ఆమోదం లభించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. సైన్యం కోసం ఇతర మానవరహిత వైమానిక వ్యవస్థలు, నిఘా మానవరహిత వైమానిక వాహనాలు, సమీకృత నిఘా, దాడి వ్యవస్థ, సుదూర కామికాజీ డ్రోన్ వ్యవస్థల సేకరణకు కూడా డిసిఎ ఆమోదం తెలిపింది. భారత నౌకాదళం కోసం యాక్టివ్ ఆఫ్‌బోర్డ్ డెకాయ్ సిస్టమ్ (ఎఒడిఎస్), ఇతర ప్రధాన నౌకాదళ ప్లాట్‌ఫారమ్‌ల సేకరణకు ఆమోదం లభించింది. భారత వైమానిక దళం కోసం హెలికాప్టర్లు, వాయు రక్షణ వ్యవస్థలు, రాడార్ల సేకరణకు డిఎసి ఆమోదం తెలిపింది.

## అమెరికా మధ్యంతర ఎన్నికలు

### భారత సంతతి షా–పియాలకు గెలుపు అవకాశం



**న్యూయార్క్:** అమెరికాలో జరుగుతున్న మధ్యంతర ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డాక్టర్ అమిష్ షా(48), పియా దాండియా(39)లు విజయం దిశగా దూసుకుపోతున్నారు. నవంబరు మూడో తేదీన కీలకమైన పోలింగ్ జరుగుతుంది. ఐతే ముందస్తు ఓటింగ్ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ముందస్తు సర్వే అంచనాలలో అమిష్ షా, పియా దాండియాలు విజయం సాధిస్తారని బలంగా అంచనాలు వెలువడుతున్నాయి. అమిష్ షా అరిజోనా ఫస్ట్ డిస్ట్రిక్ట్ నుండి హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్‌కు పోటీ చేస్తుండగా, పియా దాండియా ఫ్లోరిడా నుండి పోటీ చేస్తున్నారు. అమిష్ షా ఫిజీషియన్ కాగా, గతంలో కూడా ఆయన ప్రజాప్రతినిధిగా పనిచేశారు.ఇప్పటికే ఆయన మూడుసార్లు దిగువసభకు ఎన్నికయ్యారు.ఐతే 2024లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. రిపబ్లికన్ పార్టీ తరపున ఈ నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న షనల్ ఫుట్‌బాల్ కిక్కర్ జై ఫీలీతో అమిష్ షా పోటీ పడుతున్నారు.ఇక పియా దాండియా గతంలో హైస్కూలు ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. దక్షిణ ఫ్లోరిడా 22వ జిల్లా నుండి రిపబ్లికన్ అభ్యర్థి కాసే అస్కర్ పై ఆమె పోటీ పడుతున్నారు.షా,పియా దాండియాలు పోటీ చేస్తున్న రెండు నియోజకవర్గాలు డెమోక్రటిక్‌పార్టీకి అత్యంత కీలకమైనవి, ప్రతిష్ఠాత్మకమైనవి. వీరి విజయావకాశాలు చాలా మెరుగ్గా ఉన్నాయని ప్రముఖ రాజకీయ విశ్లేషణసంస్థ ''కుక్ పొలిటికల్ రిపోర్ట్'' పేర్కొంది.

## సెర్బియాలో ఉసిచ్ ఓటమి

### విద్యార్థుల ఘన విజయం



**బెల్గ్రేడ్:** సెంట్రల్ యూరప్‌లో భూపరివేష్ఠితదేశం సెర్బియాను సుదీర్ఘకాలంగా పరిపాలించిన అధ్యక్షుడు అలెగ్జాండర్ వుసిచ్(56) కొత్తగా స్థాపించిన విద్యార్థులపార్టీ చేతుల్లో ఓటమి చవిచూశారు. దేశంలో అవినీతి పేట్రేగిపోయిందంటూ విద్యార్థులు ఉద్యమం ప్రారంభించారు. ఈ ఉద్యమమే ఉసిచ్ ఓటమికి దారితీసింది. 96 శాతం పోలింగ్ కేంద్రాల్లో కౌంటింగ్ పూర్తయ్యే నాటికి విద్యార్థులకు 2.26 మిలియన్ ఓట్లు (52.65శాతం), అధికార సెర్బియన్ ప్రోగ్రెసివ్ పార్టీకి 1.67 మిలియన్ ఓట్లు(39.2శాతం)లభించాయి. రెండేళ్ళక్రితం విద్యార్థుల నాయకత్వంలో సమాజంలోని వివిధ వర్గాల మిత్రమంగా ఈ ఉద్యమం పురుడుపోసుకుని ఉసిచ్ ప్రభుత్వ పతనానికి కారణమైంది. ఆయన 2011 నుండి సెర్బియన్ ప్రోగ్రెసివ్‌పార్టీ నాయకుడుగా, దేశ ఉప ప్రధానమంత్రిగా, ప్రధాన మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. జాతీయ పార్లమెంటుకు ఆదివారం ఎన్నికలు జరిగాయి. దీంతో విద్యార్థులు దేశవ్యాప్తంగా సంబరాలు చేసుకుంటున్నారు. అలెగ్జాండర్ వుసిచ్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి ప్రోగ్రెసివ్ పార్టీ తరపున ప్రధానమంత్రి అభ్యర్థిగా పోటీచేసి ఓటమిపాలయ్యారు. విద్యార్థుల తరపున నాయకుడు ఇలియాస్ట్రా నోవిచ్ ఈ ఎన్నికల్లో ఘన విజయం సాధించారు.''ఈ ఎన్నికల్లో మేం ఓడిపోయామని చాలా స్పష్టంగా తెలుస్తోంది'' అని మితవాద పాపులిస్ట్‌పార్టీ నాయకుడు ఉసిచ్ ఆదివారం రాత్రి ఓటమిని అంగీకరించారు. ప్రాథమిక గణాంకాల ప్రకారం విద్యార్థులకు 22 లక్షల ఓట్లు, ప్రోగ్రెసివ్ పార్టీకి 17.2 లక్షల ఓట్లు వచ్చాయి. గతంలో ఎన్నడూలేనివిధంగా ఈసారి ఎన్నికల్లో 69.34 శాతం మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. విద్యార్థుల పార్టీ 52.9 శాతం పూర్తిస్థాయి మెజార్టీతో విజయం దిశగా దూసుకువెళుతోంది.

జాతీయ పార్లమెంటులో మొత్తం 250 స్థానాలు ఉండగా, ఏ రాజకీయ పార్టీ అయినా అధికారం చేపట్టాలంటే 126 మెజార్టీ స్థానాలు సంపాదించాలి. నిర్ణీత ప్రకారం 2027 డిసెంబరులో జాతీయ అసెంబ్లీకి ఎన్నికలు జరగాల్సి ఉండగా, దేశాధ్యక్షుడు అలెగ్జాండర్ ఉసిక్ జాతీయ పార్లమెంటును రద్దుచేశారు.2023లో సెర్బియా ప్రోగ్రెసివ్ పార్టీ(ఎస్ఎన్ఎస్) తిరిగి అధికారం చేపట్టింది. 2024 నవంబరులో నోవీసాద్ రైల్వే స్టేషన్ కుప్పకూలిపోయిన ఘటనలో 16 మంది మరణించిన తర్వాత,ప్రభుత్వ అవినీతికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఒత్తిడిని భరించలేక ప్రధానమంత్రి మిలోస్ ఉసివిచ్ 2025 జనవరిలో రాజీనామా చేశారు. ఆ తర్వాత డ్యూరో మాకట్ బాధ్యతలు చేపట్టారు. ఆ తర్వాత ఎన్నికల చట్టాలకు జాతీయ అసెంబ్లీ అనేక మార్పులు చేసింది. చివరకు ఆయనతో పాటు ఉసిక్ కూడా రాజీనామా చేశారు. జాతీయ పార్లమెంటును రద్దుచేశారు. తాత్కాలిక అధ్యక్షురాలుగా బ్రనాబిచ్ వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు ఇలియాస్ట్రా నోవిచ్ నాయకత్వాన విద్యార్థులు కూడా ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.

## చైనా కమ్యూనిస్టుపార్టీ ఐదవ ప్లీనరీ ప్రారంభం

**బీజింగ్:** చైనా కమ్యూనిస్టుపార్టీ (సిపిసి) 20వ కేంద్ర కమిటీ తన ఐదవ ప్లీనరీ సమావేశాలను సోమవారం ఉదయం బీజింగ్‌లో ప్రారంభించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కేంద్ర కమిటీ పొలిటికల్ బ్యూరో తరపున ఒక కార్యనిర్వహణా నివేదికను సమావేశానికి సమర్పించారు. పార్టీ స్వయంపరిపాలనను బలోపేతం చేయడంపై కొన్ని ప్రధానాంశాలకు సంబంధించి పార్టీ కేంద్ర కమిటీ ముసాయిదాను సమావేశం ముందుంచారు. పార్టీ నిర్మాణం, కర్తవ్యాలపై ఈ ముసాయిదా లోతైన విశ్లేషణ చేసింది.శతాబ్దాలనాటి పార్టీలో స్వీయ సంస్కరణల ద్వారా నూతన మార్గాలు తెరచుకున్నాయని, దేశ ప్రయోజనాలకోసం చారిత్రక విజయాలు సాధించామని ముసాయిదా పేర్కొంది. రాజకీయ వాతావరణాన్ని పటిష్టం చేయడానికి ఉన్నత ప్రమాణాలు అవలంబించాలని ప్రతిపాదించింది. ప్రపంచంలో మార్పుల దృష్ట్యా కొత్త సవాళ్ళు ఎదురవుతున్నాయని పేర్కొంది.

## హౌతీల క్షిపణి కేంద్రాలు ధ్వంసం

**దుబాయ్:** యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారుల క్షిపణి కేంద్రాలను ధ్వంసం చేసినట్లు సౌదీ అరేబియా కూటమి సైన్యాల ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్–మల్కీ ప్రకటించారు. ఐతే రియాద్ విమానాశ్రయాలు, నౌకాస్థావరాలు, వైమానిక స్థావరాలపై దాడులు చేసినట్లు హౌతీ తిరుగుబాటుదారులుకూడా ఒక ప్రకటన చేశారు. అదే సమయంలో గడచిన 24 గంటల్లో సౌదీ కూటమి సైన్యాలు 56 సార్లు యెమెన్‌పై దాడులు చేసినట్లు కూడా హౌతీలు ప్రకటించారు.మరోవైపు అమెరికాకు చెందిన అత్యవసర విభాగానికి చెందని సిబ్బంది, వారి కుటుంబాలను సౌదీ అరేబియా విడిచి రావాల్సిందిగా ట్రంప్ ప్రభుత్వం ఆదేశించింది. కాగా యెమెన్‌లోని సొరంగాలను క్షిపణులు, లాంఛర్లు ఉపయోగించి ధ్వంసం చేసినట్లు సౌదీ సైనిక కూటమి తెలియజేసింది. ఐదు సొరంగాలను ధ్వంసం చేశామని తెలియజేసింది. ఈ ఆపరేషన్ కొనసాగుతుందని అల్–మల్కీ చెప్పారు.

## వెనిజులాకు తిరిగొచ్చిన మచాడో



**కారకస్:** పది నెలల ప్రవాస జీవితం తర్వాత వెనిజులా ప్రతిపక్షనాయకురాలు మచాడో స్వదేశానికి తిరిగి వచ్చారు. గతంలో ఆమె దేశంలోకి వచ్చేందుకు పదే పదే విఫలయత్నం చేశారు. గత ఏడాది నార్వే నోబెల్ కమిటీ ఆమెకు శాంతి బహుమతి ప్రకటించింది. ఈ బహుమతి తీసుకోవడానికే ఆమె దేశం వదిలివెళ్ళారు. ఆ తర్వాత ట్రంప్ సైన్యం దాడిచేసి దేశాధ్యక్షుడు నికొలస్ మదురో దంపతులను అరెస్టుచేసింది.''నేను మీతో ఉన్నాను, మీ మధ్యకు వచ్చాను'' అని సోమవారం మచాడో ఒక పోస్టింగ్ పెట్టారు. వెనిజులా లారా రాష్ట్రంలోని ఒక చర్చిలో జరిగిన ప్రార్థనా కార్యక్రమంలో ఆదివారంనాడు మచాడో పాల్గొన్నారు. ఆ తర్వాత మద్దతుదారుల కేరింతలమధ్య రాజధాని కారకస్‌కు బయలుదేరి వెళ్ళారు.తాను దేశంలోకి ప్రవేశించేందుకు ఏడుసార్లు పరయత్నం చేశానని ,విఫలమయ్యాయని గడచిన సెప్టెంబరులో ఆమె ఒక పోస్టింగ్ పెట్టారు.

## నెతన్యాహూ భవితవ్యం తేలేది నేడే



**జెరూసలెం:** ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ((77)రాజకీయ భవిష్యత్తును తేల్చిచెప్పే కీలకమైన పార్లమెంటు (క్నెసెట్)ఎన్నికల పోలింగ్ మంగళవారం జరుగుతుంది. ఆయన తిరిగి ప్రధానమంత్రి పదవి చేపడతారా? ఓడిపోయి ప్రపంచ రాజకీయ చిత్రపటం నుండి దూరమవుతారా? అనే విషయం తేల్చి చెప్పేందుకు ఓటర్లు సిద్ధమయ్యారు. ఐతే ఇజ్రాయెల్‌లో ఓటర్ల మానసిక స్థితి నెతన్యాహూకు అనుకూలంగా లేదని, ఈసారి ఎవ్వరికీ సరైన మెజార్టీ వచ్చే అవకాశం లేదని సర్వేలు చెబుతున్నాయి. నెతన్యాహూ లికుద్‌పార్టీ గతం కంటే బాగా వెనుకబడి ఉంది. మాజీమంత్రి, ఇజ్రాయెల్ రక్షణరంగంలో ఆరితేరిన అనుభవం పొందిన గాడి ఐసెన్‌కోట్ (66)కీలక అభ్యర్థిగా తెరమీదకు వచ్చారు. 'బియాచాద్' కూటమికి మాజీ ప్రధానమంత్రి నఫ్తాలీ బెన్నెట్ నాయకత్వం వహిస్తున్నారు. ఈ కూటమిలో మాజీ ప్రధానమంత్రి యైర్ లాపిడ్‌కు చెందిన యెట్ అటిడ్ పార్టీ కూడా భాగస్వామిగా ఉంది.యైర్ గోలన్ నాయకత్వానగల వామపక్ష డెమోక్రాట్స్, అవిగ్డోర్ నాయకత్వానగల ఇజ్రాయెల్ బీటెను, అరబ్‌పార్టీలైన రామ్, జాయింట్ లిస్ట్ వంటి ఇతర ప్రతిపక్షాలు నెతన్యాహూను గట్టిగా సవాలు చేస్తున్నాయి. ఇటామర్ బెన్–గ్విర్, బెజాలెల్ స్మోట్రిచ్ నాయకత్వానగల పచ్చిమితవాదపార్టీలు నెతన్యాహూ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి.

ఏ పార్టీ లేదా కూటమి విజయం సాధించాలన్నా 61 స్థానాలు గెలుచుకోవాలి.ఇజ్రాయెల్ పార్లమెంటులో మొత్తం 120 స్థానాలు ఉన్నాయి. ఇజ్రాయెల్ ఎన్నికల్లో తాను జోక్యం చేసుకోబోనని ప్రకటించిన డోనాల్డ్‌ట్రంప్ చివరి వారంలో బాహాటంగా నెతన్యాహూను ''తనవాడు'' అని ప్రకటించారు. ఆయనను గెలిపించాలని ఓటర్లను కోరడం ద్వారా అమెరికా సంప్రదాయాలను ఉల్లంఘించారు.ఇజ్రాయెల్‌కు సుదీర్ఘ కాలం 19 సంవత్సరాలపాటు ప్రధానమంత్రిగా పనిచేసిన ఘనత నెతన్యాహూదే.1996,1999, 2009 సంవత్సరాలలో ఆయన ప్రధానమంత్రి పదవి చేపట్టి,చివరి విడతలో 2022 నుండి మళ్ళీ అధికారంలో కొనసాగుతున్నారు.ఇక ఐసెన్‌కోట్ 2015 నుండి 2019 వరకూ ఇజ్రాయెల్ రక్షణ బలగాల ప్రధానాధిపతిగా పనిచేశారు. 2025లో యషార్ అనే రాజపార్టీని స్థాపించి అనతికాలంలోనే పాపులారిటీ సంపాదించారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై సామూహిక దాడి చేయడంతో గాజాలో యుద్ధం ప్రారంభమైంది. ఈ యుద్ధంవల్ల గాజాలో 74000 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 1,75,000 మంది గాయపడ్డారు. ఈ యుద్ధ పరిణామాలు, తదనంతరం నెతన్యాహూ అనుసరించిన విదేశాంగ విధానంపై దేశంలో తీవ్రమైన చర్చ కొనసాగుతున్న తరుణంలో జరుగుతున్న ఎన్నికల్లో మరోసారి ఆయన అధికారం చేపట్టాలని ఉత్సాహంతో ఉన్నారు.

దేశంలో 73 లక్షలమంది అర్హులైన ఓటర్లు ఉన్నారు.దాదాపు 67,000 మందిపైగా ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొనేందుకు విదేశాల నుండి స్వదేశం చేరుకున్నారని అంచనా.

## కెన్యాలో ఘోర ప్రమాదం

### 24 మంది మృతి



**మాకుయెని:** కెన్యా తూర్పు ఆఫ్రికాదేశం కెన్యాలో ప్రధాన రహదారిపై ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 24 మంది ప్రయాణికులు మరణించారు. ఒక బస్సును లారీ ఢీ కొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. రాజధాని నైరోబీని తీరప్రాంత నగరం మొసాంబాను అనుసంధానం చేసే ఇదే రహదారిపై ఇదే ప్రదేశంలో మూడు వారాల క్రితం కూడా ఘోర ప్రమాదం సంభవించింది. ఆనాటి ప్రమాదంలో 17 మంది మరణించారు. ఆదివారం ఉదయం సరిగ్గా ఇదే ప్రదేశంలో జరిగిన ప్రమాదంలో 24 మంది మరణించగా, మరో 24 మంది గాయపడ్డారు. వారికి చికిత్స చేస్తున్నారు. పశ్చిమ కెన్యాలోని తమ చర్చి ఫాదర్ అంత్యక్రియలకు హాజరై తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగిందని గాయపడినవారు చెప్పారు. ఎంతమాత్రం క్షమించరానిరీతిలో బహుశా ఓవర్ చర్యకు పాల్పడిన సమయంలో బస్సు ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు అంచనావేశారు.

## మండలాలు ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితులపై నివేదిక కూనంనేని సాంబశివరావు సమర్పించారు. ఈ నివేదికపై జరిగిన చర్చలో పలువురు రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారు. తొలుత పల్లా వెంకట రెడ్డి మాట్లాడుతూ ఎస్ఐఆర్‌కు ప్రక్రియను నిలిపివేయాలని, సిఇ సి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27న ఢిల్లీలో నిర్వహించనున్న మానవహారంలో రాష్ట్రం నుంచి సిపిఐ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని దిశా నిర్ధేశం చేశారు. కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో నెలకొన్న కరువు నేపథ్యంలో రైతులు, ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే చర్యలు చేపట్టే విధంగా ఎక్కడికక్కడ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కాగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్రం లో సాధారణ వర్షపాతం 812.5 మిల్లీమీటర్లకు గాను 618.7 మిల్లీమీటర్లు మాత్రమే నమోదు కావడంతో 20 లక్షల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతిన్నాయని తీర్మానంలో పేర్కొంది. పత్తి దిగుబడులు గణనీయంగా తగ్గాయని, వరి సాగు విస్తీర్ణం గత ఏడాదితో పోలిస్తే 12.15 లక్షల ఎకరాలు తగ్గిందని తెలిపింది. జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గడం, భూగర్భ జలాలు అడుగంట డం, విద్యుత్ సమస్యలతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో తక్షణమే అఖిలపక్ష, రైతు సంఘాల సమావేశం నిర్వహించి కరువు మండలాలను ప్రకటించాలని, పంట నష్టంపై సమగ్ర నివేదిక రూపొందించి కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని సిపిఐ డిమాండ్ చేసింది. వరి పంటకు ఎకరాకు రూ.30 వేలు, పత్తి, మిర్చికి రూ.50 వేలు, ఇతర పం టలకు రూ.20 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని కోరింది. పంటలకు సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందించాలని, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై శ్వేతపత్రం విడుదల చేయాలని పేర్కొంది. తాగునీటి కోసం గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు కేటాయించడం, రబీ సాగు సాధ్యం కాని రైతులను ఆదుకోవడం, కౌలు రైతులకు పరిహారం, వ్యవసాయ కార్మికులకు అదనపు పని దినాలు కల్పించడం, పశుగ్రాసం సరఫరా చేయడం, చౌక దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం, ఉపాధి కోల్పోయిన అసంఘటిత కార్మికులకు ప్రత్యేక ఉపాధి పథకం అమలు చేయాలని తీర్మానంలో డిమాండ్ చేసింది.

## వారధి రాష్ట్రాలకు

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఉందన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు రెండు రాష్ట్రాలు కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కోరారు. దేశ రక్షణ, జాతీయ వ్యూహాత్మక ప్రయోజనాల పరంగా ఆదిలాబాద్ ప్రాంతానికి ఉన్న ప్రాధాన్యతను రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ప్రస్తావించారు. తెలంగాణ మహారాష్ట్ర మధ్య ఉన్న చారిత్రక, సాంస్కృతిక సంబంధాలను గుర్తు చేశారు. పూర్వ హైదరాబాద్ సంస్థానంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాలకు ఉన్న చారిత్రక అనుబంధాన్ని ప్రస్తావించారు. ఆదిలాబాద్‌లో ప్రతిపాదిత రక్షణ, పౌర విమానాశ్రయ సదుపాయం అందుబాటులోకి వస్తే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఊతమిస్తుందని తెలిపారు. మహారాష్ట్రలోని సరిహద్దు ప్రాంతాలకూ ప్రయోజనం కలుగుతుందని వివరించారు. విమానాశ్రయంతో రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో రవాణా సదుపాయాలతో పాటు ఆర్థిక కార్యకలాపాలు, అభివృద్ధి అవకాశాలు మెరుగుపడుతాయన్నారు.

## చారిత్రక గెలుపు

(మొదటి పేజీ తరువాయి)

ఈ సంప్రదాయాన్ని బద్దలుకొట్టి రన్నాఫ్ పోలింగ్‌లో ఘన విజయం సాధించారు. ఆదివారం పోలింగ్ సందర్భంగా బస్సులు పలు నగరాల్లో నిలిచిపోయాయి.దీంతో పౌరులు ఓట్లు వేయలేకపోయారు. లులా జోక్యం చేసుకుని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు అదేశాలతో పోలింగ్ సమయాన్ని రెండు గంటలు పొడిగించారు. దీంతో పోలింగ్ శాతం పెరిగింది. ఈ చర్యను ప్రత్యర్థి ఫ్లావియా బోల్సెనారో వ్యతిరేకిస్తున్నారు. దీనిని నీచమైన కుట్రగా అభివర్ణిస్తున్నారు.

అవినీతి ఆరోపణలు, ఆర్థిక సమస్యలు ఎన్నికల ప్రచారంలో ప్రధానాంశాలుగా కుదిపేశాయి. ఫ్లావియా బోల్సెనారోకు మొదటి విడత అక్టోబరు నాలుగో తేదీన జరిగిన పోలింగ్‌లో 47 శాతం ఓట్లు లభించగా, లులా డసిల్వాకు 45 శాతం ఓట్లు లభించాయి.మొదటి విడతలో కొంత వెనుకబడినప్పటికీ,రెండో విడత పోటీలో తుది విజయం తనదేనని డసిల్వా ముందుగానే స్పష్టం చేశారు.ఆయన పూర్తిపేరు లూయిజ్ ఇనాసియో లులా డాసిల్వా.లులాగా ఆయన రాజకీయాలలో ప్రసిద్ధి చెందారు. ఆయన ఒకప్పుడు లోహ కార్మికుడుగా పనిచేశారు. వామపక్ష కార్మికసంఘ నాయకుడుగా ఎదిగారు.బ్రెజిల్ వర్కర్స్‌పార్టీలో పనిచేస్తూ 2003 నుండి 2011 వరకూ రెండు విడతలు వరుసగా దేశాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించారు. రెండో తరగతి వరకూ చదువుకుని ఆ తర్వాత సంపాదనకోసం పనిలో చేరారు. పదేళ్ళ వయసు వచ్చే వరకూ ఆయన మళ్ళీ చదువుకోలేదు. కౌమార దశలో లోహకార్మికుడుగా పనిచేశారు. 1978–80 సంవత్సరాలలో బ్రెజిల్ సైనిక నియంతృత్వకాలంలో ఎబిసి కార్మిక సమ్మెలకు ఆయన నాయకత్వం వహించారు. వర్కర్స్ పార్టీ ఆవిర్భావానికి కృషి చేశారు. పాలస్తీనాపై ఇజ్రాయెల్ హింసాత్మక,జాతినిర్మూలన వైఖరిని లులా డసిల్వా నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తున్నారు.

కాగా, ఈ ఎన్నికల ఫలితాలను గుర్తించేందుకు డోనాల్డ్ ట్రంప్ మద్దతు ఉన్న ఫ్లావియా బోల్సెనారో తిరస్కరించారు.ఈ ఫలితాలను గుర్తించడం అసాధ్యమని,ఎన్నికలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తానని,న్యాయస్థానంలో సవాలు చేస్తానని ఆయన ప్రకటించారు.లులా డసిల్వాపై 11 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు.ఫ్లావియా తండ్రి జైర్ బోల్సెనారో2022లో లులా చేతిలో ఓడిపోయారు.ఆ తర్వాత తిరుగుబాటుకు ప్రయత్నం చేసి ప్రస్తుతం 27 ఏళ్ళు జైలుశిక్ష అనుభవిస్తున్నారు.

**లాంగ్ లివ్ డెమోక్రసీ**

లులా విజయంపట్ల ప్రాంతీయ దేశాల నాయకుల నుండి అభినందనలు వెల్లువెత్తాయి. లాంగ్ లివ్ డెమోక్రసీ అని వారు నినదించారు. బ్రెజిల్ పత్రికలు లులా విజయాన్ని చరిత్రాత్మకమైనదిగా అభివర్ణించాయి. పరాగ్వే అధ్యక్షులు శాంటియాగో పెనా ఒక పోస్టింగ్ పెడుతూ, బ్రహ్మాండమైన ప్రజాస్వామ్య ప్రయాణం చేసిన బ్రెజిల్ ప్రజలకు ఇదే నా వందనాలు'' అని పేర్కొన్నారు. మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ,లాంగ్ లివ్ డెమోక్రసీ అని ప్రశంసించారు. బొలీవియా అధ్యక్షుడు రోడ్రిగో పాజ్ స్పందిస్తూ, బొలీవియా, బ్రెజిల్ రెండూ ఇరుగుపొరుగు సోదర దేశాలని, ఈ రెండు దేశాలకు ఉమ్మడి సంస్కృతి,సంప్రదాయాల చరిత్ర ఉందని పేర్కొన్నారు. అదేవిధంగా ఉమ్మడి సవాళ్ళుకూడా ఉన్న ందువల్ల కలిసి పనిచేయడం కొనసాగిస్తామని, అవకాశాలు అం దిపుచ్చుకుంటామని పేర్కొన్నారు. క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ దయాజ్ కానెల్ ఒక ప్రకటనలో లులా విజయాన్ని చరిత్రాత్మకమైనదిగా పేర్కొన్నారు. శాంతి, సార్వభౌమాధికారం, సామాజిక న్యాయసాధనలో మీ నాయకత్వాన బ్రెజిల్ ప్రజలకు పూర్తి భద్రత, భరోసా కొనసాగాలని ఆకాంక్షించారు. ఉరుగ్వే అధ్యక్షుడు యమండు ఒర్సి స్పందిస్తూ, లులా డసిల్వాను మిత్రుడుగా అభివర్ణించారు. దీనిని ప్రజాస్వామ్య ఘన విజయంగా పేర్కొన్నారు. పనామా దేశాధ్యక్షుడు జోస్ రౌల్ ములినో ఒక ప్రకటనలో,ఈ ప్రజాస్వామ్య దినోత్సవరోజున బ్రెజిల్ ప్రజలను అభినందిస్తున్నానని, ముఖ్యంగా లులాను అభినందిస్తున్నానన్నారు.

**నరేంద్రమోదీ అభినందన**

బ్రెజిల్‌లో నాలుగోసారి దేశాధ్యక్షుడుగా ఘన విజయం సాధించిన లులా డసిల్వాకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. ఎన్నికల్లో మరోసారి అద్భుతమైన విజయం సాధించారని కొనియాడారు.భారత్–బ్రెజిల్ మధ్య ఉన్న బహుముఖ,వ్యూహాత్మక బంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు,విస్తరించడానికి, కలిసి పనిచేసేందుకు తాము ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు.''నా ప్రియ మిత్రుడు, తిరిగి ఎన్నికై అద్భుత విజయం సాధించిన అధ్యక్షుడు లులా డసిల్వాకు నా హృదయపూర్వక అభినందనలు, భారత్–బ్రెజిల్ కలిసి వివిధ రంగాలలో సహకారాన్ని బలోపేతం చేస్తూనే ఉంటాయి,గ్లోబల్ సౌత్ ఉమ్మడి ప్రాధాన్యతలను ముందుకు తీసుకువెళతాయి, మరింత సమ్మిళిత, సుస్థిర, సమానస్థాయి ప్రపంచంకోసం కృషి చేస్తాయి'' అని ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు.

## తిరస్కరణ

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న సమయంలో బ్రెజిల్ ప్రజలు దానిని ఎన్నికల తీర్పు ద్వారా చేతల్లో చూపించారు'' అని డి.రాజా ప్రశంసించారు.

''చరిత్రాత్మకమైన విజయం సాధించిన బ్రెజిల్ ప్రజలకు, లులా డసిల్వాకు అభినందనలు తెలియజేస్తున్నాం,పచ్చి మితవాదులను బ్రెజిల్ ప్రజలు ఓడించారు, బ్రెజిల్‌ను తన పాదాక్రాంతం చేసుకోవాలని,కార్పొరేట్ శక్తులకు, తనకు అనుకూలంగా ఉండే పెట్టుబడిదారీ తైనాతీలకు బ్రెజిల్ తలుపులు బార్లా తెరవాలని ట్రంప్ చేసిన దుష్టపన్నాగాలను ఆ దేశ ప్రజలు తిరస్కరించారు, ఈ భూగోళంమీద సతత హరితారణ్యాలకు,నిత్యహరిత, వర్షపాతాలకు శ్వాసకోశాల్లా పనిచేసే అమెజాన్ ప్రాంతం మళ్ళీ హాయిగా ఊపిరి పీల్చుకోవడానికి వీలు కలిగింది, ఈ విజయం ఎంతో శక్తిమంతమైనది, ధనం, కార్పొరేట్‌శక్తుల ప్రయోజనాల లేదా విదేశీ ఒత్తిడి ద్వారా ప్రజలను అణచివేయలేరని ఈ శక్తిమంతమైన విజయం గుర్తుచేసింది, బ్రెజిల్ వర్ధిల్లాలి, లులా వర్ధిల్లాలి'' అని డి.రాజా తన ప్రకటనలో న్నారు.

**లులా విజయం భారత యువతకు స్ఫూర్తి:** బ్రెజిల్ దేశాధ్యక్షుడు,వామపక్ష,కార్మికసంఘ నాయకుడు లూయిజ్ ఇనాసియో లులా డసిల్వా ఎన్నికల్లో నాలుగోసారి ఘన విజయం సాధించడంపై భారతదేశంలోని వామపక్షాలు అభినందనలు తెలియజేశాయి. ప్రస్తుతం దేశ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఎన్నికల సంస్కరణలకోసం పోరాటం చేస్తున్న యువకులకు ఈ విజయం గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని వామపక్షాలు పేర్కొన్నాయి. అనేక దేశాల్లో మితవాద ప్రభుత్వాలు ఏర్పడటానికి భావజాల ఎగుమతి చేసే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను తీవ్రంగా విమర్శించే నాయకుడు లులా డసిల్వా ఆదివారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించారు. దీంతో లాటిన్ అమెరికాలో మితవాదాన్ని విస్తరిస్తున్న ట్రంప్ వ్యవహారశైలిపై ఆందోళన వ్యక్తం చేస్తున్న విమర్శకులకు ఉపశమనం లభించింది. నూటికి నూరుశాతం ఓట్ల లెక్కింపు పూర్తయ్యేనాటికి లులా డసిల్వా తన ప్రత్యర్థి, ట్రంప్ మద్దతుదారుడైన ఫ్లావియా బోల్సెనారోపై 44 లక్షల ఓట్ల ఆధిక్యం సంపాదించారు.సిపిఐ(ఎం) నాయకుడు ఎం.ఎ.బేబీ ఈ మేరకు సోమవారం ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెడుతూ, నాలుగోసారి లులాను ఎన్నుకున్న బ్రెజిల్ ప్రజలు చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చారని కొనియాడారు. ''వర్కర్స్ పార్టీకి గౌరవ వందనం చేస్తున్నాం, సిసిడోబీ ఇతర ప్రగతిశీల, ప్రజాస్వామ్యశక్తులు స్వచ్ఛందంగా పోరాటం చేసి ఈ విజయం సాధ్యపడేట్టు చేశాయి''అన పేర్కొన్నారు. భారత్‌లో కొనసాగుతున్న నిరసన ప్రదర్శనలను కూడా ప్రస్తావిస్తూ, ఎన్నికల సంఘం 13 కోట్లమంది ఓటర్ల పేర్లు జాబితాలో లేకుండా చేసిందని, దేశంలో యువతరం చేస్తున్న పోరాటానికి లులా విజయం,వారి స్వచ్ఛంధ పోరాటం గొప్ప స్ఫూర్తిని ఇస్తుందని పేర్కొన్నారు. ''మీ బ్రహ్మాండమైన ప్రచారం ద్వారా ప్రజలు ఐక్యంగా నిలబడినప్పుడు విద్వేషం, విభజనలను అవలీలగా జయించవచ్చునని రుజువు చేసింది'' అని బేబీ తన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ పార్టీ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య కూడా బ్రెజిల్ ప్రజలకు, లులా డసిల్వాకు అభినందనలు తెలియజేశారు. అమెరికా మద్దతు ఉన్న మితవాద ఫ్లావియా బోల్సెనారోను చిత్తుగా ఓడించారని పేర్కొన్నారు. ''అభినందనలు, లులా డసిల్వా మళ్ళీ దేశాధ్యక్షుడుగా గెలిచారు, ఎంతో గొప్ప విషయం,అమెరికా మద్దతుగల పచ్చి మితవాదాన్ని బ్రెజిల్ ఓడించి నిలబడింది'' అని ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. అదేవిధంగా సెర్బియా దేశంలో 14 సంవత్సరాలుగా ఏకఛత్రాధిపత్యపాలన చేసిన అలెగ్జాండర్ ఉసిచ్ కూడా విద్యార్థుల చేతుల్లో ఓటమిని అంగీకరించారని, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియ ద్వారా ఈ రెండు సంఘటనలూ ఒకేసారి సంభవించాయని కొనియాడారు.

## సానుకూలత

(మొదటి పేజీ తరువాయి)

నిలుస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, గిరిజనుల సంక్షేమానికి రెండు రాష్ట్రాల సహకారం అవసరమన్నారు. పరస్పర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి సహకరించాలని మహారాష్ట్ర ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇరువురు ముఖ్యమంత్రులు పునరుద్ఘాటించారు. ముఖ్యంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని వారు అభిప్రాయపడ్డారు. గిరిజనులు, ఆదివాసీలు, అభివృద్ధి అవకాశాలు అందని వర్గాల సామాజిక, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేయాల్సిన అవసరాన్ని ఇరువురు సిఎంలు నొక్కిచెప్పినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

**152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయం**

సమావేశం ప్రారంభంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రజెంటేషన్ ద్వారా తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు ప్రాధాన్యతను వివరించారు. 2016లో తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును 148 మీటర్లుగా నిర్ణయిస్తూ ఒప్పందం కుదిరిందని, అయితే, ఈ ఎత్తుతో బ్యారేజీ నిర్మిస్తే తెలంగాణ ప్రాంత తాగు, సాగునీటి అవసరాలు పూర్తిస్థాయిలో తీరవని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ప్రస్తుత విద్యుత్ అవసరాలు, ఇంధన వ్యయం, పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు నిర్వహణ వ్యయం కూడా ముఖ్యమైన అంశమన్నారు. ఈ కారణంగానే గ్రావిటీ ద్వారా నీటిని తరలించే అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ పరిస్థితుల్లో తుమ్మిడిహెట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎత్తుతో నిర్మించడమే అత్యంత ప్రయోజనకరమైన ప్రత్యామ్నాయమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. సాంకేతిక, నిర్వహణ, ఆర్థిక అంశాల పరంగా ఈ ప్రతిపాదనకు ఉన్న ప్రాధాన్యాన్ని మంత్రి తన ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. బ్యారేజీ నిర్మాణంతో మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే వ్యవసాయ భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. మహారాష్ట్రలో అమల్లో ఉన్న భూసేకరణ నిబంధనలు, ఆ రాష్ట్ర పరిహార విధానం ప్రకారం రైతులకు పరిహారం చెల్లిస్తామని తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, సంస్కృతి, గిరిజనుల జీవన పరిస్థితులు, ఆర్థిక వెనుకబాటుతనాన్ని మహారాష్ట్ర ప్రతినిధి బృందం దృష్టికి తీసుకెళ్లారు. సుసంపన్నమైన చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉన్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిపోయిందని తెలిపారు. గిరిజనులు, ఆదివాసీలకు అభివృద్ధి ఫలాలు అందలేదన్నారు. ఆర్థిక అవకాశాలు లేకపోవడం, వెనుకబాటుతనం కారణంగా గతంలో నక్సలిజం వంటి సమస్యలు తలెత్తిన పరిస్థితులను వివరించారు. ఆ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు 1975 అక్టోబర్ 6న అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, ఎస్.బి.చవాన్ మధ్య కుదిరిన ఒప్పందం నుంచి వివిధ దశల్లో జరుగుతున్న ప్రయత్నాలను తెలిపారు. గత 5 దశాబ్దాలుగా అనేక ప్రతిపాదనలు, చర్చలు జరిగాయని గుర్తు చేశారు. అయినప్పటికీ ఆశించిన పురోగతి సాధించలేకపోయామన్నారు.

## వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తుదినిర్ణయం: మహారాష్ట్ర సిఎం

తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తును పెంచాలనే తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సానుకూలంగా స్పందించారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుపై తెలంగాణ ప్రతిపాదన పట్ల గతంలోనూ మహారాష్ట్ర సానుకూల వైఖరి అనుసరించిందని ఫడ్నవీస్ గుర్తు చేశారు. ప్రస్తుతం బ్యారేజీ ఎత్తు పెంపుపై తెలంగాణ చేసిన అభ్యర్థనను పరిశీలించేందుకు స్వతంత్రంగా అధ్యయనం చేపట్టాలని మహారాష్ట్ర నిర్ణయించినట్లు సిఎం తెలిపారు. బ్యారేజీ నిర్మాణ స్థలం, వివిధ ఎత్తుల వద్ద ముంపు ప్రభావం, అవసరమైన భూమి విస్తీర్ణాన్ని ఈ అధ్యయనంలో పరిశీలించనున్నామని తెలిపారు. మహారాష్ట్ర అధ్యయనంలో వెల్లడయ్యే అంశాలు, అంచనాలపై తెలంగాణకు అభ్యంతరాలు ఉంటే రెండు రాష్ట్రాల అధికారులు చర్చించి పరిశీలిస్తారని ఫడ్నవీస్ తెలిపారు. అవసరమైతే నిపుణుల అభిప్రాయాలను కూడా తీసుకుంటామన్నారు. వాస్తవాలు, సాంకేతిక అంశాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. మరోవైపు తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు విషయంలో కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) తన పరిధిలో అవసరమైన అధ్యయనాలు చేపడుతున్నదని, సాంకేతిక పరిశీలనలు కొనసాగిస్తుందన్నారు. ఈలోగా రెండు రాష్ట్రాల నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శుల నేతృత్వంలో అధికారుల కమిటీ ఏర్పాటు చేయాలని ఫడ్నవీస్ ప్రతిపాదించారు. బ్యారేజీ ఎత్తు, నీటి లభ్యతపై కమిటీ సమగ్రంగా అధ్యయనం చేయాలని సూచించారు. మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే భూములు, ప్రభావిత ప్రాంతాలను పరిశీలించాలన్నారు. పరిహారం, ఇతర సాంకేతిక అంశాలను కూడా అధ్యయనం చేయాలని చెప్పారు. ముంపు ప్రభావం, ప్రభావిత భూముల విస్తీర్ణంపై రెండు రాష్ట్రాల అంచనాలను పరిశీలించాలని సూచించారు. ఇరు రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అవసరమైతే ప్రత్యామ్నాయాలను కూడా అధ్యయనం చేయాలన్నారు. రెండు రాష్ట్రాల అధికారులు, సాంకేతిక నిపుణులు సంప్రదింపులు జరపాలని ఆయన సూచించారు. తదుపరి సమావేశాల నిర్వహణ, కాలపరిమితులను నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుపై ముందుకు వెళ్లేందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలన్నారు.

తెలంగాణతో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఈ సందర్భంగా సిఎం ఫడ్నవీస్ గుర్తు చేశారు. సరిహద్దులోని ఆదిలాబాద్ ప్రాంతంతో ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తన అమ్మమ్మ తెలుగు మాట్లాడతారని ఈ సందర్భంగా ప్రస్తావించారు. స్నేహభావం, సోదరభావంతో మంచి పొరుగు రాష్ట్రాలుగా ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. గతంలో ఇతర రాష్ట్రాలతో మహారాష్ట్ర పలు అంతర్రాష్ట్ర సమస్యలను పరిష్కరించుకుందని గుర్తు చేశారు. పరస్పర చర్చలు, సహకారంతో ఆయా సమస్యలకు పరిష్కారం కనుగొన్నామని వివరించారు.

# న్యూజిలాండ్ సిరీస్‌పై భారత్ గురి!



ఐదు మ్యాచ్‌ల టి–20 సిరీస్‌లో భారత్ ఇప్పటికే 2–0తో ఆధిక్యంలో ఉంది. వెల్లింగ్టన్‌లో జరిగే మూడో టి–20లో గెలిస్తే మరో రెండు మ్యాచ్‌లు మిగిలుండగానే సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. ఇషాన్ కిషన్ అందుబాటులో లేకపోయినా, మిగతా ఆటగాళ్లతో విజయాన్ని అందుకోవాలని టీమిండియా పట్టుదలగా ఉంది. మరి మూడో టి–20లోనూ భారత జట్టు ఆధిపత్యం కొనసాగిస్తుందా? సిరీస్‌ను ముందుగానే సొంతం చేసుకుంటుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. న్యూజిలాండ్ పర్యటనలో వరుస విజయాలతో జోరు మీదున్న టీమిండియా మరో ఆసక్తికర పోరుకు సిద్ధమైంది. వెల్లింగ్టన్ వేదికగా మంగళవారం జరగనున్న మూడో టి–20లో ఆతిథ్య న్యూజిలాండ్‌తో శ్రేయస్ అయ్యర్ సారథ్యం అమీతుమీ తేల్చుకోనుంది. తొలి రెండు టి–20ల తరహాలోనే ఈ మ్యాచ్ కూడా గెలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 3–0తో సిరీస్ కైవసం చేసుకోవాలని అయ్యర్ సేన భావిస్తోంది.

మరోవైపు సొంతగడ్డపై ఈ మ్యాచ్ గెలిచి సిరీస్ రేసులో నిలవాలని కివిస్ ఆశిస్తోంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. శనివారం జరిగిన రెండో టి–20 అభిమానులకు కావాల్సిన మజాను అందించింది. ఆఖరి ఓవర్ వరకు సాగిన ఈ మ్యాచ్‌ను భారత్ చిరస్మరణీయమైన విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. మూడో టి–20లో కూడా అదే తరహా ఫలితం రిపీట్ అయ్యే అవకాశం ఉంది.

**ఇషాన్ ఔట్.. ఓపెనర్గా వైభవ్...** గజ్జ గాయంతో రెండో టి–20 ఆడని ఇషాన్ కిషన్.. మూడో టి–20కి కూడా దూరమయ్యాడు. గాయం నుంచి కోలుకున్నా మ్యాచ్ ఫిట్నెస్ సాధించలేదని బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ తెలిపాడు. దాంతో వైభవ్ సూర్యవంశీ బరిలోకి దిగడం ఖాయమైంది. అయితే రెండో టి–20లో ఫస్ట్ డౌన్లో ఆడిన వైభవ్ సూర్యవంశీ తీవ్రంగా నిరాశపర్చాడు. తన కెరీర్లోనే ఎప్పుడూ ఓపెనింగ్ స్లాట్ తప్పా మరో స్థానంలో ఆడని వైభవ్.. మూడో స్థానంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డాడు. దాంతోనే వైభవ్‌ను తిరిగి ఓపెనింగ్ స్లాట్‌లో ఆడించాలని టీమిండియా మేనేజ్మెంట్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. తద్వారా రెండో టి–20లో చేసిన తప్పిదాన్ని సరిదిద్దుకోవాలని గంభీర్ భావిస్తున్నాడు. వైభవ్ ఓపెనర్‌గా బరిలోకి దిగితే సంజూ, అభిషేక్‌లలో ఒకరు ఫస్ట్ డౌన్‌లో ఆడనున్నారు.

**కుల్దీప్, వరుణ్‌కు నో ఛాన్స్..**

మిగతా కాంబినేషన్లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. శ్రేయస్ అయ్యర్, తిలక్ వర్మ, అక్షర్ పటేల్, నమన్ ధీర్, నితీష్ కుమార్ రెడ్డి మిడిలార్డర్లో ఆడనుండగా.. ప్రిన్స్ యాదవ్, అర్ష్‌దీప్ సింగ్, భువనేశ్వర్ కుమార్ పేస్ బాధ్యతలు పంచుకోనున్నారు. వెల్లింగ్టన్ పిచ్ పేస్కు అనుకూలంగా ఉండనున్న నేపథ్యంలో టీమిండియా ఒకే ఒక స్పిన్నర్తో ఆడనుంది. అక్షర్ పటేల్కు తోడుగా నమన్ ధీర్ కొన్ని ఓవర్లు వేయనున్నాడు. ఈ క్రమంలోనే స్పెషలిస్ట్ స్పిన్నర్లు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి మరోసారి బెంచ్‌కె పరిమితం కానున్నారు.

# 48 ఏళ్ల చరిత్రకు తెర.. రికార్డు సృష్టించిన దీప్తి శర్మ



జింబాబ్వే మహిళల జట్టుతో వడోదరలోని బీసీఏ స్టేడియం వేదికగా జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో భారత స్టార్ ఆల్రౌండర్ దీప్తి శర్మ సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి స్టేడియం నలువైపులా ఫోర్ల వర్షం కురిపిస్తూ మెరుపు సెంచరీ బాదింది. 86 బంతుల్లో 15 ఫోర్లతో 106 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచిన దీప్తి శర్మ.. భారత మహిళల క్రికెట్ 48 ఏళ్ల వన్డే చరిత్రలోనే సరికొత్త రికార్డును నెలకొల్పింది.

**ఆరో స్థానంలో తొలి భారతీయ సెంచరీ...** భారత మహిళల క్రికెట్ జట్టు 1978లో కోలకతా వేదికగా ఇంగ్లాండ్ జట్టుతో తన తొలి అంతర్జాతీయ వన్డే మ్యాచ్ ఆడింది. అప్పటి నుంచి ఇప్పటివరకు గత 48ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఆరోస్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి సెంచరీ సాధించిన తొలి భారత బ్యాటర్‌గా దీప్తి శర్మ చరిత్రకెక్కింది. గతంలో 2025లో దక్షిణాఫ్రికాపై రిచా ఘోష్ సాధించిన 94 పరుగుల అత్యధిక స్కోరు రికార్డును తిరగరాస్తూ దీప్తి శర్మ ఈ ఘనతను తన పేరిట లిఖించుకుంది. కెప్టెన్ స్మృతి మంధాన(0), షఫాలీ వర్మ(8) త్వరగానే ఔటైనా.. ప్రతీకా రావల్(61) హాఫ్ సెంచరీతో ఆదుకుంది. ఆ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్(121 బంతుల్లో 126 పరుగులు)తో కలిసి దీప్తి శర్మ భారీ ఇన్నింగ్స్ ఆడింది. వీరిద్దరూ ఐదో వికెట్‌కు ఏకంగా 153 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మహిళల వన్డేల్లో భారత్ తరపున ఐదో వికెట్‌కు ఏకంగా 153 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. మహిళల వన్డేల్లో భారత్ తరపున ఐదో వికెట్‌కు ఇదే అత్యధిక పరుగుల భాగస్వామ్యం కావడం విశేషం. గతంలో 2022 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌పై స్నేహ్ రాణాపూజా వస్త్రాకర్ల జోడీ నెలకొల్పిన 122 పరుగుల రికార్డును వీరు అధిగమించారు.

**ఐదో వేగవంతమైన వన్డే సెంచరీ**

కేవలం 83 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకున్న దీప్తి శర్మ.. భారత మహిళల క్రికెట్లో అత్యంత వేగంగా వన్డే సెంచరీ చేసిన ఐదో బ్యాటర్‌గా నిలిచింది. ఈ జాబితాలో ఆస్ట్రేలియాపై 50 బంతుల్లోనే సెంచరీ బాదిన స్మృతి మంధాన అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఈ ఇద్దరి సెంచరీల ధాటికి భారత మహిళల జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 328 పరుగుల భారీ స్కోరు నమోదు చేసి జింబాబ్వే ముందు కొండంత లక్ష్యాన్ని ఉంచింది.

## యువతరంగం

# సివిల్స్‌కు ఏడాది సంసిద్ధత సరిపోతుందా?

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్ష (యుపిఎస్‌సి సిఎస్ఇ) దేశంలో అత్యంత పోటీతో కూడిన పరీక్షల్లో ఒకటి. ఐఎఎస్, ఐపిఎస్ వంటి ప్రతిష్ఠాత్మక సర్వీసుల్లో ప్రవేశించాలనుకునే అభ్యర్థులు విస్తృతమైన సిలబస్‌ను అధ్యయనం చేయడంతోపాటు విశ్లేషణాత్మక ఆలోచన, సమయపాలన, సమాధాన రచన వంటి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. ఈ నేపథ్యంలో 2027 లేదా 2028లో పరీక్ష రాయాలనుకునే అభ్యర్థులకు ముందుగానే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమవడం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

పరీక్షకు ఏడాది ముందు చదువు ప్రారంభించి మొత్తం సిలబస్‌ను పూర్తి చేయాలనే ప్రయత్నం చాలామందిలో ఒత్తిడిని పెంచుతోంది. చరిత్ర, భూగోళశాస్త్రం, భారతరాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, పర్యావరణం, నైతికవిలువలు, సమకాలీన అంశాలతోపాటు ఐచ్ఛిక సబ్జెక్టు, వ్యాసరచన, సిఎస్ఎటి వంటి విభాగాలపై పట్టు సాధించాలి. ఇంత విస్తృతమైన అంశాలను తక్కువ సమయంలో చదవడం వల్ల పునశ్చరణకు, మాక్ పరీక్షలకు, సమాధానాల సాధనకు తగిన సమయం మిగలకపోవచ్చు. అందుకే దీర్ఘకాలిక ప్రణాళికతో కూడిన సన్నద్ధత అవసరమనే అభిప్రాయం బలపడుతోంది.

యుపిఎస్‌సి పరీక్ష అంటే పుస్తకాలలోని విషయాలను కంఠస్థం చేసుకోవడం కాదు. ప్రిలిమ్స్‌లో ప్రశ్నలను అర్థం చేసుకుని, భావనలను అన్వయించి సరైన సమాధానాన్ని గుర్తించాలి. మెయిన్స్‌లో, పరిమిత సమయంలో స్పష్టమైన, విశ్లేషణాత్మకమైన సమాధానాలు రాయాలి. సమకాలీన అంశాలను రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ, సమాజం, పర్యావరణం వంటి విభాగాలతో అనుసంధానించి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు, పర్యావరణ సమస్యను అధ్యయనం చేసేటప్పుడు దాని శాస్త్రీయ కోణంతోపాటు ఆర్థిక ప్రభావాలు, ప్రభుత్వ విధానాలు, సామాజిక పరిణామాలను కూడా పరిశీలించాలి. వ్యాసరచన, నైతిక విలువల విభాగాల్లో సమతుల్యమైన అభిప్రాయాలను వ్యక్తం చేయడం, తగిన ఉదాహరణలను ఉపయోగించడం అవసరం. ఈ నైపుణ్యాలు ఒక్కసారిగా అలవడవు. నిరంతర అధ్యయనం, సాధన, తప్పులను విశ్లేషించుకోవడం ద్వారా క్రమంగా మెరుగుపడతాయి. ఇక, రెండు లేదా మూడు సంవత్సరాల ప్రణాళికతో చదవడం అంటే ఎక్కువకాలం పుస్తకాలతో గడపడమే కాదు. అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, స్పష్టమైన లక్ష్యాలతో ముందుకు సాగడం. మొదటి ఏడాది ప్రాథమిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంపై దృష్టి పెట్టాలి. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాలతో చరిత్ర, భూగోళశాస్త్రం, రాజ్యాంగం, ఆర్థిక వ్యవస్థ వంటి అంశాలపై పునాది ఏర్పరచుకోవాలి. వార్తాపత్రికలు చదవడం, సిలబస్‌ను అర్థంచేసుకోవడం, రోజువారీ అధ్యయన అలవాటును పెంపొందించుకోవడం ఈదశలో ముఖ్యం. రెండో ఏడాది ప్రామాణిక పుస్తకాల అధ్యయనం, ఐచ్ఛిక సబ్జెక్టు, నోట్స్ తయారీ, గత సంవత్సరాల ప్రశ్నపత్రాల విశ్లేషణకు ప్రాధాన్యం ఇవ్వాలి. మెయిన్స్ సమాధాన రచనను క్రమం తప్పకుండా సాధన చేయాలి. రాసిన సమాధానాల్లోని లోపాలను గుర్తించి సరిదిద్దుకోవడం ద్వారా విశ్లేషణా సామర్థ్యాన్ని పెంచుకోవచ్చు. మూడో ఏడాది పరీక్షా సాధన, పునశ్చరణ, మాక్ టెస్టులు, బలహీనమైన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ప్రిలిమ్స్ ప్రశ్నలను సమయపరిమితిలో సాధన చేయడంతోపాటు మెయిన్స్ సమాధానాల నాణ్యతను మెరుగుపరచుకోవాలి. అయితే ఈ మూడు దశలను అభ్యర్థి పరీక్ష తేదీ, ప్రస్తుత పరిజ్ఞానం, వ్యక్తిగత పరిస్థితులకు అనుగుణంగా మార్చుకోవాలి. ఈ ప్రిపరేషన్‌ను ముందుగా ప్రారంభించడం వల్ల కళాశాల చదువులు లేదా ఉద్యోగంతోపాటు సన్నద్ధతను కొనసాగించేందుకు కూడా అవకాశం ఉంటుంది. అయితే దీర్ఘకాలిక ప్రణాళికలో స్థిరత్వం కోల్పోవడం, అవసరానికి మించి పుస్తకాలు, కోర్సులు సేకరించడం, పునశ్చరణను వాయిదా వేయడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అందువల్ల పరిమితమైన ప్రామాణిక వనరులు, నెలవారీ లక్ష్యాలు, క్రమబద్ధమైన స్వీయపరిశీలన అవసరం. స్థూలంగా చెప్పాలంటే, యుపిఎస్‌సి విజయం కోసం ఎక్కువ గంటలు చదవడంకంటే సమర్థంగా చదవడం ముఖ్యం. ముందస్తు సన్నద్ధత ప్రయోజనకరమే అయినప్పటికీ, ఎక్కువ సంవత్సరాలు చదివినంత మాత్రాన విజయం ఖాయమవదు. సరైన ప్రణాళిక, నిరంతర సాధన, పునశ్చరణ, సమయపాలన కలిసినప్పుడే ఫలితం లభించే అవకాశాలు మెరుగుపడతాయి.



## అమెరికాలో ఉద్యోగాలపై ఎఐ ప్రభావం



అమెరికాలో ఉద్యోగరంగంపై కృత్రిమ మేధస్సు (ఎఐ), ముఖ్యంగా జనరేటివ్ ఎఐ, గణనీయమైన ప్రభావం చూపుతున్నట్లు తాజా అధ్యయన నివేదికలు చెబుతున్నాయి. స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకుల తాజా నివేదికను అనుసరించి, ముఖ్యంగా 22 నుండి 25 ఏళ్ల వయస్సు గల యువ ఉద్యోగులు ఎక్కువగా నష్టపోయారు. కస్టమర్ సర్వీస్, అకౌంటింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి రంగాలలో ఉద్యోగావకాశాలు గణనీయంగా తగ్గాయి. ఈ రంగాలు ఎఐకి అత్యంత సులువుగా మార్పిడి చెందగలవు కాబట్టి, ఆ వయస్సు గుంపులో ఉద్యోగాలు 13 శాతం తగ్గిపోయాయి. కృత్రిమ మేధస్సు ఒకపక్క ఉత్పాదకతను పెంచుతున్నా, మరో పక్క మానవ శ్రమను భర్తీ చేస్తోంది. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం, ఈ దిశలో మార్పులు కొనసాగితే కేవలం యువత మాత్రమే కాక, మధ్యస్థాయి ఉద్యోగులు కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఎఐ యుగంలో డాటా విశ్లేషణ, ప్రాథమిక ప్రోగ్రామింగ్, సాధారణ పరిపాలనా పనులు ఇక మానవ నైపుణ్యాల కంటే వేగంగా యంత్రాల చేత పూర్తి అవుతున్నాయి. అయితే, సమస్యతోపాటు సానుకూల వాతావరణం కూడా కనిపిస్తున్నది. నిపుణుల విశ్లేషణ ప్రకారం, ఎఐ సాంకేతికత కొత్త రకాల ఉద్యోగాలను కూడా సృష్టిస్తోంది. ఎఐ సంబంధిత రంగాల్లో పరిశోధన, అభివృద్ధి, మోడల్ ట్యూనింగ్, ఎథికల్ ఎఐ నియంత్రణ, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో డిమాండ్ పెరుగుతోంది. సంప్రదాయ రంగాలలో పనిచేసే వారికి నైపుణ్యపరమైన పునరుద్ధరణ, నూతన శిక్షణ అత్యవసరం అవుతోంది. ఇలావుంటే, ఎఐ ప్రభావం కేవలం అమెరికాకు మాత్రమే పరిమితం కాదు. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ మార్కెట్ తీరుతెన్నులు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. హరిత శక్తి, అంతరిక్ష పరిశోధన వంటి అభివృద్ధి రంగాల మాదిరిగానే, ఎఐ కూడా మన జీవిత విధానాన్ని, ఉద్యోగాన్ని మార్చేస్తోంది. ఒకవైపు ఆటోమేషన్ వల్ల నిరుద్యోగం పెరిగే ప్రమాదం ఉండగా, మరోవైపు కొత్త ఉద్యోగ అవకాశాలు పెరుగుతున్నాయి. ఎఐ ప్రభావం అనివార్యం. కాబట్టి దాని పట్ల భయం కన్నా, కొత్త సాంకేతిక నైపుణ్యాలను నేర్చుకోవడం, అనుకూలంగా మారడం యువతకూ, ఉద్యోగరంగానికీ భవిష్యత్ దిశగా ముందడుగుగా మారబోతోంది.

## గీత వృత్తిదారుల నైపుణ్యత శిక్షణా కోర్సులు ప్రవేశపెట్టాలి

సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి బొమ్మగాని నాగభూషణం



**ప్రజాపక్షం/ఉప్పల్ :** గీత వృత్తిదారుల నైపుణ్యత పెంచేందుకు స్కిల్ యూనివర్సిటీలో శిక్షణా కోర్సులను ప్రవేశపెట్టాలని గీత పనివారల సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని నాగభూషణం కోరారు. సంఘం 69వ వార్షికోత్సవాల సందర్భంగా నాగోల్‌లోని ఎస్‌కె డాంగే భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత మాజీ ఎంపి ధర్మభిక్షం సహకారంతో గీత కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు, ఎక్సైజ్ సొసైటీలు, టిఎఫ్‌టిలు, నీరాలాంటి పలు ప్రాజెక్టులను పోరాడి సాధించుకున్నామన్నారు. ప్రభుత్వం గీత పనివారల కోసం సంక్షేమ పథకాలతో పాటు నీరా ప్రాజెక్టులను, స్కిల్ విశ్వ విద్యాలయంలో శిక్షణ ద్వారా మరింత ప్రావీణ్యులను చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకులు బోయిపల్లి రాములుగౌడ్, కిషోర్‌గౌడ్, మల్లేశంగౌడ్, సిహెచ్ రాములుగౌడ్, సంతోష్ మహబూబ్ యాదయ్య, రఘు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికుల సమస్యలపై ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం వీడాలి

గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరస్వామి



**ప్రజాపక్షం/నల్లగొండ :** జిల్లాలో గీత కార్మికుల నూతన సొసైటీలు, టిఎఫ్‌టీ లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గీత పనివారల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పబ్బు వీరస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కార్యాలయంలో కొత్త దరఖాస్తులకు సంబంధించిన ఫైళ్లు మాయమవుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయని, అధికారులు తక్షణమే స్పందించి అర్హులైన దరఖాస్తుదారులకు న్యాయంచేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా దరఖాస్తు చేసుకున్న గీత కార్మికుల సొసైటీలకు, టీఎఫ్‌టీ లైసెన్సులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన గీత కార్మికులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొడిగె సైదులు మాట్లాడుతూ గీత కార్మికులకు చెట్లను కేటాయించే సమయంలో చెట్టు యజమానులకు, కార్మికులకు మధ్య వివాదాలు తలెత్తకుండా స్పష్టమైన విధివిధానాలను అమలు చేయాలని, గీత కార్మికులకు మోపెడ్లు, బైకులు అందించి వారి వృత్తికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించాలని కోరారు. సమావేశంలో సంఘం జిల్లా సహ కార్యదర్శి పల్లె శంకర్, చింతపల్లి పుల్లయ్య, వనం వెంకన్న, కుంభం జయరాములు, దోటి అక్కలయ్య పాల్గొన్నారు.

## కార్మిక హక్కులు హరిస్తున్న
# లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్



**ప్రజాపక్షం/నర్సంపేట :** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలని సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గుంపెల్లి మునీశ్వర్ డిమాండ్ చేశారు. వరంగల్ జిల్లా నర్సంపేటలో సోమవారం సివిల్ సప్లై గోదాం కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక హక్కులు హరిస్తున్న మోదీ ప్రభుత్వ కార్మిక చట్టాలను రద్దు చేయాలని ఆయన కోరారు. సివిల్ సప్లై హమాలీలే కాకుండా ఇతర అన్ని రంగాలలోని కార్మికులందరూ హక్కుల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఐక్యతే కార్మికుల బలమన్నారు. కార్మికుల బలం ద్వారానే హక్కులు సాధింపబడతాయన్నారు. 31 అక్టోబర్ 1920న పుట్టిన ఎఐటియుసి నాడు కార్మిక హక్కుల కోసం పెట్టుబడిదారి వర్గాల దోపిడీకి వ్యతిరేకంగా ఆవిర్భవించిందన్నారు. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిందన్నారు. నాటి నుంచి నేటి వరకు కార్మికులతో కలిసి ఉద్యమాలు చేస్తుందన్నారు. నేడు మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలైన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపెల్లి రమేష్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కార్మికుల హక్కుల కోసం, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం ఉమ్మడిగా పోరాడవలసిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లై హమాలీ నాయకులు బక్కెర కిషోర్, ఎల్లబోయిన రవి, తుప్పతి రవి, తుప్పతి వీరాస్వామి, మహేందర్, మల్లయ్య, సాంబయ్య, యాకస్వామి తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నాలో ఎఐటియుసి డిమాండ్

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్ మాట్లాడుతూ కార్మికులకు కేటగిరీల వారీగా రూ.26000 నుంచి రూ. 42000 వరకు వేతనాలు పెంచాలని, మరణించిన వారి కుటుంబాలకు ప్రమాద బీమా కల్పించాలని కోరారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, యూనియన్ నాయకులు ఎ.నారాయణరెడ్డి, జి చంద్రశేఖర్, నక్క శంకర్, ఉప్పేరి సురేష్, గణపతి, సి. లక్ష్మి, శకుంతల, సంగీత, నరేందర్, సునీత, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



## ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల వేతన బకాయిల ఉత్తర్వులు వెంటనే జారీచేయాలి

కలెక్టరేట్ అధికారులకు సంఘం రాష్ట్ర కన్వీనర్ చక్రపాణి వినతి



**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్ :** ఆదిలాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలకు రావాలసిన పెండింగ్ వేతన బకాయిలను, ప్రొసిడింగ్ ఆర్డర్లు వెంటనే జారీ చేయాలని ఎఐటియుసి అనుబంధ ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల యూనియన్ రాష్ట్ర కన్వీనర్ తోపునూరి చక్రపాణి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రీ ప్రైమరీ ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల వేతనాలను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లోకి జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి నెలా 5వ తేదీకల్లా వేతనాలు చెల్లించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. విధి నిర్వహణలో ఉన్న వారికి తక్షణమే అధికారిక గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎఐటియుసి కార్యాలయంలో సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్రే ఐశ్వర్య మాట్లాడుతూ మొదట్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు సమయం చెప్పి, ఇప్పుడు సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్నామని, కానీ పనిచేసే సమయం పెంచినట్లు వేతనాలు కూడా పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కల్లెపల్లి గంగయ్య, యూనియన్ సహాయ కార్యదర్శి అనుక్ష, న్యాయవాది తెలంగ్ అజయ్‌కుమార్, మండల ఇన్‌చార్జీలు శిరిష, ఐశ్వర్య, శభాన, పుష్పలత, రుపిక, తరూమ్ ఫతీమ, శరీఫాతో పాటు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలు పాల్గొన్నారు.




## పనిదినాన్ని పెంచి కార్మికుల శ్రమదోపిడీ చేస్తున్న మోదీ ప్రభుత్వం

ఎఐటియుసి నేతల ఆరోపణ

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** పనిదినాన్ని పెంచి, మోదీ ప్రభుత్వం కార్మికుల శ్రమదోపిడీ చేస్తుందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్ ఆరోపించారు. కార్మికులకు వ్యతిరేకంగా, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ఆఫీస్ బేరర్‌ల సమావేశం సంఘం జరిగింది. సమావేశానికి వేల్పుల సారంగపాణి యాదవ్, జక్కు రాజుగౌడ్, మద్దెల ఎల్లేష్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి మోదీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న 44 లేబర్ కోడ్‌లను మార్చిచ కార్మికులకు ఉరితాల్లుగా మారే 4 లేబర్ కోడులను తెచ్చి కార్మిక సంఘాలను విచ్చినం చేయడానికి పూనుకుందన్నారు. మోదీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా 8 గంటల పనిదినాన్ని 12 గంటలకు పెంచి కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు ఉదృతం చేసి కార్మికులకు నష్టం చేకూర్చే నాలుగు లేబర్ కోడులను రద్దు చేసే వరకు కార్మికులందరూ పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 31న జరిగే ఎఐటియుసి 107వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కార్మికులందరూ విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో ఎఐటియుసి వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్ముల రాంమూర్తి, ఉపాధ్యక్షులు బత్తిని సదానందం, ఎఐటియుసి ప్రజాసంఘాల నాయకులు ఎన్ఎ.స్టాలిన్, లంకదాసరి అశోక్, ఆలకుంట యాకయ్య, సహాయ కార్యదర్శులు మాలోత్ శంకర్, గుంటి రాజేందర్, ఆలకుంట మల్లయ్య, కుడిస్వామి తదితరులు పాల్గొన్నారు.





## ఎండిన మూడు ఎకరాల వరి పంటకు నిప్పు పెట్టిన రైతు

**ప్రజాపక్షం/సూర్యాపేట (ఆత్మకూర్(ఎస్))** : చేతికి వచ్చిన పంట విద్యుత్ సరిగా రాక నీరు అందక ఎండిపోవడంతో కౌలు రైతు తన మూడు ఎకరాల వరి పంటకు నిప్పు పెట్టుకున్న సంఘటన ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రంలో చోటుచేసుకుంది. బాధిత కౌలు రైతు యాతాకుల మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. నీళ్ళు ఉండి కూడా విద్యుత్ సరిగా రాకపోవడంతో చేతికి వచ్చిన పంటలో కేవలం ఎకరం పంట మాత్రమే సాగుకు నోచుకొని మిగతా మూడు ఎకరాల పంట ఎండిపోవడంతో ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో పైరుకు నిప్పు పెట్టాడు. కౌలుకు తీసుకున్న భూమిని కాపడంతో పంట సాగు కోసం పెట్టిన పెట్టుబడి, రెక్కల కష్టం, కౌలు డబ్బులు ఎలా చెల్లించాలో తెలియక కుటుంబ సభ్యులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పంట నష్టాన్ని అంచనా వేసి బాధిత రైతును ఆదుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

## రైస్ మిల్లులో విషాదం.. బ్లోయర్‌లో ఇరుక్కుని డ్రైవర్ మృతి



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని శెట్టిపాలెం శివారులోని మహాతేజ రైస్ ఇండస్ట్రీలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మృతి చెందాడు.మిర్యాలగూడలోని తాళ్లగడ్డకు చెందిన మండల నాగరాజు (35) గత రెండేళ్లుగా మహాతేజ రైస్ మిల్లులో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 8 గంటలకు విధి నిర్వహణలో భాగంగా బ్లోయర్‌లో ఇరుక్కున్న తవుడును తీస్తుండగా ప్రమాదం జరిగింది. బ్లోయర్‌లోని తవుడు ఒక్కసారిగా అతనిపై పడడంతో ఊపిరాడక అక్కడికక్కడే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తోటి కార్మికులు గమనించి హుటాహుటిన మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు,అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.మృతుడు నాగరాజుకు భార్య రాణి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గతేడాదే తండ్రిని కోల్పోయిన నాగరాజు కుటుంబానికి ఏకైక ఆధారంగా ఉండేవాడు. తల్లి, భార్య, ఇద్దరు పిల్లలను పోషించేందుకు నానా అవస్థలు పడేవాడని స్థానికులు తెలిపారు. ఇప్పుడు నాగరాజు మృతితో ఆ కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తండ్రి మృతదేహం వద్ద కూతుళ్లు పడుతున్న వేదన చూసి బంధుమిత్రులు కంటతడి పెట్టారు.నాగరాజు మృతికి కారణమైన మహాతేజ రైస్ ఇండస్ట్రీ యజమాన్యం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు నార్కట్‌పల్లి అద్దంకి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.ప్రమాదం జరిగి గంటలు గడిచినా యజమాన్యం స్పందించకపోవడం, కనీసం పరామర్శించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు.

## మేళ్లచెరువు ప్రజావాణి అభాసుపాలు

ఒకే ఒక అర్జీ రావడమే దీనికి నిదర్శనం

**ప్రజాపక్షం/మేళ్ళచెరువు** : ప్రజల సమస్యను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం మేళ్ళచెరువు మండలంలో పూర్తిస్థాయిలో దారి తప్పుతోంది. అర్జీలు సమర్పించిన సమస్యలు పరిష్కారం కావనే నమ్మకం ప్రజల్లో సన్నగిల్లడానికి తాజా ప్రజావాణి సమావేశానికి కేవలం ఒకే ఒక్క దరఖాస్తు రావడమే సజీవ సాక్ష్యంగా నిలుస్తుంది. నిబంధనల ప్రకారం మండల పరిధిలోని ప్రభుత్వ శాఖల ముఖ్య అధికారులు విధిగా హాజరై బాధితుల నుంచి నేరుగా అర్జీలు స్వీకరించాల్సి ఉంది. కానీ ఇక్కడ మండల స్థాయి అధికారులు కాకుండా నిర్ణయాధికారం లేని కిందిస్థాయి సిబ్బందిని పంపి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రజావాణి కేంద్రాలు వెలవెలబోతున్నాయి. మరోవైపు దరఖాస్తులు సమర్పించి నెలలు గడుస్తున్న ఫైళ్లలో ఎలాంటి కదలికలు లేకపోవడంపై బాధితులు లబోదిబోమంటున్నారు. ఒకసారి ఇచ్చిన అర్జీలపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుండడంతో 30 రోజులు గడిచిన తర్వాత తిరిగి వచ్చి మొరపెట్టుకున్నా ఫలితం దక్కడం లేదు. ప్రభుత్వం ప్రజా సమస్యలు త్వరితగతిన పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తుంటే మండల అధికారులు మాత్రం దరఖాస్తులను బుట్ట దాఖలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారుల స్పందించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను గడువులోగా పరిష్కరించి ప్రజావాణి ఆశయాన్ని కాపాడాలని మండల ప్రజలు బలంగా డిమాండ్ చేస్తున్నారు.

## పిల్లలపై లైంగిక నేరాల పట్ల అప్రమత్తం

సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్



**ప్రజాపక్షం/కోదాడ** : పిల్లలపై జరుగుతున్న లైంగిక నేరాల విషయంలో విద్యార్థులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని కోదాడ కోర్టు సీనియర్ సివిల్ జడ్జి కె. సురేష్ పిలుపునిచ్చారు. సోమవారం సురక్షిత్ బచపన్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కోదాడలోని అశోక్ నగర్‌లో గల కెటిఎస్ స్కూల్‌లో ఫోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులందరూ మంచి స్పర్శ చెడు స్పర్శలపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తల్లిదండ్రులకు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని కోరారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు గట్ల నరసింహారావు మాట్లాడుతూ ప్రస్తుత సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థులు ఎలాంటి న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ బాణాల కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన సదస్సులో చిలక రమేష్, అకడమిక్ ఇంచార్జి రాజా, ఉపాధ్యాయులు, సంబంధిత న్యాయవాదులు, న్యాయ సేవల కమిటి సభ్యులు, ప్రభుత్వ న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## కారు ఢీకొని ఒకరి మృతి : ఇద్దరికి గాయాలు

**ప్రజాపక్షం/నకిరేకల్:** కారు ఢీకొని ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. ఈ ఘటన నకిరేకల్ మండలం తాటికల్ వద్ద జాతీయ రహదారి 365పై ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. యాదగిరిపల్లి గ్రామానికి చెందిన బంటు వెంకన్న (36) బంధువులు మంగ సైదులు, మంగ సాలయ్యలతో కలిసి నడుచుకుంటూ వెళ్తుండగా, నల్గొండ వైపు నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకన్న అక్కడికక్కడే మృతి చెందగా, సైదులుకు కాలు విరిగింది. రోడ్డు పక్కన ఉన్న బొంధు గోపికి చేతికి గాయమైంది. మృతుడి తండ్రి బంటు మట్టయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ హరిబాబు తెలిపారు.

# రైతులకు ఇబ్బందులు రానియ్యొద్దు

రైతు సంక్షేమానికి పెద్దపీట
ప్రభుత్వ విప్ వేముల వీరేశం

కొనుగోళ్ళలో జాప్యం
జరగకుండా తగిన చర్యలు



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి, వెలిమినేడు గ్రామాలల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ వేముల వీరేశం సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు అందించే సేవలు, ధాన్యం సేకరణ ప్రక్రియకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించేలా కొనుగోలు కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులు తమ ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు, కొనుగోళ్ళలో జాప్యం జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని వీరేశం సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ నర్రా వినోదమోహన్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశం, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జడల చిన్నమల్లయ్య పాల్గొన్నారు.

## ప్రతి గింజకు ప్రభుత్వం మద్దతు ధర

ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** రైతులు కష్టపడి పండించిన ప్రతి గింజకు ప్రభుత్వం మద్ధతు ధర చెల్లిస్తుందనీ దళారులను నమ్మకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యం విక్రయించాలని భువనగిరి శాసన సభ్యులు కంభం అనిల్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.సోమవారం ఆయన పోచంపల్లి పిఎసిఎస్,పిలాయిపల్లి,జగత్ పల్లి,భీమనపల్లి,జలాల్ పురం,శివారెడ్డి గూడెంలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం సేకరణ వీలైనంత తొందరగా పూర్తి చేస్తామని హామీ ఇస్తూనే ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చేసినట్లు తెలిపారు. బస్తాకు కి.గ్రా.41తూకం వేసేందుకు అందరు ఆమోదం తెలిపినట్లుగా చెప్పారు. పోచంపల్లి,జూలూరు సింగిల్ విండో చైర్మన్ లు పాక మల్లేష్ యాదవ్,కళ్ళెం రాఘవరెడ్డి వైస్ చైర్మన్‌లు కొట్టం కరుణాకర్ రెడ్డి మక్తాల రమేష్ గౌడ్ తాహశీల్దారు శ్రీనివాస్ రెడ్డి,సీనియర్ నాయకులు సామ మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

# అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్




**ప్రజాపక్షం/నూతనకల్** : ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా మండల, నియోజక వర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ పిలుపునిచ్చారు. సోమవారం గ్రామ పంచాయితీ అభివృద్ధి సామర్థ్యవృద్ధి కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిధిగా ప్రసంగించారు. ఆయా శాఖల అధికారుల పనితీరు సరిగాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో సీలింగ్ ల్యాండ్ పట్టాల జారీని నవంబర్ 10లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గుండ్లసింగారం శివారులోని పాలేరు వాగుపై నిర్మించే బ్రిడ్జి పనులు వెంటనే ప్రారంభించాలని లేనట్లయితే చర్యలు తప్పవని ఆర్‌అండ్‌బి అధికారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని నిధులతోపాటు పాఠశాల ముందు ఉన్న షాపుల కిరాయి, స్కావెంజర్ నియామకాలలో అవకతవకలు, నిధుల దుర్వినియోగం అయ్యాని సర్పంచ్ మహేశ్వరి మల్లికార్జున్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఎంఈఓపై ఆగ్రహం వ్యక్తం చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. నియోజక వర్గంలో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా వెలిశాయని వెంటనే అట్టి బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సిఐని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారి ఎంఎ భారతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆత్మ కమిటి చైర్మన్ పానుగంటి నరసింహా రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఓ సునీత, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు సత్వరమే పరిష్కారం

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సూచించారు. లేనియెడల వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 110 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్ఓ ప్రేమ్‌రాజ్, డిఎంహెచ్ఓ వెంకటరమణ, సిపిఓ కిషన్, ఎస్సి కార్పోరేషన్ ఈడి ఉపేందర్, మున్సిపల్ కమీషనర్ హనుమంత రెడ్డి పాల్గొన్నారు.

**కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలి**

నిరుద్యోగ కళాకారులకు సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు కల్పించాలని సాంస్కృతిక సేన కళాకారులు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కి విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ని మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కుమార్, పర శురాం, రవి, సంపతి విష్ణు, గట్టు సతీష్, ఆంజనేయులు పాల్గొన్నారు.



## ఎండిపోతున్న పంటలు.. అప్పుల ఊబిలో రైతులు

నాంపల్లిని కరువు మండలంగా ప్రకటించాలి
సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంజయ్య చారి

**ప్రజాపక్షం/నాంపల్లి:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు కురవక, వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయి తీవ్ర ఆర్థిక నష్టాలను ఎదుర్కొంటున్న నాంపల్లి మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. అంజయ్య చారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది సరైన వర్షపాతం లేకపోవడంతో మండలవ్యాప్తంగా వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్నాయని, సాగు కోసం విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలపై పెట్టిన పెట్టుబడులు కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.నాంపల్లి మండలాన్ని వెంటనే కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన ప్రతి ఎకరా పంటకు తగిన నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల రుణాలను మాఫీ చేయడంతోపాటు, వ్యవసాయ సంక్షోభం నుంచి బయటపడేందుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్ సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు,మండల కార్యవర్గ సభ్యుడు కోరే సత్తయ్యలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో రూ.5ల భోజనం ఏర్పాట్లు, రైతులకు కల్పిస్తున్న మద్ధత ధర గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి వెన్నుముక్క అయిన రైతాంగానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా 78వేల వరి ధాన్యం వచ్చినా గాని వరి ధాన్యానికి మూడు వేలకు పైచిలుకు సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌లో మద్ధతు ధర కల్పిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా మార్కెట్‌కి వచ్చిన రైతాంగానికి ఐదు రూపాయలకే అన్నదాతలకు అన్నం పెట్టుతున్నట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మద్ధతు ధర కల్పించాలని మార్కెట్ సెక్రటరీని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ అబ్దుల్ కరీం, సెక్రటరీ ఫసియోద్దీన్, సిబ్బంది ఖాసీం, గౌస్, నాయకులు రాపర్తి నాగరాజు, నర్సింగ్ కిరణ్, రావుల రమేష్, సత్యనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు

మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : సాగర్ రోడ్డులో రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని నగర మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సాగర్ రోడ్డులో గల వైయస్సార్ విగ్రహం నుంచి మెడికల్ కళాశాల వరకు మేయర్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున మంత్రి ఆదేశాల మేరకు రోడ్డును పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు.మంత్రి సూచన మేరకు రోడ్డుకు సెంటర్ నుంచి 50 ఫీట్లు ఉండే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు త్వరితగతన చర్యలు తీసుకోవాలని తెలిపారు.డివైడర్లు ఏర్పాటు చేసే వరకు ప్రమాదాలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ అమేర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్‌పిటిసి గుమ్ముల మోహన్ రెడ్డి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, కార్పొరేటర్లు ఇబ్రహీం,మామిడి కార్తీక్, పాలకూరి సంతోష్,మాజీ కౌన్సిలర్ ఆంగోతు ప్రదీప్ నాయక్,చిన్నాల జానయ్య, దండంపల్లి పరుశురాం,నేషనల్ హైవే,ఆర్‌అండ్ బి,మున్సిపల్ అధికారులు,ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు బిజెపి పాలనపై విసుగు చెందారు

ఎఐసిసి పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి ఆరోపణ : ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపు




**ప్రజాపక్షం/ నల్లగొండ:** ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగిన ఓటు చోరీని నిరసిస్తూ నవంబర్ 1న చేపట్టే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎఐసిసి పరిశీలకులు రాంభూపాల్ రెడ్డి,టిపిసిసి ఉపాధ్యక్షుడు వినోద్ రెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం పట్టణంలోని యాదవ సంఘ భవన్‌లో డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాస్ నేత అధ్యక్షతన జరిగిన జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు.ప్రధాని మోదీ, అమిత్ షా, సీఈసీ జ్ఞానేష్ కుమార్ కుట్రపూరితంగా దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్లను తొలగించారని, ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని విమర్శించారు.గత 12 ఏళ్ల మోదీ పాలనలో ఎస్సి ఎస్టి, ఓబీసీ,మైనారిటీ, ఆదివాసులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదని, ప్రజలు బీజేపీ పాలనపై విసుగు చెందారని అందుకే ఓటు చోరీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించి, భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడి దేశాన్ని రక్షించుకుందామనే నినాదంతో ఛలో ఢిల్లీ చేపడుతున్నట్లు తెలిపారు.నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదాన్‌లో జరిగే మహా ర్యాలీకి నల్గొండ జిల్లా నుంచి సుమారు 2 వేల మంది హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు జిల్లపల్లి పరమేష్,ఎస్‌పి సెల్ అధ్యక్షుడు బోడ స్వామి,టీపీసీసీ మేనిఫెస్టో సభ్యుడు చామల శ్రీనివాస్,ఐఎన్‌టియూసీ జిల్లా అధ్యక్షుడు అంబటి సోమయ్య,మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ చిలుకూరి బాలకృష్ణ, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు గతగోని కొండయ్య,లింగాల వెంకన్న, ఎడ్ల ప్రవీణ్,అల్లంపల్లి జానయ్య,గాయం శ్యామ్ సుందర్ రెడ్డి, ఎదులపురి కృష్ణ,ఎల్లంపల్లి నరసింహ,మర్ల చంద్రారెడ్డి,మేకల సాగర్ రెడ్డి,భీమనపల్లి సైదులు,మహిళా ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య,జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ ముంతాజ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ప్రాణదానంతో సమానం

ఎస్‌పి కె. నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిభిరాన్ని నిర్వహించా రు. ఈ సందర్భంగా ఎస్‌పి మొదట రక్తదానం ఇ చ్చి ప్రారంభించగా డిఎస్‌పి నరసింహచారి, నాగా రం సిఐ నాగేశ్వరరావు, సిఐలు రామారావు, శివకుమార్, ఆర్ఐలు ప్రవీణ్, జానయ్య, ఎస్ఐలు, సిబ్బంది రక్తదానం చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ అమరవీరుల త్యా గాల స్మారకంగా ఈ రక్తదాన శిభిరాన్ని నిర్వహించి ప్రజా సేవలో పోలీస్ శాఖ ముందుందన్నారు. అత్యవసర సమయాల్లో సైతం ప్రజలకు ఎల్లప్పు డూ అందుబాటులో ఉంటామని స్పష్టం చేశారు. ఖమ్మంకు చెందిన తలసేమియా, సికిల్ సెల్ సొసై టీ వారు వ్యాధితో బాధపడుతున్న పిల్లల కోసం రక్తాన్ని సేకరించినట్లు వివరించారు. పోలీసుల త్యాగాలు, బలిదానాలను ప్రజలు గుర్తించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులతో భాగస్వాములు కావాలని కోరారు. ఈ శిభిరంలో పోలీస్ సిబ్బంది, ఆటో యూనియన్ వారు కలిసి 150 మందికి పైగా రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, ఏఆర్ డిఎస్‌పి నరసింహాచారి, డిసిఆర్‌బి డిఎస్‌పి రవి, సిఐలు రాజశేఖర్, నాగేశ్వరరావు, వెంకటయ్య, రామారావు, శివకుమార్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు టోల్ ఫ్రీ నంబర్

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : ఎల్ నినో పరిస్థితుల దృష్ట్యా నిత్యావసర సరుకుల ధరలను నియంత్రణలో ఉంచాల్సిన బాధ్యత ప్రభుత్వం, వ్యాపారులపై ఉందని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. ఎల్ నినోను సాకుగా తీసుకొని ధరలు పెంచితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి ధరల నియంత్రణ పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కిరాణా, నూనె, పెట్రోల్, డీజిల్, బియ్యం, పప్పు దినుసులు తదితర నిత్యవసర వస్తువులు విక్రయించే హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు చట్టానికి వ్యతిరేకంగా ధరలు పెంచవద్దని సూచించారు.నో స్టాక్ బోర్డులు పెట్టడం,ఉన్న ధరల కంటే ఎక్కువకు అమ్మడం,సిండికేట్‌గా ఏర్పడి ధరలు పెంచడం వంటి చర్యలకు పాల్పడితే నిత్యవసర వస్తువుల చట్టం, బ్లాక్ మార్కెటింగ్ నిరోధక చట్టం కింద చర్యలు తప్పవని హెచ్చరించారు.ఎక్కడైనా అక్రమంగా పెంపు ఉంటే సమాచారం అందించేందుకు కలెక్టర్ కార్యాలయంలో టోల్ ఫ్రీ నంబర్ 9281423653 ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ నంబర్‌కు సమాచారం తెలియజేయాలని కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, పౌర సరఫరాల డీఎం రాంపతి నాయక్,మార్కెటింగ్ ఏడీ ఛాయా దేవి, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, హార్టికల్చర్ అధికారి శేఖర్, నిత్యవసర సరుకుల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమ గుడుంబా ధ్వంసం చేసిన సర్పంచ్



ప్రజాపక్షం/తాడ్వాయి: మండలంలోని లింగాల గ్రామపంచాయతి సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ గారి ఆధ్వర్యంలో మహిళా సంఘాల సహకారంతో గ్రామంలోని గుడుంబా తయారీదారుల ఇండ్లల్లో సోదాలు చేసి పట్టుబడిన గుడుంబా డ్రమ్ములని ప్లాస్టిక్ క్యాన్‌లని, తయారీకోసం వాడే బెల్లం పానకాన్ని పారబోసి తయారీదారులని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేక, పంటలు చేతికి రాక ప్రజలు ఇబ్బంది పడుతుంటే గుడుంబాతో రైతులను, ప్రజలను మరింత ఆర్థికంగా దిగజారుస్తు తమ జేబులు నింపుకోవాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని గుడుంబాలో నాసిరకమైన వివిద రకాల మత్తు పదార్థాలు కలుపుతూ యువకుల బంగారు భవిష్యత్‌ను దెబ్బతీస్తున్నారని, దీని వలన యువత అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతూ వారి కుటుంబాలు బజారున పడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాల డబ్బులు గుడుంబా అమ్మే వారి వద్దకే వెళ్తున్నాయని సమస్య ఇలాగే కొనసాగితే ప్రజలు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకొవాల్సి వస్తుందని ఈ సమస్య పూర్తిగా అంతరించి పోవాలంటే మహిళా సంఘాలు, వివిధ కుల సంఘాలు, ప్రజలు కలిసి పరిష్కారించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గడుంబా అమ్మే వారికి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు వర్తించవని, వారిపై యాభై వేల వరకు జరిమానా విధించడం జరుగుతుందని గ్రామ పంచాయతీలో తీర్మానం చేశారు. అలాగే గుడుంబా తయారీదారుల సమాచారం ఇచ్చిన వారిని ప్రశంసించడంతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మోడం రాజేష్, వార్డుమెంబర్లు, మహిళా సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



ప్రజాపక్షం/వరంగల్ : వాల్మీకి మహర్షి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలి వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదలు అన్నారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన వాల్మీకి జయంతి వేడుకల్లో వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేర కార్పొరేషన్ చైర్మెన్ సంగ వెంకట రాజం, గ్రంథాల చైర్మెన్ మీసాల ప్రకాశ్, అదనపు కలెక్టర్‌లు కిషోర్ కుమార్, వైవి గణేష్, వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు పుష్పలత, కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొని వాల్మీకి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ రామాయణ మహాకావ్యాన్ని రచించిన మహర్షి వాల్మీకి జీవితం మనందరికీ ఆదర్శప్రాయుడన్నారు. మహర్షి వాల్మీకి చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన బోధనలను మన జీవితాల్లో ఆచరించాలి. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యతనిస్తూ, సమాజ అభివృద్ధికి తమ వంతు కృషి చేయాలి. మహర్షి వాల్మీకి ఆశయాలను భావితరాలకు అందిస్తూ, సమానత్వం, సామాజిక ఐక్యతతో కూడిన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ జయంతి వేడుకలో సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సత్యం, ధర్మం, నైతిక విలువలు ప్రతి ఒక్కరూ ఆచరించాలి

కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ప్రజాపక్షం/ములుగు: మహర్షి వాల్మీకి ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సత్యం, ధర్మం, నైతిక విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనాతో కలిసి జిల్లా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామాయణ మహాకావ్యం ద్వారా సత్యం, ధర్మం, మానవీయ విలువలను చాటిన మహనీయుడు వాల్మీకి అని పేర్కొన్నారు. ఆదికవిగా భారతీయ సాహిత్యంలో విశిష్ట స్థానం పొందారని తెలిపారు. రామాయణంలో వివరించిన కుటుంబ బంధాలు, బాధ్యతలు, నైతిక విలువలు నేటి సమాజానికి మార్గదర్శకమని అన్నారు. యువత మహనీయకుల జీవితాలను అధ్యయనం చేసి వారి ఆదర్శాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్‌రావు, జిల్లా రెవెన్యూ అధికారి రవి కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి రామ్మోహన్, వాల్మీకి కుల సంఘం సభ్యులు, సంబంధిత తదితరులు పాల్గొన్నారు.

## నల్లబెల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

ప్రజావాణిలో సిపిఐ మెమోరాండం

ప్రజాపక్షం/నల్లబెల్లి : తీవ్ర వర్షాభావ పరిస్థితులలో నల్లబెల్లి మండలంలో ఆహార వాణిజ్య పంటల విస్తీర్ణం గణనీయంగా తగ్గడమే కాకుండా వేసిన పంటలు కూడా సాగునీళ్ళు సరిపడలేక పోవడంతో కొంత మేర పంటలు ఎండిపోతున్నాయని, తాగునీరు ఎద్దడి కూడా తీవ్రం రూపం దాల్చే ప్రమాదం ఉందని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చింతకింది కుమారస్వామి అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి కడియాల క్రాంతి కుమార్ తో కలిసి అధికారులకు మెమోరాండం సమర్పించారు. అక్టోబర్ 31న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలోని కరువు బాధిత ప్రాంతాల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం పంపించబోతుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆ కరువు నివేదికలో నల్లబెల్లి మండలాన్ని చేర్చాలనీ, అందుకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించడానికి మండల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని మెమోరాండంలో కోరారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు సాగు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. కరువు బారిన పడిన ప్రాంతాలను గుర్తించి ప్రజల జీవన విధానాన్ని కాపాడేందుకు అధికారులు స్థానానికి చర్యలు చేపట్టాలన్నారు.

# వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత ప్రచారం

స్వేచ్ఛా రథం జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్

ప్రజాపక్షం/వరంగల్ : వెట్టిచాకిరీకి గురైన కార్మికులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, బాధితులకు అవసరమైన సహాయాన్ని అందించడంలో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో స్వేచ్ఛా రథం ప్రచార వాహనాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, మేర కార్పొరేషన్ చైర్మెన్ వెంకట్రాజం, గ్రంథాల చైర్మన్ మీసాల ప్రకాశ్‌లు ప్రారంభించి, అనంతరం గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వర్ధన్న పేట ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వెట్టిచాకిరీపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఘటనలను గుర్తించడంలో ప్రభుత్వ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, బాధితులను సకాలంలో గుర్తించి రక్షణ, పునరావాసం, అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని, ఎక్కడైనా వెట్టిచాకిరీ జరుగుతున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర అసంఘటిత కార్మిక రంగాల్లో వెట్టిచాకిరి చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయని, వారిని అరికట్టుటకు అవగాహన కల్పించాలన్నారు. అడ్వాన్స్‌లు, అప్పులు, వేతనాలు నిలిపివేయడం, బెదిరింపులు, బలవంతం, మోసం వంటి పద్ధతుల ద్వారా కార్మికులను పనిలో బంధించే పరిస్థితులు ఏర్పడవచ్చని, అలాంటి పరిస్థితులను గమనించి లేబర్స్‌కు న్యాయం చేయాలని పేర్కొన్నారు. కొన్నిసార్లు బాధితులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించలేకపోవడం, హక్కులపై అవగాహన లేకపోవడం, యజమానుల నుంచి ప్రతీకార చర్యలు ఎదురవుతాయనే భయంతో ఫిర్యాదు చేయకపోవడం వల్ల ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం లేనిదని, ఇలాంటి వెట్టి చాకిరి పనుల వర్కర్స్ కు అవేర్నెస్ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులు ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ 08069434343 గురించి విస్తృతంగా ప్రచారం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. వెట్టిచాకిరీ అనేది కార్మికుల స్వేచ్ఛను హరించి, వారి హక్కులను కాలరాసే తీవ్రమైన దోపిడీ అని పేర్కొన్నారు. స్వేచ్ఛా రథం వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలకు, ముఖ్యంగా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలి, ఎక్కడ ఫిర్యాదు చేయాలి, బాధితులకు ఎలాంటి ప్రభుత్వ సహాయం అందుబాటులో ఉంది అనే అంశాలను ప్రచార రథం ద్వారా వివరించనున్నారని పేర్కొన్నారు. వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి ప్రజలు, కార్మికులు, ప్రభుత్వ శాఖలు సమన్వయంతో కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, వరంగల్ భార్గవ్ ప్రభుత్వ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయడం తమ బాధ్యతగా నిర్వర్తిస్తామని అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో కార్మిక శాఖ, పోలీసు శాఖ, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఎహెచ్‌టియు), జిల్లా న్యాయ సేవల సంస్థ (డి ఎల్ఎస్ఏ), మహిళా, శిశు అభివృద్ధి శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు భాగస్వాములయ్యారు. సమాచార, పౌర సంబంధాల శాఖ, మీడియా అకాడమీ సహకారంతో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నామని లేబర్ ఆఫీసర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## వాల్మీకి మహర్షి జీవితం అందరికీ స్ఫూర్తిదాయకం: కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ: వాల్మీకి మహర్షి జీవితం, ఆయన రచించిన రామాయణం మానవాలికి ఎల్లప్పుడు స్ఫూర్తిదాయకమని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళ్లు అర్పించారు. జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆదికవిగా ప్రసిద్ధి చెందారని, ఆయన రచించిన రామాయణం మానవ జీవితానికి మార్గదర్శకమని వెల్లడించారు. అదనపు కలెక్టర్ బెన్షాలోం, ఆర్‌టిఏ సభ్యులు చిలువేరు అభిగౌడ్, జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సభ్యులు వాల్మీకి మహర్షి చిత్రి పటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో వెనకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారి ఎన్ఎల్ నరసింహారావు, వాల్మీకి బోయ సంఘం జిల్లా అధ్యక్షులు కెంగర్ల మల్లేష్, కార్యదర్శి వెంకటేష్, సీనియర్ జర్నలిస్టు కన్నా పరశురాములు, జిల్లా కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి జాయ మల్లేశం, అభినాస్, ఐడిఓసి సిబ్బంది

## అక్రమ రవాణాను అడ్డుకోవడమే లక్ష్యం: కలెక్టర్

ప్రజాపక్షం/హనుమకొండ : వెట్టిచాకిరీపై అవగాహన కల్పించడం, బాండెడ్ లేబర్ టోల్‌ఫ్రీ హెల్ప్ లైన్ 08069434343ను ప్రజలకు చేరువ చేయడం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రవ్యాప్త అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా స్వేచ్ఛ రథం వాహనాన్ని సోమవారం కలెక్టరెట్‌లో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చేతుల మీదుగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచార వాహనం హనుమకొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ, వెట్టిచాకిరీ, కార్మికుల హక్కులు, దోపిడీకి గురైన సందర్భాల్లో ఫిర్యాదు చేసేందుకు అందుబాటులో ఉన్న విధానాలపై ప్రజలకు, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు అవగాహన కల్పించనుంది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ... వెట్టిచాకిరీ నిర్మూలనకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని, వెట్టి చాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించడం, వారిని రక్షించడం, పునరావాసం కల్పించడం, అవసరమైన సహాయాన్ని అందించడం కోసం సంబంధిత శాఖలు కృషి చేయాలని పేర్కొన్నారు.వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు వెట్టిచాకిరీ చోటుచేసుకునే అవకాశం ఉన్న ఇతర పని ప్రదేశాల్లోని అసంఘటిత, ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మిక రంగాలపై ఈ ప్రచారం ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన సహకారం అందిస్తుందని.... ఇందులో భాగంగా ఐఇసి (సమాచారం, విద్య, కమ్యూనికేషన్) సామగ్రిని ప్రజలకు అందించడంతో పాటు, ప్రజలు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉన్న కార్మికులకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ గురించి విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ఎన్‌జిఒకి సంబందించిన బృందం వెట్టిచాకిరి నిర్మూలన పైన ప్రదర్శించిన నాటకం అందరిని ఆకట్టుకుంది. అనంతరం ప్రభుత్వ అధికారులు తమ విధి నిర్వహణలో భాగంగా వెట్టిచాకిరీకి గురైన వ్యక్తులను గుర్తించి, వారిని రక్షించి, పునరావాసం కల్పించడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, భార్గవ్ కార్మిక శాఖ, పోలీసు శాఖ/యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్ టియు), జిల్లా న్యాయ సేవల సంస్థ (డిఎల్ఎస్ఏ), మహిళా, శిశు అభివృద్ధి శాఖ తదితర సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ శాఖల అధికారులు 'ప్రమాణం యాప్‌లో'

## వివరాలు నమోదు చేసుకోవాలి

కలెక్టర్ రాహుల్ శర్మ



ప్రజాపక్షం/భూపాలపల్లి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా మీ ప్రమాణం యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం ముగిసిన అనంతరం మీ ప్రమాణం యాప్‌లో నమోదుపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు కేవలం 19 శాఖల అధికారులు మాత్రమే మీ ప్రమాణం యాప్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన అన్ని శాఖల అధికారులు, సిబ్బంది కూడా ఎలాంటి జాప్యం చేయకుండా యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. మీ ప్రమాణం యాప్ ద్వారా హాజరు నమోదును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. కాబట్టి జిల్లాలోని అన్ని శాఖలు ఈ ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మీ ప్రమాణం యాప్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు, సలహాలు లేదా సూచనలు ఉంటే జిల్లా నోడల్ అధికారి, ఇడిఎం శ్రీకాంత్‌ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, ఇడిఏ శ్రీకాంత్ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ప్రజాపక్షం/నడికూడ: నడికూడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...నడికూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు మరింత చేరువవుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రైవేటు హాస్పిటల్స్ కు దీటుగా ప్రభుత్వ హాస్పిటల్స్ ఉన్నాయని తెలిపారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందేలా అవసరమైన చర్యలు చేపడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నడికూడ సర్పంచ్ మలహాల్ రావు, సర్పంచ్‌లు, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక చట్టాలను తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/భూపాలపల్లి: కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం అనేక కీలక కార్మిక చట్టాలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని చెల్పూర్ కెటిపిపిలో తెలంగాణ విద్యుత్ ఉద్యోగులు, చేతి వృత్తి నిపుణులు, ఒప్పంద కార్మికులతో తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం 327 (ఐఎన్‌టియుసి) అనుబంధ 73వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం అనేక కీలక కార్మిక చట్టాలను తీసుకువచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమే అని గుర్తుచేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కార్మికుల సంక్షేమానికి కృషి చేసి 8 గంటల పని విధానం అమలుకు మార్గం సుగమం చేశారని తెలిపారు. జెన్‌కో, సింగరేణి, ఆర్‌టిసితో పాటు అన్ని రంగాల కార్మికుల హక్కులను, సంక్షేమాన్ని కాపాడేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్మికుల హక్కులను హరించే విధానాలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంలో ఐఎన్‌టియుసి కీలక కార్మిక సంఘంగా పని చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, ఐఎన్టీయూసీ నాయకులు జోగబుచ్చయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జెన్‌కో ఉద్యోగులు, చేతి వృత్తి నిపుణులు, ఒప్పంద కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



## బాణాసంచా విక్రయాలకు దరఖాస్తు చేసుకోవాలి: సిపి శ్వేత

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : రానున్న దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలిక బాణాసంచా విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు కోరే వారు, అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన పూర్తి దరఖాస్తులను నవంబర్ 2వ తేదీలోపు సంబంధిత డిసిపి కార్యాలయంలో సమర్పించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపిఎస్ తెలిపారు. దరఖాస్తుతో పాటు అగ్నిమాపక శాఖ జారీ చేసిన ఎన్ఒసి, స్థల యజమాని లేదా సంబంధిత ప్రభుత్వ అధికారి అనుమతి పత్రం, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, గతంలో లైసెన్స్ ఉంటే దాని ప్రతితో పాటు, అవసరమైన చోట్ల పక్క స్థల యజమానుల అనుమతి పత్రాలు, సైట్ ప్లాన్ బ్లూప్రింట్ సమర్పించాలని సూచించారు. అలాగే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆధాలత్ శాఖలో ప్రభుత్వ ఖజానాకు రూ.800 చెల్లించిన బ్యాంక్ చలాన్‌ను జతచేయాలని, దరఖాస్తులను పరిశీలించిన అనంతరం సంబంధిత డిసిపి స్థాయి అధికారులు నిబంధనల ప్రకారం అనుమతులు జారీ చేస్తారని తెలిపారు.ఎలాంటి అనుమతులు లేకుండా బాణాసంచా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు.

## అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

భూపాలపల్లిలో పోలీసుల బైక్ ర్యాలీ

ప్రజాపక్షం/భూపాలపల్లి: పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, దేశ రక్షణతో పాటు ప్రజల భద్రత కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసుల సేవలు వెలకట్టలేనివని అదనపు ఎస్పి నరేష్ కుమార్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ ఆదేశాల మేరకు సోమవారం భూపాలపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీని అదనపు ఎస్పి నరేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అక్కడి నుంచి జయశంకర్ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీస్ అధికారులు, సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పి నరేష్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణతో పాటు దేశ భద్రత కోసం పోలీసులు చేస్తున్న సేవలు అమూల్యమైనవని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన అమరవీరుల ధైర్యసాహసాలు, అంకితభావం ప్రతి పోలీస్ సిబ్బందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం మాత్రమే కాకుండా, వారు చూపిన సేవా మార్గంలో పయనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించడమే అమరవీరులకు అందించే నిజమైన నివాళి అని తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, అమరవీరుల సేవలు, త్యాగాల పట్ల సమాజంలో గౌరవ భావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ దేశ సేవ, ప్రజా సేవ పట్ల అంకిత భావంతో పనిచేయాలని పోలీస్ సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఆర్ఐలు రత్నం, సంతోష్, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలి: రాజశేఖర్

ప్రజాపక్షం/తొర్రూరు : బాల వికాస ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలకు చేయూతనందించాలని తొర్రూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ అన్నారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో సోమవారం బాల వికాస స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధులు, దివ్యాంగులు, అనాథలకు దాతల సహాయంతో సమకూర్చిన నిత్యావసర సరుకులు, దుస్తులు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. బాల వికాస సెంటర్ మేనేజర్ వై.రమ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాల వికాస మహిళా ప్రోగ్రాం మేనేజింగ్ డైరెక్టర్ లతా ప్రతాప్, వైస్ చైర్మన్ సోమరజిని రాజశేఖర్‌లు మాట్లాడుతూ సమాజంలో నిస్సాహయులను, అనాథలను, వృద్ధులను ఆదుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రస్తుత కాలంలో మానవతా విలువలు పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. కష్టాల్లో ఉన్న తోటి వారికి సహాయం చేయడం ద్వారానే నిజమైన మానవత్వం కలుగుతుందన్నారు. దాతలు తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, కె.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కర్నె నాగరాజు, శ్రీమాత ఆయిల్ నిర్వాహకులు రేవూరి ధనలక్ష్మి శ్రీధర్, నిమ్మల శోభన్, సాంబ శివ కిరాణం నిర్వాహకులు సాయి అద్వితలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బొడ్లాడ సర్పంచ్ వెంకన్న, కర్నె నాగజ్యోతి, బాల వికాస మేనేజర్ వై.రమ, కోఆర్డినేటర్ ఎం.రమ, ప్రతినిధులు శైలజ, శోభ, సరిత, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

